PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

# ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 45 సంచిక : 80 | విజయవాడ, సోమవారం 20 అక్టోబర్ 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Monday 20 October 2025 | Rs

## భారత్‌పై ఆస్ట్రేలియా విజయం



- నిరాశపరిచిన కోహ్లి, రోహిత్
- తొలి వన్డేలో టీమిండియా పరాజయం
- భారత్ 136/9, ఆస్ట్రేలియా 131/3

8






సదస్సులో మాట్లాడుతున్న పివి రమేష్, వేదికపై వడ్డే శోభనాద్రీశ్వరరావు, లక్ష్మణరావు, వి శ్రీనివాసరావు, కె రామకృష్ణ, ఆలా వెంకటేశ్వర్లు, తులసిరెడ్డి తదితరులు

## వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా

# రాష్ట్రవ్యాప్త ఉద్యమం

**సదస్సులో వక్తల పిలుపు • పివి రమేష్, ఆలా వెంకటేశ్వర్లు, కెఎస్ లక్ష్మణరావు ఆధ్వర్యాన పరిరక్షణ కమిటీ**

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి కేటాయించిన వైద్య కళాశాలల ప్రైవేటీకరణ (పిపిపి)కు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమానికి పలువురు వక్తలు పిలుపునిచ్చారు. వైద్య కళాశాలల విషయంలో రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. విజయవాడలోని ఎంబివికెలో ఎపి మెడికోస్ పేరెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ వైద్య కళాశాలల పబ్లిక్, ప్రైవేట్ పార్టనర్షిప్‌కు వ్యతిరేక పోరాట సదస్సును ఆదివారం నిర్వహించారు. ఈ సదస్సుకు జన చైతన్య వేదిక అధ్యక్షులు వి లక్ష్మణరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ మాజీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పివి రమేష్ మాట్లాడుతూ.. పిపిపి విధానంలో 10 ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేయడాన్ని తక్షణమే నిలిపివేయాలని, వాటిని ప్రభుత్వమే నిర్మించి, నిర్వహించాలని కోరారు. దక్షిణాది రాష్ట్రాలతో పోలిస్తే ప్రభుత్వ వైద్యంలో మన రాష్ట్రం చివరి స్థానంలో నిలిచిందన్నారు. గత ప్రభుత్వం సెల్ఫ్ ఫైనాన్సింగ్ విధానంలో సీట్లు అమ్మితే, ప్రస్తుత ప్రభుత్వం పిపిపి విధానంలో వైద్య కళాశాలలనే అమ్మేందుకు సిద్ధమైందని పేర్కొన్నారు. నిధుల లేమిని సాకుగా చూపి ప్రభుత్వం బాధ్యత నుంచి తప్పించుకోవడం, బంధుమిత్రులకు ప్రభుత్వాస్తులను పంచిపెట్టేందుకే పిపిపి విధానాన్ని అమలు చేస్తోందన్నారు. వైద్యాన్ని ప్రైవేటుపరం చేయడం రాజ్యాంగ వ్యతిరేక చర్యగా అభివర్ణించారు.

ఎపి మెడికోస్ పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఆలా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. గూగుల్ డేటా సెంటర్‌కు ఇస్తున్న రాయితీలో 4వ వంతు వైద్య రంగానికి కేటాయిస్తే, అంతకంటే ఎక్కువ ఉద్యోగాలతోపాటు పరోక్షంగా ఎందరికో ఉపాధి కల్పించవచ్చన్నారు. సదస్సుకు అధ్యక్షత వహించిన వి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ.. ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశాల్లో విద్య, వైద్యం ప్రభుత్వాలే అందిస్తున్నాయని, రాష్ట్రంలో కూడా ఈ రంగాలను ప్రభుత్వమే నిర్వహించాలని కోరారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వైద్య కళాశాలలను పిపిపి విధానంలో కేటాయించేందుకు ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల సంఖ్య 590ను తక్షణమే ఉపసంహరించుకోవాలని, గత ప్రభుత్వం జారీ చేసిన సెల్ఫ్ ఫైనాన్స్ పేరిట తెచ్చిన ఉత్తర్వులు 107, 108ను అమలు చేయొద్దని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ సదస్సు తీర్మానించింది. వైద్య కళాలలను పిపిపి విధానంలో నిర్వహించడానికి వ్యతిరేకంగా వివిధ రూపాల్లో ఆందోళన కార్యక్రమాలు జరపాలని తీర్మానించారు.

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ప్రభుత్వానికి ధైర్యం ఉంటే ప్రైవేటు వైద్య కళాశాలలపై సిబిఐ ఇచ్చిన నివేదికను బయటపెట్టాలన్నారు. విజన్-2047 పేరుతో రాష్ట్రంలో ధ్వంస రచన చేస్తున్నారని పేర్కొన్నారు. పిపిపి విధానం అంటే ప్రభుత్వ మిగతా 2లో

## జెఇఇ మెయిన్-2026
# షెడ్యూల్ విడుదల

- జనవరి 21 నుంచి తొలి సెషన్

**న్యూఢిల్లీ :** జెఇఇ మెయిన్-2026 షెడ్యూల్‌ను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) ఆదివారం విడుదల చేసింది. రెండు సెషన్లలో ఈ కంప్యూటర్ ఆధారిత పరీక్షను నిర్వహించనున్నట్లు పేర్కొంది. జనవరి 21 నుంచి 30 మధ్య తేదీల్లో జెఇఇ మెయిన్ (సెషన్ 1), ఏప్రిల్ 1 నుంచి 10వ తేదీల మధ్య సెషన్-2 పరీక్షలు నిర్వహించనున్నట్లు ఓ ప్రకటనలో వెల్లడించింది. ఈ పరీక్షలు జరిగే కచ్చితమైన తేదీలను తర్వాత ప్రకటించనున్నట్లు అధికారులు తెలిపారు. జెఇఇ మెయిన్ సెషన్-1 పరీక్షకు ఈ నెల నుంచే ఆన్‌లైన్ దరఖాస్తులు వెబ్‌సైట్‌లో అందుబాటులోకి వస్తాయని ఎన్‌టిఎ పేర్కొంది.

సెషన్-2 పరీక్షకు జనవరి ఆఖరివారం నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు. దేశవ్యాప్తంగా జరిగే ఈ పరీక్షకు భారీ సంఖ్యలో అభ్యర్థులు హాజరయ్యేలా ఎగ్జామ్ సిటీల సంఖ్యను పెంచేందుకు కృషిచేస్తున్నామని, వికలాంగ అభ్యర్థుల అవసరాలను తీర్చడంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టామని పేర్కొంది. జెఇఇ మెయిన్ (మెయిన్) 2026 పరీక్షను సజావుగా నిర్వహించడంలో భాగంగా అర్హత కలిగిన అభ్యర్థులంతా ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకునే ముందే అవసరమైన డాక్యుమెంట్లను అప్‌డేట్ చేసుకోవాలని ఎన్‌టిఎ ఇటీవల కోరింది. ఆధార్ కార్డులో పేరు, పుట్టిన తేదీ (పదో తరగతి సర్టిఫికెట్ ప్రకారం) సరిగా ఉండేలా అప్‌డేట్ చేసుకోవాలని, తాజా ఫొటోగ్రాఫ్, ఇంటి అడ్రస్, తండ్రి పేరు అప్‌డేట్ అయి ఉండాలని తెలిపింది.

**వికలాంగ అభ్యర్థులైతే..:** యుడిఐడి కార్డు చెల్లుబాటవుతుంది. రెన్యువల్ చేయించుకుని అప్‌డేట్‌గా ఉండటం తప్పనిసరి.

అలాగే, అభ్యర్థులు ఎప్పటికప్పుడు www.nta.ac.in, https://jeemain.nta.nic.in అధికారిక వెబ్‌సైట్‌లను చెక్ చేసుకోవాలని ఎన్‌టిఎ డైరెక్టర్ (పరీక్షలు) ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. తద్వారా జెఇఇ మెయిన్ పరీక్షకు సంబంధించిన నోటీసులు, ఇతర అప్‌డేట్స్ తెలుసుకోవచ్చన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న సిఎం చంద్రబాబు నాయుడు

# మేధోమథనానికి వేదికగా విశాఖ

## మానవ వనరులే మన మూలధనం

## సిఐఐ సదస్సుపై సమీక్షలో సిఎం చంద్రబాబు

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

విశాఖలో నవంబరు 14, 15 తేదీల్లో నిర్వహించనున్న భాగస్వామ్య సదస్సులో పెట్టుబడులతో పాటు పాజిటివ్ పాలసీ మేకింగ్, వివిధ అంశాలపై మేధోమథనం, నాలెడ్జ్ షేరింగ్‌పై చర్చలు జరిగేలా కార్యాచరణ చేపట్టాలని అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ఉండవల్లిలోని ఆయన క్యాంపు కార్యాలయంలో విశాఖ భాగస్వామ్య సదస్సు నిర్వహణపై సిఐఐ ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులతో ఆదివారం సమీక్షించారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ.. విశాఖలో జరిగే భాగస్వామ్య సదస్సులో దావోస్ తరహాలోనే పెట్టుబడిదారులు, విధాన నిర్ణేతలు మధ్య చర్చలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. అంశాల వారీ చేపట్టే ఈ సెషన్లలో విధానాలపై మేధోమథనం జరిగితే పరిశ్రమలు, ప్రభుత్వానికి మేలు కలుగుతుందన్నారు. ఎఐ ఫర్ గుడ్, సెమీ కండక్టర్స్, ఆరోగ్య రంగం, ఇన్నోవేషన్స్, స్పేస్, డ్రోన్, ఎలక్ట్రానిక్స్, మెడ్ టెక్ వంటి అంశాలపై సదస్సులో చర్చించాలని సిఎం పేర్కొన్నారు. స్మార్ట్ మాన్యుఫ్యాక్చరింగ్, చైన్ లింకేజ్‌తో పాటు నాణ్యమైన ఉత్పత్తుల తయారీ వంటి అంశాలపై చర్చించాలన్నారు. లాజిస్టిక్స్ రంగంలో రహదారులు, అంతర్గత జలరవాణా, వేర్‌హౌస్, కోల్డ్ స్టోరేజీలు వంటి అంశాలతో పాటు అగ్రిటెక్, రేర్ ఎర్త్ మినరల్స్‌లో విలువ జోడింపు, స్వచ్ఛాంధ్ర సర్క్యులర్ ఎకానమీ, పి-4 వంటి అంశాలపై చర్చించేలా కార్యాచరణ రూపొందించాలన్నారు. పారిశ్రామిక ప్రగతికి ప్రభుత్వ పాలసీలే కీలకమవుతాయని, ప్రస్తుతం అమలు చేస్తున్న నూతన పారిశ్రామిక విధానాల ద్వారా గూగుల్ వంటి దిగ్గజ ఐటి కంపెనీలు రాష్ట్రంలో భారీ పెట్టుబడులతో ముందుకొచ్చాయన్నారు. 15 బిలియన్ డాలర్ల అతిపెద్ద పెట్టుబడితో గూగుల్ వంటి దిగ్గజ ఐటి కంపెనీలు రాష్ట్రంలో భారీ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చినట్లు సిఎం వెల్లడించారు. గూగుల్ రాకతో విశాఖ హ్యాపినింగ్ సిటీగా మారిందన్నారు. సానుకూల విధానాలతోనే వాణిజ్యం, పరిశ్రమలు పెట్టుబడులతో ముందుకొచ్చే అవకాశముందన్నారు. పరిశ్రమలకు అవసరమైన మిగతా 2లో

# ఇజ్రాయిల్ స్పైవేర్‌కు ఎదురుదెబ్బ

- వాట్సాప్ వినియోగదారులను లక్ష్యంగా చేసుకోవద్దు
- అమెరికా కోర్టు ఆదేశాలు

**కాలిఫోర్నియా :** పెగాసస్ స్పైవేర్‌ను నిర్వహిస్తున్న ఇజ్రాయిల్ సంస్థ ఎన్‌ఎస్‌ఓ గ్రూప్‌నకు అమెరికా జిల్లా కోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. వాట్సప్ వినియోగదారులను లక్ష్యంగా చేసుకోవద్దని కాలిఫోర్నియా జిల్లా కోర్టు ఇంజక్షన్ ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసులో వాట్సాప్ యజమాని అయిన మెటాకు విజయం లభించినట్లయింది. ఎన్‌ఎస్‌ఓ గ్రూప్ 1,400 డివైస్‌లలో చొరబడి ఉల్లంఘనలకు పాల్పడిందంటూ 2019లో వాట్సప్ కేసు పెట్టింది. ఈ ఆరోపణలను గత సంవత్సరం న్యాయమూర్తి హమిల్టన్ నిర్ధారించారు. మెటా మిగతా 2లో



## కోస్తాంధ్రలో భారీ వర్షం

- నీట మునిగిన పలు పంటలు
- నేలవాలిన విద్యుత్ స్తంభాలు, వృక్షాలు
- కెకె లైన్‌లో విరిగిపడిన కొండచరియలు
- 22న అల్పపీడనం : విపత్తు నిర్వహణ సంస్థ

5

## ఆర్‌టిసి కార్గో వద్ద పేలిన బాణసంచా

- నలుగురికి తీవ్ర గాయాలు
- ఫ్యాన్సీ వస్తువుల పేరిట మందుగుండు సామగ్రి పార్సిల్

2



## యుపిలో రూ.3 కోట్ల విలువైన
## దగ్గు మందు స్వాధీనం

**లక్నో :** ఉత్తరప్రదేశ్‌లో రూ.3 కోట్ల విలువైన నిషేధిత దగ్గు మందును స్వాధీనం చేసుకున్నారు. ముగ్గుర్ని అరెస్టు చేశారు. పోలీసులు, ఎక్సైజ్ శాఖ అధికారులతో కూడిన సంయుక్త బృందం చేసిన ఆపరేషన్‌లో ఈ మందును స్వాధీనం చేసుకున్నారు. ఘజియాబాద్ నుంచి రెండు కంటైనర్ ట్రక్కుల్లో నిషేధ దగ్గు మందు తరలిస్తున్నట్లు అధికారులకు సమాచారం వచ్చింది. ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించిన అధికారులు సోన్‌భద్ర జిల్లాలోని చుర్క్ సమీపంలో ఈ ట్రక్కులను అడ్డుకున్నారు. వీటిల్లో నుంచి 1.19 లక్షల నిషేధిత దగ్గు మందు బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. చిప్స్, స్నాక్స్ డబ్బాల మధ్య ఈ బాటిళ్లు గుర్తించారు. అలాగే ముగ్గుర్ని అరెస్టు చేసినట్లు అదనపు ఎస్‌పి అనిల్ కుమార్ తెలిపారు. పరిశీలించిన తరువాత వీటిల్లో నిషేధిత కోడైన్ ఉన్నట్లు వెల్లడయిందని చెప్పారు.

## తొలి విడతగా రూ.1,500 కోట్లు పారిశ్రామిక రాయితీలు

- ముఖ్యమంత్రి చంద్రబాబు

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

దీపావళి సందర్భంగా పరిశ్రమలకు ఎప్పట్నుంచో పెండింగ్‌లో ఉన్న ఇండస్ట్రియల్ ఇన్సెంటివ్‌ను విడుదల చేయాలని నిర్ణయించినట్లు సిఎం చంద్రబాబు తెలిపారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా ఆదివారం పోస్ట్ చేశారు. తొలి విడతగా రూ.1,500 కోట్లు పారిశ్రామిక రాయితీలు విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. పరిశ్రమలకు మద్దతుగా వ్యాపారాలకు రాష్ట్రాన్ని గమ్యస్థానంగా నిలిపేందుకు ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు తెలిపారు.

## 'తిరుమలశెట్టి' కుటుంబాన్ని ఆదుకుంటాం

- రెండు వర్గాల మధ్య ఘర్షణగా చూడొద్దు
- మంత్రులు అనిత, నారాయణ

**ప్రజాశక్తి - గుడ్లూరు రూరల్**

నెల్లూరు జిల్లా గుడ్లూరు మండలం రాళ్లపాడు వద్ద హత్యకు గురైన టిడిపి నేత తిరుమలశెట్టి లక్ష్మీనాయుడు కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని మంత్రులు అనిత, నారాయణ హామీ ఇచ్చారు. ఆదివారం సాయంత్రం రాళ్లపాడులో మంత్రులు పర్యటించారు. హత్యకు గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ... లక్ష్మీనాయుడు హత్యను రెండు పక్షాల మధ్య జరిగినదిగా చూడొద్దని, ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన ఘర్షణగానే చూడాలన్నారు. ఏది ఏమైనా ఈ సంఘటన విషాదకరమన్నారు. బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా న్యాయం చేస్తామన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, లోకేష్ బాబు దృష్టికి తీసుకెళ్లి నిందితులకు శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. తిరుమలశెట్టి కుటుంబానికి జనసేన ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాసులు రూ.2.50 లక్షలు ఆర్థిక సాయం చేశారు. వారి వెంట స్థానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఉన్నారు.

## కుమార్తెపై తండ్రి అత్యాచారం

- ఆలస్యంగా వెలుగులోకి

**ప్రజాశక్తి - నరసాపురం**

పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం పట్టణంలో దారుణ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. మద్యం మత్తులో కుమార్తెపై కన్న తండ్రి అత్యాచారానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ఓ వార్డులో నివాసం ఉంటున్న నరేష్ దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్యను గల్ఫ్‌కు పంపించిన నరేష్ రోజువారి పనులకు వెళ్లేవాడు. మద్యం మత్తులో తొమ్మిదో తరగతి చదువుతున్న చిన్న కుమార్తె (13)పై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ విషయాన్ని ఎవరికైనా చెబితే చంపుతానని బెదిరించడంతో బాధితురాలితో పాటు విషయం తెలిసిన ఆమె అక్క సైతం భయపడి ఎవరికీ చెప్పలేదు. ఇదే అలుసుగా తీసుకున్న నిందితుడు ప్రతిసారీ అత్యాచారానికి పాల్పడేవాడు. ఇటీవల బాధితురాలి తల్లి గల్ఫ్ నుంచి రావడంతో కుమార్తెలిద్దరూ తండ్రి నిర్వాహకాన్ని చెప్పి భోరుమన్నారు. బాధితురాలి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

**ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006**

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

**స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,**
**ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,**
**అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,**
**గుంటూరు జిల్లా - 522 501**కు కానీ
**editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

# మనువాదంపై మహిళలు ఐక్యంగా పోరాడాలి

**నేడు పాలకులు అవలంభిస్తున్న విధానాలు, మహిళా ఉద్యమం దశాబ్దాల పోరాటాల ద్వారా సాధించిన హక్కులను నాశనం చేసే విధంగా మారుతున్నాయి. మనువాద సిద్ధాంతాలతో ఆమెను అణగదొక్కే ప్రయత్నం జరుగుతోంది. వాటికి వ్యతిరేకంగా గళం విప్పాలని, ఐక్యంగా పోరాడాలని ఐద్వా జాతీయ అధ్యక్షులు పికె శ్రీమతి టీచర్ పిలుపునిచ్చారు. అనంతపురంలో ఇటీవల నిర్వహించిన ఐద్వా 16వ రాష్ట్ర మహాసభలకు వచ్చిన ఆమె 'ప్రజాశక్తి'తో తన అభిప్రాయాలను పంచుకున్నారు.**

## ఐద్వా జాతీయ అధ్యక్షులు పికె శ్రీమతి టీచర్



**మైనారిటీలపై దాడులు, మతోన్మాద దాడులు, మహిళలపై లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా ఎలాంటి చర్యలు తీసుకోవాలి.**

రాజ్యాంగానికి అనేక సవరణల ద్వారా బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ అనుకూల మనువాద సిద్ధాంతాలను చొప్పించాలని చూస్తున్నారు. ప్రధానంగా మహిళలు, మైనారిటీలు, గిరిజనులకు వ్యతిరేకంగా ఆ సవరణలు జరుగుతున్నాయి. గృహహింస, పనిప్రదేశాల్లో వేధింపులు, పనిగంటల పెంపు, వీటికి తోడు కుల, మత, రాజకీయపరమైన హింసలు మహిళలు ఎదుర్కొంటున్నారు. వీటన్నింటినీ వ్యతిరేకించాలి. మహిళల సంరక్షణ ప్రభుత్వాల బాధ్యత. లైంగిక వేధింపుల ఘటనల్లో 24 గంటలు లేదా రెండు రోజుల్లో నిందితులను అరెస్టు చేసే విధంగా చర్యలు చేపట్టాలి. కేరళలో అదే విధంగా జరుగుతోంది. బిజెపి అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ముస్లిం, క్రిస్టియన్ మహిళలపై దాడులు పెరుగుతున్నాయి. చత్తీస్‌గఢ్‌లో ఇద్దరు నన్‌లను అరెస్టు చేసి రెండు నెలలపాటు జైలులో పెట్టడం, ఒడిస్సాలో హిందుత్వవాదులు క్రైస్తవ మతబోధకులపై దాడి చేసి దుర్భాషలాడటం వంటివి ఇందుకు ఉదాహరణ. ఆ నన్‌లకు ధైర్యం చెప్పేందుకు మా ఐద్వా బృందం అక్కడికి వెళ్లింది.

**ఆడపిల్లలు చదువుకు దూరమౌతున్నారు. దీనిపై ఏమంటారు?**

విద్యావ్యవస్థలో బిజెపి ప్రభుత్వం తీసుకుంటున్న నూతన సంస్కరణలు విద్యారంగాన్ని ప్రైవేట్‌పరం చేస్తున్నాయి.. పేదపిల్లల విద్యాభివృద్ధి పట్టని కేంద్రం అంతర్జాతీయ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నారు. తద్వారా విద్య ఖరీదుతో కూడుకుని చాలామందికి చదువు దూరమౌతోంది. ప్రస్తుతం చాలా రాష్ట్రాల్లో ఐదు తరగతులున్న బడుల్లో ఒకే ఒక్క ఉపాధ్యాయుడు బోధిస్తున్నాడు. అదే కేరళలో ఐదు తరగతులు ఉంటే ఐదుగురు టీచర్లను ఏర్పాటు చేయడం ద్వారా నాణ్యమైన విద్య అందుతోంది. అంతేకాక గ్రామాల్లో నివాసాలకు దగ్గరలోనే పాఠశాలలు ఉండటం బాలికా విద్య పెరుగుదలకు దోహదపడుతోంది. అందరికీ విద్య, అందరికీ ఆరోగ్యం కోసం మనం ఇంకా పోరాడాల్సి ఉంది.

**ప్రసూతి మరణాల రేటు, శిశు మరణాల రేటు తగ్గుదలలో కేరళ మొదటి స్థానంలో ఉంది. దానిపై మీ స్పందన.**

చాలా సంవత్సరాలుగా శిశు మరణాల రేటు తగ్గుదలలో కేరళ మొదటి స్థానంలోనే ఉంది. ప్రభుత్వ వైద్యం బలోపేతం దీనికి ప్రధాన కారణం. మహిళల్లో రక్తహీనత లేకుండా చేయడం, తల్లుల ఆరోగ్య సంరక్షణ, ప్రతి గర్భిణికి ఆస్పత్రిలోనే కాన్పు జరిగేలా చేయడం వంటి చర్యలు ప్రభుత్వం తీసుకుంటోంది.

**మహిళాభివృద్ధికి ఎలాంటి చర్యలు చేపట్టాలి?**

స్త్రీలు పెళ్లికాకముందు తండ్రి ఆధీనంలో, తర్వాత భర్త ఆధీనంలో ఉండాలని చెబుతూ వచ్చారు. తద్వారా మహిళలకు స్వతంత్రత తగ్గిపోయింది. పురుష ఆధిక్యత పెరిగిపోయింది. సమానత్వం పెంపొందించాలి. వ్యవసాయ మహిళలకు కూడా పురుషులతో సమానంగా వేతనం అందటం లేదు. మహిళలకు విద్య, వైద్యం, ఉపాధి అందించాలి. కేరళలో మహిళలు పేదరికంతో బాధపడటంలేదు. వారికి ఉపాధి, తగినంత వేతనం దొరుకుతున్నాయి. అందరికి విద్యుత్, అర్హులందరికీ పెన్షన్ అందుతోంది. అంగన్‌వాడీ టీచర్ల రిటైర్మెంట్ తర్వాత ప్రభుత్వం వృద్ధాప్య పెన్షన్‌తో పాటుగా అదనంగా 2500 పెన్షన్ అందుతోంది. ఒంటరి మహిళలకు తల్లి లేని పిల్లల పోషణకు పెన్షన్లు అందిస్తున్నారు. మనువాద సిద్ధాంతాలకు వ్యతిరేకంగా మహిళలంతా ఐక్యంగా పోరాడాలి. అందుకు ఐద్వా కృషిచేస్తోంది. ప్రస్తుత మతోన్మాద రాజకీయ శక్తులకు వ్యతిరేకంగా పేద ప్రజల బలాన్ని ఆయుధంగా చేసుకుని ఐద్వా పనిచేస్తోంది.

## కలిసికట్టుగా రాష్ట్రాన్ని పునర్నిర్మించుకుందాం : మంత్రి లోకేష్

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

తెలుగువారందరం కలిసికట్టుగా రాష్ట్రాన్ని పునర్నిర్మించుకుందామని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పిలుపునిచ్చారు. ఆంధ్ర రాష్ట్రం కోసం ఎన్‌ఆర్‌ఐలు బ్రాండ్ అంబాసిడర్లుగా మారాలని కోరారు. ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా సిడ్నీ క్రికెట్ గ్రౌండ్ ప్రాంగణంలోని బ్రూవర్స్ పెవిలియన్ నోబుల్ డైనింగ్ రూమ్‌లో ఎపి ఎన్‌ఆర్‌టిల ఆధ్వర్యాన ఆస్ట్రేలియా తెలుగు డయాస్పోరా సమావేశంలో ఆయన ఆదివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. ప్రపంచంలో తెలుగువాళ్లు లేని దేశం ఏదీ లేదన్నారు. అమెరికా నుంచి ఆస్ట్రేలియా వరకూ తెలుగువాళ్లు తమ ప్రత్యేకతను చాటుకుంటున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తెలుగువాళ్ల సత్తాను ప్రపంచానికి చాటిన వ్యక్తి అని పేర్కొన్నారు. 1995లో పెద్దయెత్తున సంస్కరణలు తీసుకొచ్చి ఐటి విద్యను దగ్గర చేశారని తెలిపారు.

## ప్రభుత్వ అవుట్‌సోర్సింగ్ డ్రైవర్ల సంఘం అధ్యక్షులుగా ఈడుపుగంటి

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ డ్రైవర్ల సంఘం అధ్యక్షులుగా ఈడుపుగంటి మోహన్‌రావు ఎన్నికయ్యారు. విజయవాడ రెవెన్యూ భవన్‌లో ఆదివారం రాష్ట్ర కార్యవర్గ సమావేశం సంఘం అధ్యక్షులు పి నాగరాజు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎపి జెఎసి అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని డిపార్టుమెంట్లలో పనిచేస్తున్న లక్షలాది మంది అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల కోసం మెప్మా, సెర్ప్ ఉద్యోగుల తరహాలో వీరందరికీ ఎన్నికల మేనిఫెస్టో ప్రకారం ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ డ్రైవర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎస్ శ్రీనివాసరావు పలువురు యూనియన్ నేతలు పాల్గొన్నారు.




నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు, స్థానికులు

## కాలుష్యానికి దూరంగా తాడి గ్రామాన్ని తరలించండి

- సిఐటియు

**ప్రజాశక్తి - పరవాడ (అనకాపల్లి)**

అనకాపల్లి జిల్లా పరవాడ మండలంలో ఫార్మా పరిశ్రమలకు అతి సమీపంలోని తాడి గ్రామాన్ని కాలుష్యం బారిన పడకుండా వెంటనే తరలించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జి కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. తాడి గ్రామంలో స్థానికులతో కలిసి ఆదివారం ఆయన నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ ఫార్మా పరిశ్రమల నుంచి విడుదలవుతున్న వాయు కాలుష్యంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారని తెలిపారు. టిడిపి కూటమి ప్రభుత్వం గ్రామాన్ని తరలించడానికి సర్వే నిర్వహించి, ఆ తరువాత గ్రామ తరలింపు చర్యల ఊసే ఎత్తలేదని అన్నారు. గ్రామంలో స్వచ్ఛమైన గాలి, నీరు కరువయ్యాయని, ప్రజలు జబ్బులతో మంచాన పడుతున్నారని తెలిపారు. గాఢమైన వాయువుల నడుమ జీవించలేకపోతున్నారన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు గ్రామాన్ని సందర్శించిన పవన్ కల్యాణ్... గ్రామాన్ని తరలించడానికి విశేషమైన కృషి చేస్తానని వాగ్దానం చేశారని, ఇప్పుడు ఆ మాట ఏమైందని ప్రశ్నించారు. గ్రామాన్ని తరలించడానికి చర్యలు చేపట్టకపోతే ప్రజా పోరాటం తప్పదని హెచ్చరించారు. నిరసన కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గనిశెట్టి సత్యనారాయణ, నాయకులు సేనాపతి వెంకటలక్ష్మి, టి రేవతి, జి అప్పారావు, జి అమ్మాజీ, పి సత్యవతి, నూకరత్నం, వరహాలమ్మ, భవాని, శివలక్ష్మి పాల్గొన్నారు.

# ట్రంప్ బెదిరింపులకు సాగిలపడుతున్న మోడీ

- రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు కృష్ణయ్య




సదస్సులో మాట్లాడుతున్న రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు వి కృష్ణయ్య

**ప్రజాశక్తి - మాచర్ల (పల్నాడు జిల్లా)**

ట్రంప్ బెదిరింపులకు ప్రధానమంత్రి నరేంద్రమోడీ సాగిల పడటం వల్ల మన దేశ భవిష్యత్తు అగమ్యగోచరంగా తయారవుతోందని, వ్యవసాయం పూర్తిగా దెబ్బతిని రైతులు కార్మికులుగా మారే పరిస్థితులు ఏర్పడుతున్నాయని రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య అన్నారు. 'ట్రంప్ టారిఫ్‌ల ఉగ్రవాదం - భారతదేశంపై ప్రభావం' అనే అంశంపై పల్నాడు జిల్లా మాచర్ల పట్టణంలోని మెడికల్ అసోసియేషన్ హాలులో ఆదివారం సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు సిఐటియు నాయకులు బండ్ల మహేష్ అధ్యక్షత వహించగా కృష్ణయ్య మాట్లాడారు. అమెరికాలో స్థిరపడ్డ లక్షలాది మంది భారతీయుల వల్ల దేశానికి రూ.లక్షల కోట్ల విదేశీమారక ద్రవ్యం వస్తోందని, ఈ అంశాన్ని దృష్టిలో పెట్టుకుని భారతీయుల ఉద్యోగాలు తీసేస్తామని, చదువులకు రానివ్వబోమని బెదిరించడం ద్వారా దేశాన్ని లొంగదీసుకునేందుకు ట్రంప్ యత్నిస్తున్నారని విమర్శించారు. మన రైతులు విక్రయించే ధర కంటే తక్కువ ధరకు పత్తి దిగుమతి అయ్యిందని, మన రైతులు పండించిన పత్తికి అమాంతం ధర తగ్గిపోయిందన్నారు. మనం ఎగుమతి చేసే ఫార్మా, రొయ్యలు, వస్త్ర పరిశ్రమలపై సుంకాలు అధికంగా వేయటంతో మన దేశంలో ఉన్న పరిశ్రమలన్నీ నష్టాల బాటలో నడుస్తున్నాయని, మన పరిశ్రమలు మూతపడితే లక్షల మంది ఉద్యోగులు రోడ్డున పడతారని అన్నారు. గతంలో అమెరికానే ప్రపంచ వాణిజ్య సంస్థ పేరుతో సుమారు 120 దేశాల మధ్య ఒప్పందాలు, నిబంధనలు ఏర్పాటు చేసి, స్వేచ్ఛా వాణిజ్యానికి బాటలు వేశారని, ఇప్పుడు ట్రంప్ తన మాట వినాల్సిందేనని అంటున్నారని విమర్శించారు. చివరకు మన పాడిపరిశ్రమను కూడా దెబ్బతీసేందుకే కుట్రలు చేస్తున్నారని, వీటిని ఎదుర్కోవాల్సిన అవసరం ఉందని వివరించారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు అబ్రహం లింకన్, నాగేశ్వరరావు, సురేష్, వెంకటరత్నం, ఆదినారాయణ, ఆయోషా సుల్తానా పాల్గొన్నారు.

## వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా

# రాష్ట్రవ్యాప్త ఉద్యమం

(మొదటి పేజీ తరువాయి)

సంస్థలపై ప్రైవేటు వ్యక్తులు పెత్తనం చేయడమేనన్నారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని ఈ విధానాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. వైద్య కళాశాలలను పిపిపి విధానంలో ప్రైవేటుకు అప్పగించేందుకు వ్యతిరేకంగా చేస్తున్న పోరాటానికి సిపిఎం తరపున పూర్తి మద్దతును ప్రకటించారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ మాట్లాడుతూ.. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఈ అంశంపై వెంటనే అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించాలన్నారు. అన్నింటినీ ప్రైవేటుపరం చేస్తుంటే ఇంక ప్రభుత్వం ఉండి చేసేదేంటని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి ఎన్ తులసిరెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ ఖజానాను ప్రైవేటుపరం చేసేందుకే కూటమి ప్రభుత్వం చేయని ప్రయత్నం లేదని చెప్పారు. అందులో భాగంగానే ప్రతిభావం తులైన వైద్యులను అందించే ప్రభుత్వ వైద్య విద్యను కమిషన్లకు కక్కుర్తిపడి ప్రైవేటుపరం చేస్తుంద న్నారు. మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం చేసిన తప్పులను కూటమి ప్రభుత్వం కొనసాగిస్తూ వస్తుందన్నారు. పిపిపి విధానం ప్రభుత్వానికి భస్మాసుర హస్తంగా మారబోతుందని హెచ్చరించారు. మాజీ ఎమ్మెల్సీ కె ఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ.. నిర్మాణంలో ఉన్న వైద్య కళాశాలలు దాదాపు 60 నుంచి 80 శాతం వరకూ పూర్తయినట్లు చెప్పారు. ఈ కళాశాలలు అన్ని బాగా వెనుకబడిన ప్రాంతాల్లో ఉండటం వల్ల ప్రభుత్వ రంగంలో ఉంటే ప్రజలకు మేలు జరుగుతుందన్నారు.

**ఎపి ప్రభుత్వ కళాశాలల పరిరక్షణ కమిటీ ఏర్పాటు**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ కళాశాలల పరిరక్షణ కమిటీని ఈ సందర్భంగా ఏర్పాటు చేశారు. ఈ కమిటీకి ఛైర్మన్‌గా పివి రమేష్, కన్వీనర్‌గా ఆలా వెంకటేశ్వర్లు, కో-కన్వీనర్లుగా కెఎస్ లక్ష్మణరావు, వి లక్ష్మణరెడ్డి, ఎన్‌వి రమణయ్య, కొరివి వినయ్ కుమార్‌ను సదస్సు ఎన్నుకుంది. వివిధ సామాజిక, విద్యార్థి, ఉద్యమ సంఘాలకు చెందిన పలువురితో పూర్తి స్థాయి కమిటీని ఏర్పాటు చేశారు. సదస్సులో జై భీమ్ పార్టీ అధ్యక్షులు జడా శ్రావణ్ కుమార్, సామాజిక కార్యకర్త కుర్రా వసుంధర, మాజీ ఐపిఎస్ అధికారి జె పూర్ణచంద్రరావు, బిసి ఉద్యమ నాయకులు అంగడాల పూర్ణచంద్రరావు, సామాజిక కార్యకర్త ఈదర గోపీచంద్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్ వలీ, ప్రజారోగ్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు ఎంవి రమణయ్య, దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపకులు కొరివి వినయ్ కుమార్, జన చైతన్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి ధనుంజయరెడ్డి, పాటిబండ్ల కోటేశ్వరరావు, విద్యార్థి సంఘ నాయకులు కె ప్రసన్నకుమార్, బెందెల నాజర్, షేక్ కరీమ్, రాజేష్, ఆర్‌జెడి నాయకులు శ్రీనివాస్ యాదవ్, బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు సిహెచ్ చందు తదితరులు పాల్గొని ప్రసంగించారు.

# ఆర్‌టిసి కార్గో వద్ద పేలిన బాణసంచా



ఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

- నలుగురికి తీవ్ర గాయాలు
- ఫ్యాన్సీ వస్తువుల పేరిట మందుగుండు సామగ్రి పార్సిల్
- పార్వతీపురం ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో ఘటన

**ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్**

ఫ్యాన్సీ వస్తువుల పేరిట ఆర్‌టిసి కార్గో సర్వీస్‌లో బాణసంచా సామగ్రిని తరలించేందుకు ఓ వ్యక్తి చేసిన పనికి పెనుప్రమాదం జరిగింది. పార్వతీపురం ఆర్‌టిసి కాంప్లెక్స్‌కు చేరుకున్న ఓ పార్శిల్‌ను కార్గో సర్వీస్ కౌంటర్‌కు చేరుస్తుండగా బాణసంచా ఒక్కసారిగా పేలింది. ఈ సంఘటనలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు... ఫ్యాన్సీ వస్తువుల పేరిట విజయనగరం నుంచి పార్వతీపురానికి వచ్చిన బాక్స్‌ను బస్సు నుంచి కళాసీ తీసుకుని కార్గో సర్వీస్ సెంటర్ వద్ద దింపారు. దీంతో ఒక్కసారిగా పేలుడు సంభవించింది. పేలుడు ధాటికి సర్వీస్ కౌంటర్ ముందు భాగంలో ఉన్న రేకులు, కిటికీ అద్దాలు ఛిద్రమయ్యాయి. ఈ ప్రమాదంలో కళాసీ రెడ్డి రమేష్ (38), నర్సీపురానికి చెందిన ఆర్‌టిసి డ్రైవర్ పి.రమేష్ (53), తోపుడు బండి కార్మికుడు బోనెల సుందరరావు, సర్వీస్ సెంటర్‌కు వచ్చిన పార్వతీపురం పట్టణానికి చెందిన వ్యాన్ డ్రైవర్ కింతల రమేష్ (48)కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను హుటాహుటిన జిల్లా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ప్రమాదంపై ఆరా తీశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని స్థానిక ఎమ్మెల్యే విజయ్ చంద్ర, జిల్లా ఎస్‌పి ఎస్.వి మాధవరెడ్డి, ఎఎస్‌పి అంకిత సురానా పరామర్శించారు. మెరుగైన వైద్యం కోసం కింతల రమేష్‌ను విజయనగరానికి, రెడ్డి రమేష్, బోనెల సుందర్రావును విశాఖపట్నం తరలించారు.

## ప్రజల జీవితాల్లో వెలుగులు నింపేది దీపావళి

- గవర్నర్, చంద్రబాబు, జగన్, పవన్‌కల్యాణ్

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

విజయాలకు ప్రతీకగా దీపావళి జరుపుకుంటామని, ఈ ఏడాది పండగ ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని గవర్నర్ అబ్దుల్ నజీర్, సిఎం చంద్రబాబు, వైసిపి అధినేత వైఎస్ జగన్, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ ఆకాంక్షించారు. ఈ పర్వదినం సందర్భంగా తెలుగు ప్రజలందరికీ ఆదివారం వేర్వేరు ప్రకటనల ద్వారా దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. దీపావళి అంటేనే కాంతి, చీకటిపై వెలుగు, చెడుపై వెలుగు, చెడుపై మంచి జ్ఞానం, అజ్ఞానంపై జ్ఞానం సాధించిన విజయాలకు ప్రతీక అని నేతలు పేర్కొన్నారు.

## 12వ పిఆర్‌సిని వెంటనే ప్రకటించాలి

- ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

రాష్ట్ర ప్రభుత్వం 12వ పిఆర్‌సిని వెంటనే ప్రకటించాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఉద్యోగ సంఘాలతో నిర్వహించిన సమావేశంలో ప్రభుత్వం డిఎ బకాయిలు చెల్లిస్తుందని ఎదురుచూసిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు నిరాశే ఎదురైందని సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె నాగభూషణం, కె ఉమామహేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 12వ పిఆర్‌సి అమలులోకి వస్తే జీతాలు పెరుగుతాయని లక్షలాది మంది కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులు ఎదురు చూస్తున్నారని తెలిపారు. మున్సిపల్ ఆప్కాస్ కార్మికులకు గత ఎనిమిదేళ్లుగా జీతాలు పెరగలేదన్నారు. 12వ పిఆర్‌సి 2023 జులై ఒకటి నుంచి అమల్లోకి రావాల్సి ఉందని, కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం 12వ పిఆర్‌సిని ప్రకటించాలని, ఐఆర్, డిఎ బకాయిలు మొత్తం చెల్లించాలని డిమాండ్ చేశారు.

## రష్యా కీలక గ్యాస్ ప్లాంట్‌పై ఉక్రెయిన్ దాడి..

**ఓరెన్‌బర్గ్ :** రష్యాలోని ఓరెన్‌బర్గ్ ప్రాంతంలోని అతిపెద్ద గ్యాస్ ప్రాసెసింగ్ ప్లాంట్‌ను లక్ష్యంగా చేసుకొని ఉక్రెయిన్ డ్రోన్లు విరుచుకుపడ్డాయి. కీవ్‌కు తూరువైపు 1,700 కిలోమీటర్ల దూరం చొచ్చుకొచ్చి మరీ ఈ దాడి చేయడం గమనార్హం. ఉక్రెయిన్ దీర్ఘశ్రేణి దాడుల శక్తిని గణనీయంగా పెంచుకొందనడానికి ఈ దాడి ఉదాహరణగా నిలిచింది. ఈ దాడి కారణంగా ప్లాంట్లలోని ఓ యూనిట్‌లో మంటలు చెలరేగాయి. ఆ తర్వాత వీటిని అదుపులోకి తెచ్చినట్లు ఆ ప్రాంత గవర్నర్ వెల్లడించారు. ఈ ఘటనలో ఎవరూ గాయపడలేదని వెల్లడించారు. దాడి చోటు చేసుకొన్న ప్రదేశం జనావాసాలకు అతి దగ్గరగా ఉందని చెప్పారు. రష్యాలోని సుదూర ప్రాంతాల్లోనూ ఉక్రెయిన్ దళాలు డ్రోన్లు దాడులు చేస్తున్నాయి. గత నెలలో దాదాపు 2,000 కిలోమీటర్ల మేరకు లోపలకు చొచ్చుకొచ్చి దాడికి తెగబడ్డ ఘటనలున్నాయి. రష్యా ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలకు ఇది సవాలుగా మారింది. సైబీరియా, ఊరల్ పర్వతాల్లో చమురు క్షేత్రాలను లక్ష్యంగా చేసుకొంటున్నాయి. తాజాగా సమర రీజియన్‌లో కూడా డ్రోన్ దాడి జరిగినట్లు తెలుస్తోంది. స్థానికులు ఇది చమురు రిఫైనరీని లక్ష్యంగా చేసుకున్నట్లు చెబుతున్నారు.




## నేషనల్ టైమ్ సెంటర్‌పై అమెరికా సైబర్ దాడి

- చైనా తీవ్ర ఆరోపణలు

**బీజింగ్ :** తమ దేశంలో ప్రామాణిక సమయాన్ని పర్యవేక్షించే నేషనల్ టైమ్ సెంటర్‌పై అమెరికా సైబర్ దాడి చేసినట్టు చైనాకు చెందిన మినిస్ట్రీ ఆఫ్ స్టేట్ సెక్యూరిటీ ఆరోపించింది. ఈ విషయాన్ని సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్ పత్రిక కథనంలో పేర్కొంది. ఈ హ్యాకింగ్ వెనుక అమెరికా నేషనల్ సెక్యూరిటీ ఏజెన్సీ హస్తం ఉన్నట్టు వెల్లడించింది. మార్చి 2022లో తొలిసారి ఈ సైబర్ దాడులు మొదలైనట్టు పేర్కొంది. నేషనల్ టైమ్ సెంటర్‌లోని ఉద్యోగుల ఫోన్లు, కంప్యూటర్ల నుంచి సున్నితమైన సమాచారాన్ని అమెరికన్లు తస్కరించినట్లు చెప్పింది. ఈ ఆరోపణలపై అమెరికా ఇప్పటి వరకు స్పందించలేదు. టైమ్ సెంటర్ ఉద్యోగులు వాడే విదేశీ ఫోన్లలోని మెసేజింగ్ యాప్‌లో ఉన్న బలహీనతలను ఆధారంగా చేసుకొని హ్యాకింగ్‌కు పాల్పడినట్టు చైనా పేర్కొంది. అమెరికా, ఐరోపా, ఆసియా వ్యాప్తంగా ఉన్న వర్చువల్ సర్వర్లను దాడులకు వాడుకున్నట్టు పేర్కొంది. దీనికి సంబంధించిన బలమైన ఆధారాలను చైనా సైబర్ సెక్యూరిటీ సంస్థలు సేకరించినట్టు వెల్లడించింది. దీంతో పాటు తమ రక్షణ వ్యవస్థను కూడా అప్‌గ్రేడ్ చేసుకొన్నట్టు చెప్పింది. చైనాలోని షాంక్సీ ప్రావిన్స్‌లోని షియాన్ నగరంలో నేషనల్ టైమ్ సర్వీస్ సెంటర్ ఉంది. చైనీస్ ఆకాడమీ ఆఫ్ సైన్సెస్ దీనిని నిర్వహిస్తోంది. దేశంలోని ప్రామాణిక సమయాన్ని అత్యంత కచ్చితత్వంతో నిర్వహిస్తుంది. ముఖ్యంగా కమ్యూనికేషన్స్, ఫైనాన్స్, పవర్, ట్రాన్స్‌పోర్ట్, మ్యాపింగ్ డిఫెన్స్ రంగాలకు ఇది అత్యంత కీలకమైంది.

## మేధోమథనానికి వేదికగా విశాఖ

(మొదటి పేజీ తరువాయి)

మానవ వనరుల నైపుణ్యం నిరంతర ప్రక్రియగా ముందుకు సాగాలన్నారు. మానవ వనరులే మనకున్న అతిపెద్ద మూలధనమని సిఎం చంద్రబాబు పేర్కొన్నారు. విశాఖలో జరిగే సిఐఐ సదస్సుకు హాజరయ్యే వారికి హోమ్‌స్టేలో వసతి కల్పించే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. దేశ విదేశీ కంపెనీల ప్రతినిధులతో పాటు వివిధ రాష్ట్రాలకు చెందిన ముఖ్యమంత్రులు, మంత్రులు, నిపుణులను కూడా ఈ సదస్సుకు ఆహ్వానించాలన్నారు. జాతీయ స్థాయిలోని విశ్వ విద్యాలయాలు, ప్రముఖ విద్యాసంస్థలు కూడా హాజరయ్యేలా చూడాలని, దేశ ప్రయోజనాలు ఆశించి అంతర్జాతీయ స్థాయి కార్యక్రమంగా ఈ భాగస్వామ్య సదస్సును రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. వన్ ఫ్యామిలీ-వన్ ఎఐ తరహాలో ఎపి టూ ఎఐ నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సిఎం సూచించారు. భాగస్వామ్య సదస్సులో రాష్ట్రంలో వనరులు, పెట్టుబడి అవకాశాలను వివరించేలా ప్రెజెంటేషన్ సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎకనామిక్ కారిడార్లు, పారిశ్రామిక క్లస్టర్లు, అమరావతి బ్లూ గ్రీన్ కేపిటల్, వాటర్ సెక్యూరిటీ, సుపరిపాలనలో టెక్నాలజీ అనుసంధానం వంటి అంశాలను ప్రస్తావించాలని అధికారులకు సిఎం దిశా నిర్దేశం చేశారు. ఈ సమీక్షలో పరిశ్రమలశాఖ మంత్రి టిజి భరత్, ఇడిబి అధికారులు పాల్గొనగా, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా భారత పరిశ్రమల సమాఖ్య డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీ, సిఐఐ ప్రతినిధులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఇజ్రాయిల్ స్పైవేర్‌కు ఎదురుదెబ్బ

(మొదటి పేజీ తరువాయి)

వాదనలతో ఏకీభవించిన న్యాయస్థానం శాశ్వత ఇంజక్షన్ ఆర్డర్ జారీ చేసింది. వాట్సప్‌కు మూడు బిలియన్లకు పైగా వినియోగదారులు ఉన్నారు. వారి గోప్యతను, భద్రతను కాపాడతామని ఎండ్- టు- ఎండ్ ఎన్‌క్రిప్షన్ పత్రంలో హామీ ఇచ్చారని, వినియోగదారుల ఖాతాలలోకి ఎన్‌ఎస్‌ఓ గ్రూప్ చట్టవిరుద్ధంగా చొరబడడంతో వాట్సప్‌కు పూడ్చలేని నష్టం జరిగిందని కోర్టు అభిప్రాయపడింది. ఇజ్రాయిల్ సంస్థ ప్రవర్తన సరిదిద్దలేని హాని కలిగిస్తోందని వ్యాఖ్యానించారు. శాశ్వత ఇంజక్షన్ ఆదేశాలు జారీ చేయాలన్న అభ్యర్థనకు అంగీకరించిన జడ్జి హామిల్టన్, గతంలో విధించిన 168 మిలియన్ డాలర్ల నష్టపరిహారాన్ని నాలుగు మిలియన్ డాలర్లకు తగ్గించారు. మార్క్ జూకర్‌బర్గ్‌కు చెందిన మెటా సంస్థ వాట్సప్, ఫేస్‌బుక్, థ్రెడ్స్, ఇన్‌స్టాగ్రామ్‌లను నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. కాగా ఇంజక్షన్ ఆదేశాలను ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి ఇతర వేదికలకు కూడా వర్తింపజేయాలన్న మెటా అభ్యర్థనను కోర్టు తోసిపుచ్చింది. ఉగ్రవాదాన్ని ఎదుర్కొనేందుకు ప్రభుత్వాలకు, లా ఎన్‌ఫోర్స్‌మెంట్, ఇంటెలిజెన్స్ ఏజెన్సీలకే విక్రయిస్తున్నట్లు ఎన్‌సిఓ వాదిస్తున్నప్పటికీ, పౌరసమాజాన్ని లక్ష్యంగా చేసుకుందని పలువురు విమర్శిస్తున్నారు. మనదేశంతోసహా చాలా దేశాల్లో ప్రతిపక్ష నేతలు, న్యాయమూర్తులు, న్యాయవాదులు, జర్నలిస్టులు, మానవ హక్కుల కార్యకర్తలను లక్ష్యంగా చేసుకున్నారని విమర్శలు వెల్లువెత్తిన సంగతి తెలిసిందే.



జల్లికట్టులో పాల్గొన్న గ్రామస్తులు

## కొండకిందపల్లిలో జల్లికట్టు

**ప్రజాశక్తి - వెదురుకుప్పం (చిత్తూరు జిల్లా)**

దీపావళి పండుగను పురస్కరించుకుని సంప్రదాయ పద్ధతిలో పశువుల కొమ్ములకు బహుమతులు కట్టి జల్లికట్టు నిర్వహించారు. ప్రతి ఏడాది ఈ పండుగను నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తోందని చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం కొండకిందపల్లి గ్రామస్తులు చెబుతున్నారు. ఈ ఏడాది కూడా పశువులను అలంకరించి వాటి కొమ్ములకు డబ్బులు, నగలు కట్టి జల్లికట్టు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. పశువులకు కట్టిన బహుమతులు దక్కించుకునేందుకు యువకులు పోటీ పడ్డారు. ఈ పోటీలో పలువురు యువకులకు స్వల్పగాయాలయ్యాయి.

## మెడికల్ కాలేజీలకు రూ.2500 కోట్లు ఖర్చు చేయలేరా? : మాజీ మంత్రి అప్పలరాజు

**ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ**

టిడిపి కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టేస్తోందని మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు విమర్శించారు. శ్రీకాకుళంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ... వైసిపి ప్రభుత్వం 17 మెడికల్ కాలేజీలను ప్రారంభిస్తే, ఈ కళాశాలను ప్రైవేట్‌పరం చేస్తున్నారని విమర్శించారు. అమరావతి కోసం లక్షల కోట్లు ఖర్చు చేస్తున్నారని, ప్రధాని పర్యటన కోసం రూ.వేల కోట్ల ఖర్చు చేస్తున్నారని తెలిపారు. మెడికల్ కళాశాలల కోసం రూ.2500 కోట్లు ఖర్చు చేయలేరా? అని ప్రశ్నించారు. కృష్ణా నదిపై రూ.2500 కోట్లతో వంతెన అవసరమా? అంటూ విమర్శలు గుప్పించారు. గూగుల్ డేటా సెంటర్ వల్ల లక్షలు ఉద్యోగాలు రావని, ఈ విషయంపై టిడిపి నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. ప్రాధాన్యత లేని రంగాలకు రూ. కోట్లు ఖర్చు చేయడం వల్ల రాష్ట్ర ప్రగతి కుంటుపడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. విభజన చట్టాల అమలులో ముఖ్యమంత్రి చంద్రబాబు విఫలమయ్యారని తెలిపారు. కార్పొరేట్ సంస్థలకు ప్రభుత్వ భూములను తక్కువ ధరకు కట్టబెడుతున్నారని మండిపడ్డారు.

# హైడ్రోపై బాక్సైట్ తరహా ఉద్యమం

- ప్రాజెక్టుల పేరిట గిరిజనులను ముంచుతామంటే ఊరుకోం
- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.పుణ్యవతి
- గుమ్మకోటలో భారీ ర్యాలీ, సభ

**ప్రజాశక్తి - అరకులోయ రూరల్/అనంతగిరి (అల్లూరి జిల్లా)**

ఆదివాసీలను జలసమాధి చేసే హైడ్రో పవర్ ప్రాజెక్టులపై గతంలో ఏజెన్సీలో జరిగిన బాక్సైట్, కాల్సైట్ తరహా ఉద్యమం చేయాలని గిరిజనులకు సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.పుణ్యవతి పిలుపునిచ్చారు. హైడ్రో పవర్ ప్రాజెక్టులను ఆదివాసీలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా టిడిపి కూటమి ప్రభుత్వానికి పట్టకపోవడం దారుణమన్నారు. అనంతగిరి మండలం గుమ్మకోట పంచాయతీ కేంద్రంలో ఆదివాసీ గిరిజన సంఘం, హైడ్రో పవర్ ప్రాజెక్ట్ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో గిరిజనులు భారీ ర్యాలీ, బహిరంగ సభ నిర్వహించారు. హైడ్రో పవర్ ప్రాజెక్టులు నిర్మించొద్దంటూ పెద్దపెట్టున నినదించారు. ఈ సందర్భంగా టోకూరు సర్పంచ్ కిల్లో మోస్య అధ్యక్షతన జరిగిన సభలో పుణ్యవతి మాట్లాడారు. ఆదివాసీ ప్రాంతాల్లో ఉపాధి కల్పిస్తామని గిరిజన హక్కులు, చట్టాలను తుంగలో తొక్కి అదాని, నవయుగ, శిరిడిసాయి వంటి బడా కార్పొరేట్ సంస్థలకు హైడ్రో ప్రాజెక్టుల ఏర్పాటు కోసం 2, 13, 51 జిఒలను ప్రభుత్వం జారీ చేసిందన్నారు. ఈ ప్రాజెక్టుల నిర్మాణంతో వేలాది ఎకరాల భూములు, 250 గ్రామాలు, 50 వేల మంది గిరిజనులను జలసమాధి అవుతారన్నారు. ఈ నేపథ్యంలో గిరిజనులంతా ఏకమై హైడ్రో ప్రాజెక్టుల ఏర్పాటు కంపెనీలను తరిమికొట్టేందుకు సిద్ధం కావాలన్నారు. గిరిజన అభివృద్ధిపై పాలకులకు చిత్తశుద్ధి ఉంటే గిరిజన గ్రామాలకు రోడ్లు, మంచినీరు సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. 'అడవి తల్లి బాట' పేరుతో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గిరిజన గ్రామాల్లో పర్యటించి అదాని, నవయుగ కంపెనీలతో కుమ్మక్కై గిరిజన ప్రాంతాలను నాశనం చేసేందుకు కుట్రపన్నారని విమర్శించారు.

ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర మాట్లాడుతూ... గుజ్జెలిలో హైడ్రో పవర్ ప్రాజెక్టు కడితే గుమ్మకోట ప్రాంతమంతా మునిగిపోయే ప్రమాదం ఉందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు జిఒ 13ను జారీ చేసినప్పుడు పర్యావరణ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స, అనంతగిరి జడ్‌పిటిసి దీసరి గంగరాజు, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ మాట్లాడుతూ... హైడ్రో పవర్ ప్రాజెక్టులను తాత్కాలికంగా నిలిపివేస్తామని చెప్పి సీలేరులో హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణానికి భూమి పూజ జరుగుతుంటే జిల్లా కలెక్టర్, గిరిజన శాఖ మంత్రి ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. హైడ్రో ప్రాజెక్టులను రద్దు చేసేంత వరకూ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో గిరిజన మహిళా సంఘం నాయకులు దీసరి దేముడమ్మ, హైడ్రో ప్రాజెక్ట్ వ్యతిరేక పోరాట కమిటీ కన్వీనర్లు మజ్జి సురేష్ కుమార్, కొర్ర స్వామి, వెంగడ మాజీ సర్పంచ్ సివేరి కొండలరావు, అనంతగిరి మండల నాయకులు నాగులు, సతాబి సర్పంచ్ రామయ్య పాల్గొన్నారు.



బహిరంగ సభలో మాట్లాడుతున్న పుణ్యవతి

## డ్వాక్రా, మెప్మాలకు రూ.10 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు : ఐద్వా డిమాండ్

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

రాష్ట్రంలోని 84 లక్షల మంది డ్వాక్రా, మెప్మాలకు ప్రభుత్వం రూ.10 లక్షల వరకు వడ్డీ లేని రుణాలివ్వాలని ఐద్వా ఆలిండియా నాయకులు డి రమాదేవి, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారి కె శ్రీదేవి, వి సావిత్రి, డి శ్రీనివాసకుమారి డిమాండ్ చేశారు. విజయవాడ బాలోత్సవ భవన్‌లో ఆదివారం వారు మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వం సూపర్‌సిక్స్ హామీలు అమలు చేయాలని, మహిళలు, పిల్లలపై అత్యాచారాలను అరికట్టడానికి కఠిన చర్యలు తీసుకోవాలని, మద్యాన్ని నియంత్రించాలని, గంజాయి వంటి మత్తు మందుల సరఫరాను నిరోధించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర మహాసభ తీర్మానించిందన్నారు. సరళీకరణ ఆర్థిక విధానాల వల్ల మహిళా రంగంలో జరుగుతున్న మార్పుల గురించి మహాసభ చర్చించిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల వల్ల మహిళలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఐద్వా నేతలు పేర్కొన్నారు. మద్యం, గంజాయి సేవించి మహిళలపై అఘాయిత్యాలు రోజురోజుకూ పెరిగిపోతుండటం పట్ల వారు ఆందోళన వ్యక్తం చేశారు. హైకోర్టు కలుగజేసుకుని చీవాట్లు పెట్టినా అధికార యంత్రాంగంలో చలనం లేదన్నారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలు, చిన్నారులపై వేధింపులు, లైంగిక వేధింపులు పెరిగాయని, పరువు హత్యలు పెరుగుతున్నాయని తెలిపారు. డ్వాక్రా గ్రూపులకు రూ.10 లక్షలు వడ్డీ లేని రుణాన్ని ఇస్తామన్న హామీని నెరవేర్చాలని అన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని, ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్టం చేయాలని, విశాఖ ఉక్కును ప్రైవేటీకరించే విధానాలను విడనాడాలన్నారు. ఏడాదికి మూడు సిలిండర్లు కొంతమందికే ఇస్తున్నారని, అందరికీ అమలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి మహిళకూ నెలకు రూ.1500 ఇస్తామన్న హామీని తక్షణమే అమలు చేయాలన్నారు.

## ఎరువుల భారం రైతులపై వద్దు

- ఎపి రైతు సంఘం

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

కేంద్ర ప్రభుత్వం కాంప్లెక్స్ ఎరువులపై సబ్సిడీని కొనసాగించాలని, రైతులపై ఎరువుల భారం పడకుండా అవసరమైన అన్ని చర్యలూ తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ప్రభుత్వం ఎరువులపై సబ్సిడీ కొనసాగించేందుకు నిరాకరించడంతో ఎరువుల కంపెనీలు ఆ మేరకు ధరలు పెంచి రైతులపై భారం వేసే దిశగా చర్యలు తీసుకుంటున్నాయని సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి కృష్ణయ్య, కె ప్రభాకర్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ క్రమంలో కాంప్లెక్స్ ఎరువులు 50 కేజీల బస్తాపై రూ.50 నుంచి రూ.100 వరకూ అదనపు భారం రైతులపై పడనుందని తెలిపారు. ఎరువులపై ఉన్న 18 శాతం జిఎస్‌టిని 5 శాతానికి తగ్గించామని గొప్పగా ప్రకటించిందని చెప్పారు. పన్ను రాయితీ రైతులకు కాకుండా ఎరువుల కంపెనీలకు ప్రయోజనకరంగా మారుతుందన్నారు. రాబోయే కాలంలో రైతులపై ఎరువుల ధరల రూపంలో రూ.300 కోట్లు అదనపు భారం పడుతుందని వెల్లడించారు. అసలే గిట్టుబాటు ధరలు లేక, వ్యవసాయంలో పెట్టుబడులు పెరిగి అప్పుల పాలవుతున్న రైతాంగంపై ఎరువుల రూపంలో మరో భారాన్ని కేంద్ర ప్రభుత్వం, ఎరువుల కంపెనీలు కలిసి వేయడాన్ని సంఘం తీవ్రంగా ఖండించింది.

**ఎరువుల ధరల పెంపును ఉపసంహరించుకోవాలి**

కేంద్ర ప్రభుత్వం ఎరువుల ధరల పెంపు నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. కార్పొరేట్ కంపెనీలకు రూ.లక్షల కోట్లు రాయితీలు, రుణాల రద్దు చేస్తున్న కేంద్ర ప్రభుత్వం.. రైతాంగానికి కనీస సబ్సిడీ ఇవ్వకపోవడాన్ని సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై రాధాకృష్ణ, ఎం హరిబాబు ఒక ప్రకటనలో ఖండించారు. కౌలు రైతులు, పేద రైతులపై మరింత భారం వేస్తూ కేంద్రం తీసుకున్న ఎరువుల ధరల పెంపు నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. వెబ్ ల్యాండ్ ఆధారంగా ఎరువుల పంపిణీ చేస్తామని సిఎం ప్రకటించారని, దీనివల్ల వాస్తవ సాగుదారులైన కౌలు రైతులు కష్టాల పాలవుతారని పేర్కొన్నారు. ప్రభుత్వం ఆధ్వర్యాన నిర్వహించే ఇఫ్కో, క్రిభ్కో వంటి కంపెనీలను కూడా నియంత్రించకుండా ఎరువుల ధరలు పెంచేందుకు అనుమతినిచ్చి రైతులను ఎరువుల వాడకం తగ్గించుకోమనడం వ్యవసాయం, రైతుల పట్ల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు.

## తప్పని డోలీ మోతలు

- అనారోగ్యంతో ఉన్న తండ్రిని మోసుకువచ్చిన కుటుంబసభ్యులు

**ప్రజాశక్తి - కొమరాడ (పార్వతీపురం మన్యం జిల్లా)**

పార్వతీపురం మన్యం జిల్లా కొమరాడ మండలం పూడేసు పంచాయతీ గుమడంగి గ్రామానికి చెందిన ఆరిక దండు తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న నేపథ్యంలో శనివారం రాత్రి దండు భార్య జమ్మలమ్మ, కుమారుడు మోహనరావు, గ్రామస్తుల సహకారంతో సుమారు మూడు కిలోమీటర్ల మేర ఒడిశాలోని వాటామాన్ వరకు డోలీతో మోసుకొచ్చారు. అక్కడి నుంచి ఆటోకు రూ.రెండు వేలు చెల్లించి పార్వతీపురం జిల్లా కేంద్రాస్పత్రికి తీసుకొచ్చారు. తమ గ్రామానికి రహదారి సౌకర్యం లేకపోవడంతో డోలీతో మోసుకొని తీసుకురావాల్సి వచ్చిందని కుటుంబ సభ్యులు వాపోయారు. ఇలా ప్రతిసారీ తమ గ్రామం నుంచి రోగులను, గర్భిణులను తీసుకురావాల్సిన పరిస్థితి నెలకొందని ఆ గ్రామానికి చెందిన ఆరిక నాగేశ్వరరావు చెప్పారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి కొమరాడ మండలంలో కుంతేసు, పుడేసు, మసిమండ, పెదశాఖ, గుణదతీలేసు, నయా పంచాయతీలకు రోడ్డు సౌకర్యం కల్పించి డోలీమోతల్లేకుండా చర్యలు తీసుకోవాలని గిరిజనులు కోరుతున్నారు.



## కళాకారుల ప్రత్యేక పింఛనుకు కృషి

- మంత్రి కందుల దుర్గేష్

**ప్రజాశక్తి-రాజాం (విజయనగరం జిల్లా)**

కళాకారులకు ప్రత్యేక పింఛను మంజూరు చేసేందుకు కృషి చేస్తామని మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. విజయనగరం జిల్లా రాజాం పట్టణంలో ఆదివారం జిఎంఆర్ వరలక్ష్మి కళాక్షేత్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వం కళాకారులకు ప్రత్యేకంగా ఇచ్చే పింఛనును అందరితో పాటు కలిపి ఇచ్చారంటూ ఓ కళాకారుడి ఆవేదనను ఈ సందర్భంగా ప్రస్తావించారు. గత ప్రభుత్వం చేసిన తప్పిదాన్ని సరిదిద్ది త్వరలోనే కళాకారుల పేరుతోనే గౌరవ వేతనంగా అందించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. నాటక సమాజాలను రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. కళారంగం అభివృద్ధికి అవసరమైన కార్యాచరణ సిద్ధం చేయాలని నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణకు సూచించారు. నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామాను ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించాలని కేంద్ర పర్యాటక, సాంస్కృతిక మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌కు విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. అందుకు ఆయన సూత్రప్రాయంగా అంగీకరించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నెల్లిమర్ల, పాలకొండ, రాజాం ఎమ్మెల్యేలు లోకం మాధవి, నిమ్మక జయకృష్ణ, కోండ్రు మురళీమోహన్, నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, ఎఎంసి చైర్మన్ బుర్రా నారాయణరావు పాల్గొన్నారు.



జిఎంఆర్ వరలక్ష్మి కళాక్షేత్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి దుర్గేష్

# యుజిసి నెట్-2025కు సిద్ధమేనా?

**బోధన, పరిశోధనా పోటీ పరీక్షల ప్రత్యేకం**



-కె.ఎస్.లక్ష్మణరావు,
మాజీ శాసనమండలి సభ్యులు,
జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు
సెల్ : 8309965083

**బో**ధనా రంగంలో అత్యున్నత అవకాశాల కోసం మీరు వేచిచూస్తున్నారా?. అయితే ఈ సమాచారం మీ కోసమే. జాతీయ అర్హత పరీక్ష (నెట్) ద్వారా మీరు అవకాశాలను అందిపుచ్చుకోవచ్చు. మీ సబ్జెక్టు ఏదైనప్పటికీ అందులో ప్రతిభ ప్రదర్శిస్తే చాలు కొలువు మీ చెంతకు చేరుతుంది. యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) ఆధ్వర్యంలో జాతీయ అర్హతా పరీక్ష (నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ-ఎన్‌టీఏ) ఏటా రెండుసార్లు ఈనెట్ పరీక్షను నిర్వహిస్తోంది. ప్రతి నెలా ఉపకార వేతనం (స్టైపెండ్) అందుకుంటూ పరిశోధనలో కొనసాగడానికి, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు పోటీ పడటానికి, పీహెచ్‌డీలో చేరడానికి, కొన్ని ప్రభుత్వ అనుబంధ సంస్థల్లో ఉద్యోగాలకూ నెట్ స్కోరే ప్రామాణికం. బోధనారంగంలో అత్యున్నత ప్రమాణాలతో కూడిన ఉపాధి అవకాశాలను అందుకునే అవకాశం ఈ యూజీసీ నెట్ ద్వారానే దక్కించుకోవచ్చు. నెట్, యూజీసీ) ఆధ్వర్యంలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ఈ పరీక్ష నిర్వహిస్తోంది. యూజీసీ నెట్ డిసెంబరు-2025 ప్రకటన ఇటీవలే విడుదలైంది.

**3 కేటగిరీల్లో ప్రశ్నాపత్రాల ఎంపిక :** నెట్‌ను 85 సబ్జెక్టుల్లో రాసుకోవచ్చు. పీజీ సబ్జెక్టులో ప్రావీణ్యానికి ఈ పరీక్ష కొలమానంగా నిలుస్తుంది. భాషలు తప్పించి, మిగిలిన సబ్జెక్టుల ప్రశ్న పత్రాలు ఇంగ్లీష్, హిందీ మాధ్యమాల్లో ఉంటాయి. పరీక్ష అందరికీ ఉమ్మడిగానే జరుపుతుంటారు. ఇందులో అర్హత సాధించడానికి 3 కేటగిరీలు ఉంటాయి. అభ్యర్థులు ఎంచుకున్న మాధ్యమంలో పరీక్షలు జరుగుతాయి.

**కేటగిరీ-1:** ఎంపికైన వారు ప్రతి నెలా యూజీసీ నిర్దేశిత స్టైపెండ్ (జేఆర్‌ఎఫ్) పొందుతూ పరిశోధన (పీహెచ్‌డీ) కొనసాగించుకోవచ్చు. వీరు అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకూ, జేఆర్‌ఎఫ్ లేకుండా జరిపే పీహెచ్‌డీ ప్రవేశాలకూ అర్హులే.

**కేటగిరీ-2:** ఇందులో అవకాశం వస్తే జేఆర్‌ఎఫ్ దక్కదు. కానీ, వీరు అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు, పీహెచ్‌డీ ప్రవేశాలకూ అర్హులే.

**కేటగిరీ-3:** వీరు పీహెచ్‌డీలో ప్రవేశానికే అర్హులు. జేఆర్‌ఎఫ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు అర్హత ఉండదు.

**జెఆర్‌ఎఫ్‌లకు స్టైపండ్ :** జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ (జేఆర్‌ఎఫ్) అవకాశం వచ్చినవారు మేటి సంస్థల్లో పరిశోధన (పీహెచ్‌డీ)లో చేరొచ్చు. వీరికి ప్రతి నెలా రూ.37,000 మొదటి రెండేళ్లు చెల్లిస్తారు. అనంతరం ఎస్‌ఆర్‌ఎఫ్‌కు అర్హత సాధిస్తే రూ.42,000 చొప్పున స్టైపెండ్ అందుతుంది. సంస్థ వసతి కల్పించకపోతే స్టైపెండ్‌లో 30 శాతం వరకు హెచ్‌ఆర్‌ఏ చెల్లిస్తారు. ఏటా కంటింజెన్సీ గ్రాంటు అందుతుంది.


- ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, జాతీయ, రాష్ట్ర స్థాయి విశ్వవిద్యాలయాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు పోటీ పడొచ్చు.
- డీమ్డ్ విశ్వవిద్యాలయాలూ, ప్రయివేటు విద్యా సంస్థలూ మేటి స్కోరు ఉన్నవారికి అధిక వేతనంతో ఉద్యోగాలిస్తున్నాయి.
- పోటీ, ప్రవేశ పరీక్షల నిమిత్తం శిక్షణ ఇస్తోన్న సంస్థలూ ఫ్యాకల్టీ సభ్యుల ఎంపికలో నెట్ స్కోరుకు ప్రాధాన్యమిస్తున్నాయి. ఎక్కువ స్కోరు ఉంటే అధిక వేతనమూ దక్కుతుంది.
- జాతీయ స్థాయిలో ఎస్సీ, వికలాంగ, ఓబీసీ విభాగాల్లో నేషనల్ ఫెలోషిప్పులు పొందడానికి నెట్ అర్హత తప్పనిసరి.
- కొన్ని ప్రభుత్వ, అనుబంధ సంస్థలు (మహారత్న, నవరత్న కంపెనీలు) నెట్ స్కోర్‌తో మేనేజ్‌మెంట్ ట్రెయినీ హోదాతో లీగల్, హ్యూమన్ రీసోర్సెస్, మార్కెటింగ్ విభాగాల్లో ఉద్యోగాలు అందిస్తున్నాయి.
- ప్రయివేటు సంస్థల నియామకాల్లోనూ నెట్ అర్హులకు ప్రాధాన్యం లభిస్తోంది.
- రాష్ట్ర స్థాయి సంస్థల్లోనూ పీహెచ్‌డీలో ప్రవేశానికి అవకాశమిస్తారు

**ప్రిపరేషన్ ఎలాగంటే...**

యూజీసీ నెట్ ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో సబ్జెక్టుల వారీ సిలబస్ వివరాలు అందుబాటులో ఉన్నాయి. వాటిని క్షుణ్ణంగా పరిశీలించుకోవటం మేలు. నోటిఫికేషన్, ఫీజు వివరాలు, చెల్లింపులు, నిబంధనలు వంటి ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా తెలుసుకోవాలి. సన్నద్ధతకు అందులో పేర్కొన్న అంశాలే ప్రామాణికం.

**అవగాహన.. అధ్యయనంపై పట్టు**

- సంబంధిత సబ్జెక్టులో అభ్యర్థికి ఎంత విస్తృత అవగాహన ఉందో తెలుసుకునేలా ప్రశ్నలుంటాయి. వీటిని అనువర్తనం, లోతైన పరిజ్ఞానం, ప్రాథమికాంశాల్లో పట్టు తెలుసుకునేలా అడుగుతారు.
- అధ్యయనం ముందుగా ప్రాథమికాంశాలతో ప్రారంభించాలి.



ఇందులో పట్టుంటేనే ఎలాంటి ప్రశ్నలకైనా సమాధానమివ్వడానికి అవకాశం ఉంటుంది.

- ఆయా అంశాలపై అవగాహన కోసం ఇంటర్మీడియట్, యూజీ (డిగ్రీ) పాఠ్యపుస్తకాలు బాగా చదవాలి.
- ఆ తర్వాతే పీజీ పాఠ్యాంశాలపై దృష్టి పెట్టాలి.
- రిఫరెన్స్ పుస్తకాలను అవసరం మేరకు అధ్యయనం చేయాలి.



**లోతైన పరిజ్ఞానం అవసరం :** పలు అంశాలను జోడించే ఎక్కువ ప్రశ్నలు వస్తాయి. సబ్జెక్టులో లోతైన పరిజ్ఞానం కోసం ప్రతి అంశాన్నీ సూక్ష్మ స్థాయిలో చదవాలి. ముఖ్యాంశాలు నోట్సు రాసుకోవాలి. పరీక్షకు ముందు వీటినే మళ్లీ మననం చేసుకుంటే అలా గుర్తుండిపోతాయి. తరచూ నమూనా పరీక్షలు రాస్తుంటే మన పరిజ్ఞానంపై పట్టు, తెలియని విషయాలపై అవగాహన వస్తుంటాయి. ఆయా నమూనా పరీక్షల్లో వచ్చిన మార్కులు, ఫలితాలను విశ్లేషించుకుంటే మరింత రాటుతేలుతారు. సబ్జెక్టు అంశాలకు సంబంధించిన విషయాలపై అవగాహన లేమి ఎక్కడ ఉందో తెలుస్తుంది. తప్పులు కూడా పునరావృతం కాకుండా ఉంటాయి. పునఃశ్చరణ అంశాలు, స్కోరు మెరుగుపర్చుకుంటే మంచి ఫలితాలు కూడా వస్తాయి.

**జవాబుల గుర్తింపులో జాగ్రత్తలు**

- రుణాత్మక మార్కులు లేనందున తెలియని ప్రశ్నలకూ బాగా ఆలోచించి జవాబు గుర్తించాలి. ప్రశ్నకు ఒకటి కంటే ఎక్కువ సమాధానాలున్నా, అందులో పొరపాట్లు ఉన్నా బోనస్ మార్కులు ఇస్తారు. ఏదో ఒక ఆప్షన్ సమాధానంగా గుర్తిస్తేనే ఈ మార్కులు కలుపుతారు. అందుకే అన్ని ప్రశ్నలకూ జవాబు ఇవ్వడం మంచిది.

**పరీక్షలు జరిగేది ఇలా...:** ఆన్‌లైన్‌లో 300 మార్కులకు నిర్వహిస్తారు. ప్రతి ప్రశ్నకూ రెండు మార్కుల చొప్పున 150 ఆబ్జెక్టివ్ ప్రశ్నలు వస్తాయి. రుణాత్మక మార్కులు లేవు. పరీక్ష వ్యవధి 3 గంటలు. పేపర్-1 టీచింగ్ అండ్ రీసెర్చ్ ఆప్టిట్యూడ్ అందరికీ ఉమ్మడిగా ఉంటుంది. ఇందులో 50 ప్రశ్నలకు 100 మార్కులు. రెండో పేపర్ 200 మార్కులు. 100 ప్రశ్నలు ఉంటాయి. ఈ ప్రశ్నాపత్రం ఎంచుకున్న విభాగం, సబ్జెక్టు నుంచి ఉంటుంది.

**మోడల్ పేపర్ల పరిశీలనా ముఖ్యమే :** సన్నద్ధత ఎంత గొప్పగా ఉన్నా, పరీక్షను సమర్థంగా ఎదుర్కోవడానికి గత ప్రశ్నపత్రాలు దిక్సూచిలా నిలుస్తాయి. వాటిని సమగ్రంగా పరిశీలించాలి. వీటి ద్వారా ఏయే అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలో తెలుస్తుంది. ఏమి చదవాలి, ఎలా ప్రిపేరవ్వాలి, ఏయే అంశాలపై దృష్టి సారించాలో తెలుస్తుంది. మోడల్ ప్రశ్నలు ఎలా వస్తాయో తెలుస్తుంది. ప్రశ్నల సరళి ఎలా ఉంటుందో అర్థమవుతుంది. అందుకే పాత ప్రశ్నపత్రాలను తరచుగా పరిశీలించటం అత్యంత ఉపయోగకరం.

**విద్యార్హతా వివరాలు :** ఎంచుకున్న సంబంధిత సబ్జెక్టులో 55 శాతం మార్కులతో పీజీ. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ నాన్ క్రీమీ లేయర్, వికలాంగులు, ట్రాన్స్ జెండర్లకు 50 శాతం మార్కులు చాలు. ప్రస్తుతం పీజీ కోర్సులు చదువుతున్నవారూ అర్హులే. నాలుగేళ్ల బ్యాచిలర్ కోర్సులు చదివినవారూ దరఖాస్తు చేసుకోవచ్చు. వీరికి డిగ్రీలో 75 శాతం మార్కులు అవసరం. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, ఈడబ్ల్యుఎస్‌లకు 70 శాతం చాలు. యూజీతో జేఆర్‌ఎఫ్, పీహెచ్‌డీల్లో ప్రవేశానికే అర్హులు. పీజీ ఉన్నవాళ్లే అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు అర్హులు. చివరి ఏడాది కోర్సుల్లో ఉన్నవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

సడలింపులు : అసిస్టెంట్ ప్రొఫెసర్ అర్హత పొందడానికి, పీహెచ్‌డీ ప్రవేశానికీ వయసు నిబంధన లేదు. జేఆర్‌ఎఫ్‌కు డిసెంబరు 1, 2025 నాటికి 30 ఏళ్లలోపు ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ నాన్ క్రీమీ లేయర్, వికలాంగులు, ట్రాన్స్ జెండర్లు, మహిళలకు గరిష్ఠ వయసులో ఐదేళ్ల సడలింపు.

**ఫీజుల వివరాలు :**

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: నవంబరు 7.

దరఖాస్తు ఫీజు: జనరల్/అన్ రిజర్వ్‌డ్ రూ.1150. జనరల్ (ఈడబ్ల్యూఎస్), ఓబీసీ(ఎన్‌సీఎల్) రూ.600బీ ఎస్సీ, ఎస్టీ, వికలాంగులు, ట్రాన్స్ జెండర్లకు రూ.325.

పరీక్ష తేదీలు: 31.12.2025 నుంచి 07.01.2026 వరకు

**వెబ్‌సైట్:** https://ugcnet.nta.nic.in/

**సబ్జెక్టు ఎంపికే కీలకం :** నెట్‌లో సబ్జెక్టుల ఎంపిక చాలా జాగురూకతతో వ్యవహరించాలి. లెక్చరర్‌షిప్ అయితే ఏ సబ్జెక్టు అయినప్పటికీ అన్ రిజర్వుడు అభ్యర్థులు 200 మార్కులు పొందితే సరిపోతుంది. అదే జేఆర్‌ఎఫ్ కోసమైతే 220 వరకు రావాలి. కొన్ని సబ్జెక్టుల్లో లెక్చరర్‌షిప్ 180 మార్కులకీ పొందొచ్చు. జేఆర్‌ఎఫ్ 200కీ లభిస్తోంది. పీహెచ్‌డీ కోసమైతే కొన్ని సబ్జెక్టుల్లో 90 మార్కులకీ అవకాశం ఉంది. మరికొన్నింటికి మాత్రం 180 వరకు రావాలి. సబ్జెక్టులు, కేటగిరీ వారీగా కటాఫ్ వివరాలు ఎన్‌టిఎ వెబ్‌సైట్‌లో పొందుపర్చివున్నాయి.

పరీక్షలో రెండు పేపర్లు ఉంటాయి. వీటికి 300 మార్కులు. 150 ఆబ్జెక్టివ్ ప్రశ్నలు వస్తాయి. ప్రతి ప్రశ్నకు రెండు మార్కులు. పరీక్ష ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు. పేపర్-1 అభ్యర్థులందరికీ ఉమ్మడిగా ఉంటుంది. 50 ప్రశ్నలకు 100 మార్కులు. రెండో పేపర్ 1000 ప్రశ్నలు, 200 మార్కులకు నిర్వహిస్తారు. ఈ ప్రశ్నపత్రం అభ్యర్థి ఎంచుకున్న విభాగం/సబ్జెక్టు నుంచి ఉంటుంది. రుణాత్మక మార్కులు లేవు. పరీక్ష వ్యవధి 3 గంటలు. పేపర్-1, 2 మధ్య విరామం లేదు.

**పేపర్-1:**

ఇందులో 10 విభాగాలు ఉన్నాయి. ఇందులో ప్రశ్నలు అభ్యర్థి బోధన, పరిశోధనా రంగంలో రాణించగలరా? లేదా? తెలుసుకునేలా ఉంటాయి. ఆలోచన విధానం, ఆంగ్లాన్ని అర్థం చేసుకునే తీరు, గణితంలో ప్రాథమిక పరిజ్ఞానం, తర్కం, విశ్లేషణ సామర్థ్యం, కమ్యూనికేషన్ సాధనాలు, అభివృద్ధి, పర్యావరణం, ఉన్నత విద్యల్లో ప్రశ్నలు సంధిస్తారు.

- టీచింగ్ ఆప్టిట్యూడ్
- రీసెర్చ్ ఆప్టిట్యూడ్
- కాంప్రహెన్షన్
- కమ్యూనికేషన్
- మేథమెటికల్ రీజనింగ్ అండ్ ఆప్టిట్యూడ్
- లాజికల్ రీజనింగ్
- డేటా ఇంటర్‌ప్రెటేషన్
- ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ (ఐసీటీ)
- పీపుల్, డెవలప్‌మెంట్ అండ్ ఎన్విరాన్‌మెంట్
- హయ్యర్ ఎడ్యుకేషన్ సిస్టం

**పేపర్-2**: ప్రశ్నలన్నీ అభ్యర్థి ఎంచుకున్న సబ్జెక్టు నుంచే ఉంటాయి. ఆ సబ్జెక్టు, విభాగంలో.. ప్రాథమికాంశాలు, అనువర్తనం, విశ్లేషణ, అవగాహన, జ్ఞానం పరిశీలించేలా ప్రశ్నలు అడుగుతారు. సబ్జెక్టులో పూర్తి నైపుణ్యం ఉంటేనే సమాధానం గుర్తించగలరు. ప్రతి అంశాన్నీ విస్తృతంగా సూక్ష్మ స్థాయిలో చదవాలి.

**విశ్వవిద్యాలయాల్లో వేలాదిగా కొలువులు**

ఆంధ్రప్రదేశ్‌లోని 14 యూనివర్శిటీల పరిధిలో వేలాదిగా అధ్యాపక పోస్టులు ఏళ్లతరబడి భర్తీకి నోచుకోవటం లేదు. చదువుల పెన్నిధిగా, పరిశోధనలకు పట్టుకొమ్ములుగా విరాజిల్లాల్సిన రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో అధ్యాపక పోస్టుల భర్తీ జరగాల్సివుంది. ప్రపంచానికీ, దేశానికి సమర్థవంతమైన యువత, మేధోసంపత్తిని అందించే విశ్వవిద్యాలయాల్లో ఖాళీల భర్తీకి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరింతగా చొరవ చూపాలి. విశ్వవిద్యాలయాలకు పూర్తిస్థాయిలో అవసరమైన నిధుల కేటాయింపు జరిపి, మౌలిక సదుపాయాలు, సిబ్బంది కొరత లేకుండా ఉంటే ఉన్నత చదువులు సజావుగా సాగుతాయి. అక్కడ కూడా నిధుల లేమి దశాబ్దాల తరబడి కొనసాగుతుండటంతో విశ్వవిద్యాలయాల్లో కూడా మొక్కుబడి చదువుల పరంపర కొనసాగుతోంది. మొత్తం యూనివర్శిటీల పరిధిలో కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో కాకుండా పూర్తిస్థాయి అధ్యాపక పోస్టుల భర్తీని వెంటనే చేపట్టాల్సివుంది. అప్పుడు ఉన్నత విద్యలోనూ, పరిశోధనారంగంలోనూ మెరుగైన ఫలితాలు వస్తాయి.



"తను చెప్పదలచుకున్న సంగతి తనకే స్పష్టంగా తెలీనప్పుడు, తన చాతగాని తనాన్ని, అర్థ అస్పష్టతనీ ఛందస్సు చీరల వెనకా, అలంకారాల మధ్యా, కఠిన పదాల బురఖాల్లోనూ దాచి మోసగించాలని చూస్తాడు కవి. ముఖ్యంగా సహజ సౌందర్యం తక్కువైనప్పుడు!"

\- చలం

## పాతాకాశం



దేశ దేశాల ఎముకల గూళ్ళను
నీ తెల్ల సౌధానికి ఇలారం చేసుకుని
ధిక్కార గొంతులు
తిరుగుబాటు గుండెలు
నీ దర్పానికి తివాచీ పరచుకుని
నాగరికతలను
అనాగరికంగా తెగనరకడం
నీకు అనాది వ్యాపకం
ఎర నీదై ఉచ్చు నీవై
చిక్కుకున్న అధినేతలను
చంపుకు తినడం
వారాంతపు సరదా నీకు ...!

దౌత్యం పేర నువ్వు కట్టిన
అడ్డు గోడల అడుసుల్లో
ఎన్నో వారసత్వాల రక్తం
కన్నీరు పెడుతుంది
మరెన్నో సంస్కృతుల పతనం
మౌనంగా పరితపిస్తుంది
నువ్వు కూల్చేసిన రాజ్యాలు
శరణార్థ శిబిరాల్లో
ఒంటరిగా మూల్గుతున్నాయి

నీ పరుగుకి దారి చూపిన చమురు దీపాన్ని
తనిఖీ ముసుగులో ఆర్పేసి
పశ్చిమ నెలవంకని దగ్ధం చేస్తుంటే
బోనులో కూడా గర్జించిన
బాగ్దాద్ పోరు సింహం
భయమెరుగని ఊపిరి
నిన్నెంత కలవరపెట్టిందో కదా
లోకానికి లెక్కలు నేర్పిన
ఆ ఎడారి తుపానుకి
నీ లెక్క తేల్చడం ఓ లెక్కా?

కొత్త చిగురులు తొడిగే
ఆది నాగరిక కొమ్మపై
తిరిగి వాలేంత వరకూ
శిథిల మసీదు మినారుల్లోని
చెదిరిన పావురాలన్నీ
తమ పాతాకాశంలోనే
బలిసిన ముక్కులు
పదునెక్కిన గోళ్ళతో
పహారా కాస్తున్నాయి!

\- మిరప మహేష్, 99480 39026

## కంటి వెలుగు

దీపావళికి దీపాల మీదే
కవిత రాయక్కర్లేదు
నేననే గాలిపటానికి సూత్రధారియైన
ఒక ప్రేమ ధరిత్రి తాను-
తొలి రోజుల్లో నా లోపల ఖాళీ గదుల్ని
సుగంధ సువాసనల్తో పూరించిపోయిన
ఒక వసంత వనపు పూలతీగ తాను
పరాయి దేశం పోయినప్పుడు
నా వెన్నెల రాక కోసం తల వాకిట్లో
వేయి కన్నుల్తో ఎదురుచూసే
ఒక కలల నింగి తాను ...

దీపావళికి దీపాల మీదే
కవిత రాయక్కర్లేదు

నచ్చిందో, ఎందుకు మెచ్చిందో
వాత్సల్యపూరితమైన తల్లిదండ్రుల బుజ్జగింపో
తొలి ప్రేమికురాలై తేట తేట తెలుగై
చీకటి చిరుకాంతుల భాగస్వామై
పారాణి పాదాల్తో పసుపు కుంకుమల్తో
అచ్చమైన పల్లెటూరి పిల్లై
ఏడడుగుల్తో ఆక్రమించుకుంది
నా అంతరంగాన్ని ...

చీకటింట్లో దీపం పెట్టింది తనే
చిరునవ్వుల్తో సూర్యోదయాన్ని ఆవిష్కరించింది తనే
మాటల్తో మల్లెలు, ముద్దబంతులు
సృష్టించింది తనే
ఆగ్రహ జ్వాలని అఖండ జ్యోతిగా
ప్రకాశింపజేసింది తనే
చేతిలో చెయ్యి వేసి హృదయానికి చేరువై
మనస్సుకు మిక్కిలి మక్కువై
నా సంపూర్ణ జీవితాన్నీ నా అస్తిత్వాన్నీ
నా పుస్తక ప్రపంచాన్నీ - మొత్తాన్నీ
తనలోకి లాక్కొని అనన్యమై
అర్ధ నారీశ్వరమై ఆలోచనాలోచనమై నిలిచింది
ముమ్మాటికీ తానే .. తనే...

ప్రకాశించి ప్రకాశించి సగం పొద్దులోనే
ఒక నక్షత్రం అస్తమించిందిప్పుడు-
ఇప్పుడు
ఇంటి దీపంలోనే కాదు
నా కంటిలో చంద్రబింబమై వెలుగుతుంది!
వెన్నెళ్లు కురిపిస్తుంది!

\- రవి నన్నపనేని, 91821 81390

## 26న పుస్తక పఠనం

పిల్లల్లో, పెద్దల్లో పుస్తక పఠన సంస్కృతిని పెంచడానికి అక్టోబర్ 26 తేదీ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు హైదరాబాద్‌లోని ఇందిరాపార్కులో, విజయవాడ నగరంలోని ప్రముఖ పార్కులలో పుస్తక పఠనం జరుగుతుంది. విద్యార్థులు, ఉపాధ్యాయులు, రచయితలు, పుస్తక ప్రియులు అందరూ మీ మీ పుస్తకాలతో వచ్చి, మీ సొంత రచనలు లేదా మీకు నచ్చిన రచయితల రచనలు చదివి ఈ కార్యక్రమం విజయవంతం చేయాల్సిందిగా కోరుతున్నాం. పిల్లలు, పెద్దలు అందరూ ఈ మరో గ్రంథాలయ ఉద్యమంలో భాగస్వాములు కావలసిందిగా ఆహ్వానిస్తున్నాం.

\- కవి యాకూబ్, మంచికంటి, విజయ భండారు, కాసుల రవికుమార్, సిఎ ప్రసాద్
98491 56588, 99495 35695


## అనువాద రచనలు, కవితా ప్రక్రియల పోటీ

పీఠికాపుర సాహితీ కళావేదిక, శ్రీ సూర్యరాయ విద్యానంద గ్రంథాలయం సంయుక్తంగా బాదం మాధవరావు గారి జ్ఞాపకార్థం 1. తెలుగు అనువాద సాహిత్యం (కథలు, కవిత్వం), 2. కవితా ప్రక్రియల (పద్య కవిత్వం, హైకూలు, మినీ కవిత, దీర్ఘ కవితలు) పోటీ నిర్వహిస్తున్నాము. ఉత్తమ అనువాదానికి రూ.5,116లు, ఉత్తమ కవితా ప్రక్రియకు రూ.5,116ల నగదు పురస్కారం ఉంటుంది. ఈ పోటీ కోసం పంపే రచనలు 2018 తర్వాత ముద్రితమై ఉండాలి. పుస్తకాలు రెండు కాపీలు పంపాలి. పురస్కార ప్రదానోత్సవం డిసెంబరు 25వ తేదీన జరుగుతుంది. నవంబరు 25లోగా రచనలు పంపవలసిన చిరునామా : నిర్వాహకులు, శ్రీ సూర్యరాయ విద్యానంద గ్రంథాలయం, పాత బస్టాండు వద్ద, మెయిన్ రోడ్, పిఠాపురం - 533450. ఫోన్లు : 94945 53425, 91330 23086.

\- ర్యాలి ప్రసాద్, సమన్వయకర్త.

# అరుంధతీ రాయ్ 'మదర్ మేరీ కమ్స్ టు మి'

వర్తమానం






అన్ని పుస్తకాలకూ ముఖచిత్రాలుంటాయి. అవి రచనలోని విషయానికి మరింత వన్నె తేవడానికి ఏదో విధంగా ప్రయత్నిస్తుంటాయి. అయితే మదర్ మేరీ కమ్స్ టు మి భారతీయ ఎడిషన్ వలె అంత కళాత్మకంగా వుండేవి అరుదు. హాఫ్‌డస్ట్ జాకెట్‌తో వచ్చింది పుస్తకం. అట్ట మీద రచయిత్రి చిన్నప్పటి ఫొటో కట్టిపడేసేలా, కళ్లలో కలలతో, సిగరెట్ కాలుస్తూ ఆలోచనల్లో మునిగిపోయినట్టు కనిపిస్తూ. ఆమె జుట్టు గిరిజాలను కత్తిరించినట్టు తెలుస్తున్నా వాటికి ఓ విధానం వుందని మాత్రం అర్థమవుతుంది. వెనక కవర్‌కు వెళ్లండి.. ఆమె ఉంగరాల జుట్టు నెమ్మదిగా తెల్లబడుతుండటం, ఆమె కళ్లలో చూపు మరింత వ్యూహాత్మకంగా వుండటం, ఎముకలు కూడా కాస్త వలయాకారంగా మారడం.. ఇవన్నీ వుంటాయి. ఈలోగా అనుకోకుండా కవర్ జాకెట్ వూడిపడిపోయిందనుకోండి. గడచిపోయిన కాలాన్ని ఫొటోల కన్నా బాగా చిత్రించే ప్రయత్నం. అక్కడ ఎర్రటి కవర్‌పై ఓ రెక్కల పురుగు. అభిరుచి కలిగినవారు, మేధావులు నినాదాలిస్తున్న నేపథ్యంలో ఆ రెక్కల పురుగుల ఉనికి ఏదో జ్ఞాపకాలు మేల్కొల్పుతున్న వైనానికి ప్రతీక.

ఈ రెక్కల పురుగు కీటకశాస్త్ర నిపుణుడైన ఆమె తాతకు ప్రతీక కాదు. అరుంధతి పుట్టిన ఏడాదే ఆయన చచ్చిపోవడం కారణం కాదు. ఏ దిక్కులేని ఆ కుటుంబానికి ఊటీలో ఆయన కట్టిన ఇల్లే ఆశ్రయమవడం కారణం కాదు. అక్కడే మనకు అరుంధతి చిన్నపిల్లగా పరిచయమవుతుంది. "భయపడిపోయిన హృదయమే.. (ఆమె) నిరంతర సహచరి. ఈ రెక్కల పురుగు దానికే ప్రతీక. మదర్ డైరీలోని బ్రహ్మాండమైన కాల్పనికత అంతటిలోకీ కీలకమైనవి కొన్ని వున్నాయి. తుచ తప్పని ఖచ్చితమైన వ్యక్తీకరణ, పరిపూర్ణ అవగాహనతో తేడా రానీకుండా భాషను ఉపయోగించడం ఇవన్నీ.. అరుంధతీరాయ్ పేరుకు పర్యాయపదాలుగా మారాయి. ఇది ఎందాక వెళ్లిందంటే పాఠకుడు పుస్తకం ద్వారా ఆమే మాట్లాడుతున్నారని అనుకోవడం మొదలెడతాడు. ఆ రెక్కల పురుగు పుస్తకం పేజీల్లోంచి బయటకు వచ్చి పాఠకుల హృదయంలోకి వచ్చి కూచోవడం మొదలెడుతుంది. భయం కలుగుతుంది. అయిదేళ్ల వయసులోనే తల్లిదండ్రులను ఇంట్లో చూడలేకపోవడం, లేదంటే ఏడవ ఏట జరిగిన ఓ రభస... ఇవన్నీ జీర్ణం చేసుకోలేని పరిస్థితి, దానివల్ల కలిగే భావాలు, గ్రహింపులూ, కనిపించే దాన్ని ఎలా తీసుకోరాదో చెప్పే సంఘర్షణలు.. అన్నీ కూడా తన వాళ్లను కోల్పోయినట్టు చెబుతూ తేలిగ్గా అర్థమయ్యే కథాంశాలే. వీటి ద్వారానే అరుంధతి రాయ్ తన కథను విశ్వజనీనంగా చేయగలిగారు.

వాస్తవంగా చెప్పాలంటే మేరీరాయ్ కొట్టాయంలో స్కూలు పెట్టి పాఠాలు చెప్పడం ప్రారంభించిన రోజునే తన జీవిత కథ రాసుకోదగిన వ్యక్తి అయ్యారు. కేరళలోని ఆ నిశ్శబ్ద పట్టణంలో 1970లలోనే కొత్త తరహా బోధనాపద్ధతులు ప్రవేశపెట్టడం మామూలు మనుషులు చేయగలిగింది కాదు. దాన్ని విజయవంతంగా సాగించడం, పిల్లల తల్లిదండ్రులకు కూడా అవన్నీ అర్థమయ్యేలా ఒప్పించి బహుముఖ ప్రజ్ఞావంతులైన ఒక తరం విద్యార్థులను సృష్టించడం దానికదే ఒక విజయం. ఆ విజయానికి తోడుగా 1906 తిరువాన్కూరు క్రైస్తవ వారసత్వ చట్టంలో మార్పు కోసం పోరాడి సాధించడం, మరే క్రైస్తవ మహిళకైనా పుట్టింటి ఆస్తిలో వాటా లేకుండా పోయే పరిస్థితి రాకుండా చేయటం ద్వారా ఆమె నిజంగానే అమరజీవి అయ్యారు.

అయితే మేరీ రాయ్ మామూలు మనిషి కాదు గనకే ఆమె అరుంధతీ రాయ్‌ని పొందగలిగారు. ఆమె జీవిత కథ ఎవరు రాస్తారనే ప్రశ్నకు అవకాశం లేకుండా చేయగలిగారు. ఫలితంగానే మదర్ మేరీ అనే భావాత్మక టైటిల్. అసలంటూ ఆ పేరుతో ఎవరైనా వుంటే. నిజానికి ఇది ఇద్దరు ప్రతిభామూర్తులైన మహిళల కథ. నిశితమైన, వజ్రసన్నిభమైన సృజనాత్మకమైన పట్టుదలతో స్వాతిశయంతో నడిచిన కథ. పేగుబంధాన్ని మించి మరింత బలమైన ప్రాథమికమైన మరేదో కలిపివుంచిన కథ. మామూలుగా ప్రేమ అని పిలిచేదాన్ని కన్నా సంక్లిష్టమైనదేదో కలిపి వుంచిన కథ.

తల్లిదండ్రులు పిల్లలకు సంబంధించిన కథలన్నిటిలోనూ సమతూకం లోపించడం బలంగా కనిపిస్తుంటుంది. దాన్ని మనం గుర్తించి అదృష్టవంతులమైతే సరిచేసే లోపే ఇద్దరిలో మరొకరు ఎవరో వచ్చి దాన్ని సమతూకం చేయడం జరిగి పోతుంటుంది. కానీ, ఇక్కడ మేరీరాయ్ ఏ విధంగానూ సాధారణ వ్యక్తి కాదు. తాగుబోతైన తన భర్తను వదిలేసి నిలబడగలిగింది. (ఈ పుస్తకంలో ఆయన 'దండగ మారి మనిషి') అప్పటికి ఆమెకు డిగ్రీ మాత్రమే వుంది. ఇద్దరు చిన్న పిల్లలు. ఊపిరి తీసే ఆస్తమా. అయినా తన స్వంత యాత్ర ప్రారంభించింది. అదీ దేశం ఆ చివరన. ఆమె తరచూ జిత్తులమారిగా, బూతులతో, క్రూరంగా విద్వేషిగా చాలాసార్లు అసలు సిసలు రాక్షసిలా వ్యవహరిస్తుంది. (డిడోను అసలు క్షమించడం కష్టం.)

కొంత నిశ్శబ్దం, కాస్త వ్యవధానం. అమ్మానాన్నల నుంచి ఎలా కాపాడుకోవాలో పిల్లలు తెలుసుకున్నారు. రక్షణ వ్యవస్థ నిర్మించుకున్నారు. కొట్టాయంలో తనను భయపెట్టే ఇంటి కప్పులు నుంచి అరుంధతీరాయ్ బయటపడ్డారు. సుప్రసిద్ధుడైన లారీ బేకర్ తన తల్లి కోసం స్కూలు కడుతుంటే తను అనుసరిస్తూ, స్కూలు చదువు పూర్తి చేసేసరికి ఆర్కిటెక్చర్ అంటే తనకు ఇష్టమని తెలుసుకోగలిగారు. మరో రెండేళ్ల గడిచింది. ఆమె సెలవులకు ఇంటికి రావడం మానేశారు. ఆ అచేతనావస్థ ఏడేళ్ల గడిచాక మళ్లీ ఒక విధమైన సర్దుబాటు చేసుకోగలిగారు. అయితే ఒక్కసారి కూడా ఈ ఏడేళ్లలోనూ ఆ తర్వాత కూడా ఆ తల్లి తన కూతురు ఎక్కడుందనేది గానీ, ఎలా వుందనేది గానీ తెలుసుకునే ప్రయత్నం చేయలేదని మదర్ మేరీ పుస్తకం చెబుతుంది.

అరుంధతీ రాయ్ తొలి నవల గాడ్ ఆఫ్ స్మాల్ థింగ్స్ రాసినపుడు ఆమెకు 36 ఏళ్లు. ఎంతో ప్రతిభావంతమైన ఆత్యాధునికమైన రచన అది. దాని అంకితం ఆమె ఇలా రాశారు : "మేరీ రాయ్ నేను వదలి వెళ్లిపోయేంత స్వేచ్ఛ నిచ్చినందుకు" అని. నిజంగా మంచిగానే రాశారు. దేవుడి వాక్యంలా ఆ విషయం అరుంధతి తరచూ గుర్తు చేస్తుండేవారు. "ఆ పుస్తకంలో ఏదైనా కల్పన అంటూ వుంటే ఈ వాక్యమేనని మా సోదరుడు ఎప్పుడూ అంటుంటాడు."

ఆర్ద్రత. నిరంతరాయంగా.. ఇంకా ఇంకా. ఈ పుస్తకంలోని వాక్యాలు ఎప్పటికప్పుడు కలిగించే అనుభూతి అదే. మదర్ మేరీలో ప్రప్రధాన భావోద్వేగం అదే. రెక్కల పురుగు బొమ్మతో ప్రతిబింబించిన, భయోద్వేగాన్ని ఏ పేరుతో పిలవాలో తెలియదు గాని అదే పుస్తకమంతా పరుచుకుని వుంటుంది. ఆమెకు బూకర్ పురస్కారం వచ్చాక 'శభాష్ బాగా సాధించావ్' అంటూ పొడిపొడిగా అభినందించడం వంటివి కొన్ని జెన్ ఎక్స్‌కు అలవాటైన అరుదైన ప్రశంసలు. అరుంధతీ రాయ్ దయార్ద్రత.. తన తల్లిపై ఎలాటి తీర్పులకూ రాకుండా అర్థం చేసుకునే ప్రయత్నం. ప్రేమంటేనే పాపమని భావించే భారత దేశంలో మనం కోరుకునే ఒకే ఒక్క సాంత్వనం.

ఆఖరుగా చూస్తే మదర్ మేరీ ఓ తల్లీకూతుళ్ల సంక్లిష్ట సంబంధాల ఆవిష్కరణే గాక భారతీయ సమాజ అధ్యయనం కూడా. స్వేచ్ఛాయుత భావనలతో పెరిగిన ఓ స్త్రీవాది బాల్యం ఆమెది. ఆ తర్వాత ఢిల్లీలో ఆమె అనుభవాలు, సంబంధాలు, పక్కదారులూ, పని, ప్రసిద్ధి, సంపద, రాజకీయాలు క్రియాశీలత, ఏకాకితనం స్వదేశాన్ని మించిపోయిన స్త్రీత్వాన్ని కళ్లకు కడుతుంది. అయితే ఒకటి నిజం. మేరీ రాయ్ నడిచారు గనకే అరుంధతీ రాయ్ పరిగెత్తగలిగారు. ఆమె పరిగెత్తింది. అనుపర్ణారాయ్ వంటివారు చిత్రాలు తీసి అంతర్జాతీయ పురస్కారాలు పొందగలిగారు. (మేరీ రాయ్ ఆవిష్కరణ తర్వాత కొద్ది రోజులకే ఇది జరిగింది గనక) జ్ఞాపకాలకూ ప్రేమకూ సంబంధించిన ఈ గట్టి పుస్తకం నుంచి మీరేదైనా ఒకే ఒక అంశాన్ని తీసుకోవాలనుకుంటారా? అదొక్కటే. తన ఆడబిడ్డల కోసం భారతదేశం ఎదగాలి.

\- సుమనా ముఖర్జీ

## ఎమ్మెస్సార్ జాతీయ స్థాయి కథల పోటీ- 2025

మలిశెట్టి సీతారామ్ స్మారకార్థం ఈ ఏడాది కూడా కథల పోటీ నిర్వహిస్తున్నాం. బహుమతి కథలతో పాటు మరి కొన్ని ఎంపిక చేసి 'కథా ప్రపంచం 2025' పుస్తకం ప్రచురిస్తాం. అలాగే, ఒక సీనియర్ సాహితీవేత్తకు మలిశెట్టి సీతారాం స్మారక జీవన సాఫల్య సాహితీ పురస్కారం-2025 (రూ.11,116), మరొక సాహితీవేత్తకు మలిశెట్టి సీతారామ్ స్మారక వార్షిక సాహితీ పురస్కారం (రూ.10 వేలు) అందజేస్తాము. కథల పోటీకి ప్రథమ బహుమతి రూ.5 వేలు, ద్వితీయ బహుమతి రూ. 3 వేలు, తృతీయ బహుమతి రూ.2 వేలు అందజేస్తాము. కథలు డిటిపిలో ఐదు పేజీలకు మించరాదు. హామీపత్రంలో మాత్రమే రచయిత పేరు, చిరునామా, ఫోన్ నెంబర్ ఇవ్వాలి. కథలు యునికోడ్, పిడిఎఫ్ రూపంలో ఇ-మెయిల్ ద్వారా 30.11.2025లోగా పంపాలి. email: msrtelugusahityam@gmail.com ఇతర వివరాలకు యుగంధర్: 93947 82540, శాస్త్రి : 88857 62720.

\- మలిశెట్టి శ్యాం ప్రసాద్, వాట్సాప్ : 99850 13234


## 26న గడియారం సాహిత్య పురస్కార ప్రదాన సభ


మహాకవి డా.గడియారం వేంకట శేషశాస్త్రి 44వ సాహిత్య పురస్కార ప్రదాన సభ రచన సాహిత్య వేదిక, గడియారం కుటుంబీకుల సంయుక్త ఆధ్వర్యంలో అక్టోబరు 26 ఆదివారం సాయంత్ర పొద్దుటూరు వైఎంఆర్ కాలనీలోని అరబిందో ఇంటెగ్రల్ హైస్కూల్లో (అరవిందాశ్రమం) జరుగుతుంది. ఈ అవార్డుకు ఈ సంవత్సరం పరిమి శ్రీరామనాథ్ (హైదరాబాదు) రచించిన 'జీవాతువు' కావ్యం ఎంపికైంది. ఆయనకు సన్మానం, అవార్డుకు గాను రూ.10 వేల నగదు బహుమతి, పురస్కార పత్రం అందజేయబడుతుంది. కార్యక్రమంలో డా. కొమ్మిశెట్టి మోహన్, ఎ.సి.దస్తగిరి, సి.హెచ్.రవి చంద్రారెడ్డి, శారదా ప్రసన్న, గడియారం వేంకట శేషశర్మ, ఎం.జానకిరామ్, డా. భూతపురి గోపాలకష్ణ శాస్త్రి తదితరులు పాల్గొంటారు.

\- డా. భూతపురి గోపాలకష్ణ శాస్త్రి
99666 24276

# ఆధునిక బాల సాహితీ హరివిల్లు

అభినందన






మౌఖిక జీవనదుల ద్వారా ఒక తరం నుంచి మరో తరానికి ప్రవహించి ఆనందపు విజ్ఞానాలు పంచే కథల ఖజానా మన జానపద సాహిత్యం. రాయలసీమకు చెందిన డాక్టర్ ఎం.హరికిషన్ తన బోధన వృత్తిలో భాగంగా స్థానిక జానపద కథాంశాలను తన విద్యార్థుల మాటల్లో దొరకబట్టి- తనదైన బాణిలో వాటికి ఆసక్తి హాస్యాలను మేళవించి అందమైన జానపద కథలుగా మలిచి భద్రపరుస్తున్నారు. దానిలో భాగంగా ఇప్పటికి పిల్లలు చెప్పిన కథలతో 15 కథా సంపుటాలు వెలువరించారు. మరికొన్ని కథలతో 50 బాలసాహితీ పుస్తకాలు ప్రచురించారు. సామాజిక మాధ్యమాలైన ఫేస్బుక్, వాట్సాప్, టెలిగ్రామ్ తదితరాల ద్వారా సమూహాలు ఏర్పాటు చేసి వేలాదిమంది సభ్యులకు తన కథలను చేరవేస్తున్నారు. పుస్తకాలు ముద్రించి, పంచుకోవడమే తప్ప అమ్మడం సాధ్యం కాదన్న చాలామంది రచయితల అనుభవాలను తిరగరాశారు డాక్టర్ హరికిషన్. వేలాది ప్రతులను విక్రయం ద్వారా సాహిత్యాభిమానుల ఇళ్లకు చేర్చారు.

'వంద రోజులు వంద కథలు' పేరుతో హరికిషన్ ఏర్పాటు చేసిన వాట్సాప్ గ్రూపు తెలుగు బాల సాహిత్యంలోనే అతి పెద్ద కథల సమూహం. కరోనాకాలంలో ఆవిర్భవించిన ఈ సమూహం ఇప్పుడు 30 వేలకు పైగా సభ్యులతో 38 సమూహాలుగా విస్తరించింది. వీటిద్వారా హరికిషన్ సరదా కథలు, సామెతలు, పొడుపు కథలు, గేయాలు, జానపద కథలు అందిస్తున్నారు.


రెండు దశాబ్దాలుగా ప్రౌఢ, బాల సాహిత్యాల్లో కృషి చేస్తున్న హరికిషన్... నంద్యాల దగ్గరి పాణ్యంలో 1972 మే 19న మాసుల్దార్ హుస్సేనయ్య, కృష్ణవేణమ్మ దంపతులకు జన్మించారు. 'కేతు విశ్వనాథరెడ్డి కథలు- సామాజిక దృక్పథం' అనే అంశంపై పరిశోధన చేసి డాక్టరేటు పొందారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. స్థానిక చరిత్రలు, వ్యక్తుల జీవితాలు, భావితరాలకు ప్రేరణాత్మకంగా తెలియజేయాలనే సంకల్పంతో కర్నూలు జిల్లా చరిత్ర, కొండారెడ్డి బురుజు, కర్నూలు జిల్లా మహనీయులు అనే పేర్లతో అపురూపమైన చిత్రాలు పొందుపరిచి స్థానిక చరిత్రలను వెలువరించారు. ఒకటి తిందునా రెండు తిందునా, నాకు మూడు నీకు రెండు, నలుగురు మూర్ఖులు, చిలుక ముక్కు ఊడిపాయ వంటి జానపద కథల సంపుటాలతో పాటు నల్లకుక్క, ఠింగుబిళ్ళ, తిండిపోతు దయ్యం, దెబ్బకు ఏడు మంది వంటి సాధారణ కథా సంపుటాలు; మెరుపుల వాన, తేనె చినుకులు, రేపటి వెలుగులు వంటి బాలగేయ సంపుటాలు; మిన్ను, చిన్ని- మిన్ను, యువరాణి లాస్య వంటి బాలల నవలలు ప్రచురించారు. బొమ్మలతో సామెతలు రెండు భాగాలుగా వెలువరించారు. ప్రాథమిక విద్యార్థులు లక్ష్యంగా ఆయన బాల సాహిత్యాన్ని రాతరూపంలోనూ, మౌఖికంగానూ అందిస్తున్నారు. ద్విత్వాక్షరాలు, సంయుక్తాక్షరాలు లేకుండా ఆయన రూపొందించిన కథలు పిల్లల్లో భాష పట్ల ఆసక్తి కలిగిస్తాయి. హరికిషన్ రాసిన సంయుక్తాక్షరాలు లేని బాలల కథా సంపుటి 'చందమామ చెప్పిన కథలు'కు తాజాగా సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం బాల సాహిత్య పురస్కారం లభించింది. ఈ అవార్డును ఈనెల 29న హైదరాబాదులో ప్రదానం చేయనున్నారు. గతంలో హరికిషన్ సాహిత్య అకాడెమీ బాలల సాహిత్య పురస్కారం కూడా పొందారు.

తెలుగు విశ్వవిద్యాలయ బాల సాహితీ పురస్కారం పొందిన చందమామ చెప్పిన కథలు సంపుటిలో మొత్తం 25 కథలు ఉన్నాయి. 'నా మాటకు తిరుగులేదు.. పో'తో మొదలు 'మనది కానిది మనకెందుకు' వరకు సాగిన ఈ కథల పయనంలోని ప్రతి కథా చిన్నారుల చిట్టి బుర్రలకు ఎంచక్కని సందేశాన్ని ఇస్తుంది. 'నా మాటకు తిరుగులేదు.. పో' కథలో - నిరుపేద యువకుడు తనకు గల పరోపకార గుణంతో ఆ రాజ్యపు రాజు మనసు గెలుచుకుంటాడు. బల్లిని నక్క హేళన చేసి చివరికి దాని చేతిలో ఎలా ఓడిపోయిందో తెలిపే కథ 'ఎవరి గొప్ప వాళ్ళదే'. చెప్పుడు మాటలు విని స్నేహాలను ఎలా చెడగొట్టుకొని, నష్టపోవటాన్ని ఆవిష్కరించిన కథ 'బుర్ర లేని పుంజులు'. తన పిల్లలను తింటున్న పిల్లికి పావురం తెలివితో ఎలా బుద్ధి చెప్పిందో వివరించే యుక్తి కథ 'పావురం చేసిన రెక్కలు'. తెలివంటే నీదే మామ, తల్లిని కాపాడిన పిల్లలు, కుందేలు కొబ్బరికాయలు వంటి కథలు కూడా అలరిస్తాయి. పిల్లల సాహిత్యాన్ని రూపొందించటమే కాదు- దానిని పిల్లల దగ్గరకు తీసుకువెళ్లటంలో హరికిషన్ చేస్తున్న కృషి ప్రశంసనీయం. ఇలాంటి కృషికి తెలుగు విశ్వ విద్యాలయం గుర్తింపు లభించటం అభినందనీయం.

\- డా. అమ్మిన శ్రీనివాస రాజు
77298 83223

# తెలుగు భాషా ప్రస్థానానికి దర్పణం

పుస్తకం




తెలుగు భాష ప్రారంభ వికాసాలకు, ప్రస్తుత స్థితిగతులను వివరించే వ్యాసాల సంకలనం 'విశిష్ట తెలుగు దిగ్దర్శనం'. డా.తూమాటి సంజీవరావు సంపాదకులుగా ఈ పుస్తకాన్ని వెలువరించిన చెన్నపురి తెలుగు అకాడమీ వారు అభినందనీయులు. తెలుగు భాష విశిష్టతకు తన వంతు శ్రమించిన ఆచార్య తూమాటి దోణప్ప గారి శతజయంతి సందర్భంగా వెలువడిన ఈ వ్యాససంపుటిని వారికి స్మృత్యంకితం చేయడం సముచితంగా ఉంది. అంతేకాదు; కర్నూలులోని సాహితీ సదస్సు వారి ఆహ్వానం మేరకు ఆయన చేసిన తొలి ప్రసంగం 'ఆంధ్ర సాహిత్య ప్రశస్తి'ని ఈ పుస్తకం తొలి వ్యాసంగా ఇవ్వడం అర్థవంతమైన చేర్పు.

'విశిష్ట తెలుగు విజ్ఞాన స్రవంతి' పేరిట మహా మహోపాధ్యాయుడు డా. చింతలపాటి పూర్ణానంద శాస్త్రి గారి ముందుమాట విశిష్ట తెలుగు దిగ్దర్శనానికి 'దర్శనం'గా భాసించింది. ఆంధ్రప్రదేశ్ విభజనకు ముందు రాష్ట్ర ప్రభుత్వ అదనపు ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన డా.ఎస్.చెల్లప్ప వ్యాసం ఆయన భాషాభిమానానికి అద్దం పట్టింది. తెలుగు తల్లి విగ్రహానికి రూపకల్పన చేసిన తమిళుడైన మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ కాశీ పాండ్యన్ తెలుగుభాషకు చేసిన సేవ గురించి గొప్పగా తన వ్యాసంలో తెలియజెప్పారు. తెలుగు భాషా వికాస ఉద్యమ సంస్థకు అధ్యక్షులైన కన్నడిగులు శ్రీ చంద్రశేఖర్ కాల్కూర కురాడి గారి ఆంగ్లవ్యాసం తెలుగు సాహిత్యపు సుసంపన్నతను చెబుతుంది.

సుమేరియనుల నాగరికత, సంస్కృతుల్లో మన 'ఎంకి' ఎలా భాగమయిందో, మెసపొటేమియాలోని రాజ్యం ఊరు- మన ప్రాంతంలోని 'ఊరు'గా ఎందుకు పలుకబడుతున్నదో పూర్వ శాసనమండలి సభ్యులు విఠపు బాలసుబ్రమణ్యం గారి వ్యాసం వివరిస్తుంది. మన జాతి పూర్వుల ప్రయాణం ఎక్కడ ప్రారంభమై, ఎక్కడికి చేరుకుని స్థిరపడిందో స్పష్టం అవుతుంది. 'మన అకాడమీలు, విశ్వ విద్యాలయాలు ఎంత ప్రాణం లేనివో! ఎంత హృదయం లేనివో!' అన్న విఠపు వారి వ్యాఖ్య తక్షణ కర్తవ్య నిర్దేశం చేస్తుంది. ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి తమ వ్యాసంలో సంగ సాహిత్యంలో తెలుగు భాష, తెలుగుజాతి ప్రస్తావన గురించి తెలిపి, తెలుగు ప్రాచీనతను ఎత్తి చూపే ప్రయత్నం చేశారు. డా. జె.చెన్నయ్య ... తెలుగు ప్రాచీనతా సాధనోద్యమం గతిని వివరించారు. మూల ద్రావిడం నుంచి విడివడినా ఆ ప్రాచీనతను నిబిడీకృతం చేసుకున్న భాష తెలుగేనని, తొల్కాప్పియం నాటికే తెలుగు, తమిళాలు భిన్న భాషలుగా ఉన్నాయని, వాటి ప్రాచీనతను నిర్ణయించడం కష్టసాధ్యమని స్పష్టీకరించారు. అలాగే మహాభారత తెలుగు రచనకు కువిమర్శకులు చేసే విమర్శలకు ఎటువంటి ఆధారాలు లేవని తోసిపుచ్చారు. నన్నయ మహాకవి భాషలోని తెలుగు పలుకుబడులను విశేషంగా ఉదహరించారు.

డా. నిర్మల పళనివేలు వంటి వారి వ్యాసాలను నింపాదిగా చదివి అర్థం చేసుకోవాలి. తెలుగు, తమిళభాషలు మూడు వేల సంవత్సరాల ముందు నుంచి వ్యవహారంలో ఉండినవని వారు తెలపడం రెండు భాషల ప్రాచీనతకు సమర్థనగా నిలుస్తుంది. డా. సూరం శ్రీనివాసులు గారి వ్యాసం ఆంధ్ర సాహిత్య దిగ్దర్శనం చేసింది. పారిజాతాపహరణం స్వతంత్ర్యమా, అనువాదమా? అని చిన్న శంక తీరవల్సిఉందని వారు వ్యాఖ్యానించారు. నంది తిమ్మన 'పారిజాతాపహరణం' అనే కావ్యం స్వతంత్రమనే చెప్పడానికి అవకాశాలున్నాయి. రుయ్యక్తుని కంటే ముందరి వాడైన ఆదిశంకరుల సౌందర్యలహరి (శ్రీ.పూ. 6, 5 శతాబ్దాలు) లోని ఒక శ్లోకం నుంచి ప్రేరణ పొంది ఉండవచ్చు. ధ్వని, లిపి సంబంధం గురించి వి.చెంచయ్య; వ్యాకరణం - ఉత్పత్తి, వికాసాల గురించి లగడపాటి సంగయ్య వివరంగా తెలిపారు. ఆచార్య అయినవోలు ఉషాదేవి మరింతగా విస్తరించి వివరించారు. డా.సంగనభట్ల నరసయ్య ఛందస్సు గురించి, అలంకారాల గురించి డా.సూరం శ్రీనివాసులు తెలియజెప్పారు. డా. గుమ్మా సాంబశివరావు తెలుగు సాహిత్య సామాజిక ప్రబోధం గురించి విస్తృతంగా వ్యాఖ్యానించారు. డా. గంగిశెట్టి లక్ష్మీనారాయణ వ్యాఖ్యాన సంప్రదాయం గురించి వివరించారు.

డా. ఏ.కె.ప్రభాకర్ వ్యాసం ఆధునిక సవాళ్ళకు అద్దం పట్టింది. ఎన్ని రకాలుగా ఈనాటి అవసరాలకు తగినట్టుగా మనం మార్పు చెందాలో, చెందుతూనే తెలుగును ఎలా కాపాడుకోవాలో విశ్లేషించారు. నేటి తెలుగు ప్రేమకులకు ఇది మార్గ దర్శకం. ఆ తెలుగులో పరిశోధనకు డా. బీరం సుందరరావు తన వ్యాసంలో అద్దం పట్టి రావలసిన మార్పులు సూచించారు. పాఠ్యప్రణాళికల పోకడలను విశ్లేషిస్తూ డా. తలారి వాను రాసిన వ్యాసం ఆలోచింపజేస్తుంది. డా. తూమాటి సంజీవరావు గారి 'తెలుగుతల్లి ఘోష!' చెంపపెట్టు వంటిది. నిష్కర్షగా, నిర్మొహమాటంగా ప్రస్తుత పరిస్థితిని ఎత్తిచూపింది. ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి రాష్ట్ర పూర్వ ప్రభుత్వ కార్యదర్శి నందివెలుగు ముక్తేశ్వరరావు గారి వ్యాసం వ్యంగ్యంగా చురకలు వేసింది. ఈ పుస్తకం విశ్వవిద్యాలయాలు, డిగ్రీ కళాశాలలలోని ప్రతి విద్యార్థికి, ప్రతి అధ్యాపకుడికి కరదీపికగా నిలుస్తుంది. తెలుగు పట్ల అవసరాన్ని తెలుపుతుంది.

\- జాగర్లపూడి శ్యామసుందర శాస్త్రి
94405 21912

# కోస్తాంధ్రలో భారీ వర్షం

- నీట మునిగిన పలు పంటలు
- నేలవాలిన విద్యుత్ స్తంభాలు, వృక్షాలు
- కెకె లైన్‌లో విరిగిపడిన కొండచరియలు
- 22న అల్పపీడనం : విపత్తు నిర్వహణ సంస్థ

**ప్రజాశక్తి - యంత్రాంగం**

ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకూ గుంటూరు, కృష్ణా, ఉమ్మడి పశ్చిమ గోదావరి, విశాఖలో భారీ వర్షం కురిసింది. ఆదివారం తెల్లవారుజాము నుంచి సాయంకాలం వరకూ చిరు జల్లులు పడ్డాయి. విజయనగరం జిల్లా మెరకముడిదాంలో 43.7 మిల్లీ మీటర్లు, అన్నమయ్య జిల్లా గాలివీడులో 43.2 మిల్లీ మీటర్లు, విజయనగరం జిల్లా గొల్లపాడులో 43 మిల్లీమీటర్లు, పాడేరులో 41 మిల్లీ మీటర్లు, అల్లూరి జిల్లా కాకరపాడులో 39.2 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైందన్నారు. కొత్తవలస - కిరండూల్ (కెకె) లైన్‌లో కొండచరియలు విరిగిపడడంతో గూడ్స్ రైలు పట్టాలు తప్పింది.

ఉమ్మడి గుంటూరు జిల్లాలో శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకూ కుండపోత వర్షం కురిసింది. వందలాది ఎకరాల్లోని పసుపు, అరటి, కంద, కరివేపాకు పంటలు నీట మునిగాయి. కుంచనపల్లి, గుండిమెడ, మెల్లెంపూడి ప్రాంతాల్లో పొలాలకు రైతులు గండ్లు కొట్టారు. తాడేపల్లి పట్టణంలోని బోటుయార్డ్ వద్ద గల పేదల ఇళ్లల్లోకి మోకాళ్లలోతు వర్షపు నీరు చేరింది. ఉమ్మడి పశ్చిమగోదావరిలో భారీ వర్షం కురిసింది. ఎడతెరిపిలేని వర్షంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. ఏలూరు జిల్లాలో ఏలూరు నగరం, ముదినేపల్లి, కలిదిండి, ముసునూరు తదితర ప్రాంతాల్లో కురిసిన వర్షంతో జనజీవనం స్తంభించింది. పశ్చిమగోదావరిలో ఉరుములు, మెరుపులతో వర్షం కురవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. వర్షాలతో ఆక్వా రైతుల్లో ఆందోళన నెలకొంది. చెరువుల్లోని నీటిలో ఆక్సిజన్ శాతం తక్కువగా ఉండటంతో చేపలు, రొయ్యలు తేలిపోతున్నాయి. వాతావరణ మార్పుల వల్ల రొయ్యలకు విబ్రియో వైట్‌స్పాట్ వంటి వైరస్‌లు సోకి మృత్యువాత పడుతున్నాయని ఆక్వా రైతులు లబోదిబోమంటున్నారు. కృష్ణా జిల్లా గన్నవరం మండలంలో విద్యుత్ స్తంభాలు నేలవాలడంతో పదిగ్రామాలకు సరఫరా నిలిచిపోయింది. స్తంబాలను, విద్యుత్ సరఫరాను అధికారులు పునరుద్ధరించారు. అల్లూరి సీతారామ రాజు జిల్లాలోని అరకు, అనంతగిరి, డుంబ్రిగుడ, జికె.వీధి తదితర ఏజెన్సీ మండలాల్లో భారీ వర్షం కురిసింది. గెడ్డల్లోకి ఉధృతంగా నీరు వచ్చి చేరింది. డ్రెయినేజీలు పొంగిపొర్లాయి. పర్యాటక కేంద్రాలను చూసేందుకు వచ్చినవారు ఇబ్బందులు పడ్డారు. వారపు సంతలు వెలవెలబోయాయి. విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో అక్కడక్కడా కొద్దిపాటి వర్షం పడింది.

### బండరాయిని ఢీ కొట్టిన గూడ్స్‌బండి

కొత్తవలస - కిరండూల్ (కెకె) లైన్‌లోని చిమిడిపల్లి - బొర్రా 55 మైలురాయి వద్ద విరిగిపడిన పెద్ద బండరాయిని ఆదివారం తెల్లవారుజామున గూడ్స్ రైలు ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇంజిన్, భోగి పట్టాలు తప్పాయి. కిరండూల్ నుంచి విశాఖకు వస్తున్న గూడ్స్ రైలు ఆదివారం తెల్లవారు నాలుగు గంటల సమయంలో బండరాయిని ఢీకొట్టి నిలిచిపోయింది. ఇంజిన్ ముందుభాగం దెబ్బతింది. పైలట్ ఈ విషయాన్ని రైల్వే అధికారులకు తెలియజేశారు. వెంటనే ఈ మార్గంలో రైళ్ల రాకపోకలను నిలిపివేశారు. కిరండూల్ నుంచి విశాఖ వెళ్లే రైళ్లను రాయగడ్ మీదుగా విశాఖకు మళ్లించారు. యుద్ధ ప్రతిపాదికన ట్రాక్ పునరుద్ధరణ పనులు చేపట్టి మధ్యాహ్నం నుంచి యధావిధిగా రైళ్ల రాకపోకలను కొనసాగించారు.

### వాయుగుండంగా బలపడే అవకాశం

22న ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది. ఈ మేరకు ఆ సంస్థ ఎమ్‌డి ప్రఖర్‌జైన్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అల్పపీడనం పశ్చిమ వాయువ్యదిశగా కదులుతూ దక్షిణ మధ్య బంగాళాఖాతం, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని తెలిపారు. వాయుగుండం ప్రభావంతో సోమవారం బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో మోస్తారు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది. మంగళవారం పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణ, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు, తిరుపతి, బుధవారం బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, కృష్ణ, గుంటూరు, పల్నాడు, కడప, అన్నమయ్య, చిత్తూరు, గురువారం కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణ, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు, శ్రీకాకుళం, విశాఖ, అనకాపల్లి, కాకినాడ, ఏలూరు, గుంటూరు, కడప, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో అక్కడక్కడ మోస్తారు నుంచి భారీ వర్షాలు, మిగిలిన జిల్లాల్లో కొన్ని చోట్ల పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు.

### వర్షాలతో ఆక్వా రైతులు విలవిల

వాతావరణ మార్పుల ప్రభావంతో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఆక్వా రైతుల్లో ఆందోళన నెలకొంది. పశ్చిమ గోదావరి జిల్లా మొగల్తూరు మండలంలోని మొగల్తూరు, శేరేపాలెం, కొత్తపాలెం, ముత్యాలపల్లి, కాళీపట్నం, పాతపాడు తదితర గ్రామాల్లో సుమారు 25 వేల ఎకరాల్లో రైతులు ఆక్వా సాగు చేస్తున్నారు. చెరువుల్లోని నీటిలో ఆక్సిజన్ శాతం తక్కువగా ఉండడంతో చేపలు, రొయ్యలు తేలిపోతున్నాయి. దీంతో రైతులు రూ.లక్షల్లో నష్టపోతున్నారు. నీటిలో ఆక్సిజన్ శాతం పెంచేందుకు 24 గంటలూ ఏరియేటర్లను తిప్పుతున్నారు. విద్యుత్ సరఫరాలో కూడా అంతరాయం ఏర్పడటంతో ఆయిల్ ఇంజిన్లు, జనరేటర్లతో ఏరియేటర్లను తిప్పాల్సి వస్తోంది. దీంతో ఎకరం చెరువుకి రోజుకు రూ.మూడు వేల నుంచి రూ.4 వేల వకరూ అదనంగా ఖర్చవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### తెగుళ్ల బారిన రొయ్యలు, చేపలు

వర్షాల ప్రభావంతో ఆక్వా చెరువుల్లోని చేపలు, రొయ్యలు తెగుళ్లబారిన పడుతున్నాయి. రొయ్యలకు విబ్రియో వైట్‌స్పాట్ వంటి వైరస్‌లు సోకి మృత్యువాత పడుతున్నాయి. దీంతో రొయ్యలు బరువు పెరగకుండానే కిలో 300 నుండి 400 వరకూ తూగే వాటిని కూడా పట్టుబడి చేస్తున్నారు. దీంతో కనీసం పట్టుబడికి కూలీలకయ్యే ఖర్చులు కూడా రావడం లేదని రైతులు లబోదిబోమంటున్నారు.



కొత్తవలస - కిరండూల్ లైన్‌లో విరిగిపడిన బండరాయి



పైప్రా నియోజకవర్గ సిపిఎం అభ్యర్థి రాజమంగల్ ప్రసాద్ నామినేషన్ కార్యక్రమంలో అమ్రారామ్ తదితరులు

## బీహార్‌లో సిపిఎం విస్తృత ప్రచారం

**పాట్నా :** బీహార్‌లో సిపిఎం అభ్యర్థులు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. తూర్పు చంపారన్ పైప్రా అసెంబ్లీ స్థానం నుండి సిపిఎం అభ్యర్థి రాజమంగల్ ప్రసాద్ నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం ఆయనకు మద్దతుగా బహిరంగ సభ ఏర్పాటు చేశారు. పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు, ఎంపి అమ్రారామ్, కేంద్ర కమిటీ సభ్యులు, రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ లాలన్ చౌదరి, కేంద్ర కమిటీ సభ్యులు కామ్రేడ్ అవ్ధేష్ కుమార్ సభను ఉద్దేశించి ప్రసంగించారు. అసెంబ్లీలో ప్రజల గొంతు వినిపించేందుకు సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు.

బీహార్‌లోని బిబూతిపూర్ నియోజకవర్గం సిపిఎం అభ్యర్థి అజయ్‌కుమార్ పలు ప్రాంతాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు.



బిబూతిపూర్ నియోజకవర్గంలో ప్రచారం నిర్వహిస్తున్న సిపిఎం అభ్యర్థి అజయ్‌కుమార్

## బాస్ బకాయిలు రూ.180 కోట్లు

**హైదరాబాద్ :** బెస్ట్ అవైలబుల్ స్కీం (బాస్)బకాయిలు రోజు రోజుకు పేరుకు పోతున్నాయి. ఏడాదికి రెండు పర్యాయాలు చెల్లించాల్సిన ఫీజులను రెండేండ్లయినా విడుదల చేయకపోవటంతో యాజమాన్యాలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికే రూ.180 కోట్లు బకాయి ఉంది. అంతేకాదు సుమారు 30వేల మంది విద్యార్థులు బాస్ కోసం దీనంగా ఎదురుచూస్తున్నారు. పండుగ నాటికి ప్రభుత్వం బకాయిలు చెల్లిస్తే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని యజమాన్యాలు చెప్పినట్టు తెలుస్తోంది. ఫీజు క్లియర్ కాకుండా తరగతి గదిలోకి రానియ్యమంటూ యాజమాన్యాలు చెప్పినట్టు తెలుస్తున్నది. దీంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు.






# పిపిపి..ఫెయిల్యూర్ మోడల్!

- చర్చనీయాంశంగా హైదరాబాద్ మెట్రోరైల్
- టూరిజం, మూసీ పునరుజ్జీవం సహా పలు శాఖల్లో ఈ విధానానికి ప్రాధాన్యం
- దేశవ్యాప్తంగా సంక్షోభంలో ఉన్న 449 పిపిపి ప్రాజెక్టులు
- రాష్ట్రంలో నూతన విధానం కోసం కసరత్తు

**హైదరాబాద్ :** పబ్లిక్, ప్రయివేట్, పార్టనర్ షిప్ (పిపిపి) మోడల్‌పై దేశ వ్యాప్తంగా చర్చ జరుగుతోంది. ఈ విధానం సక్సెస్‌పై ఇప్పటి వరకు ఇండియాలో మిశ్రమ ఫలితాలే వచ్చాయి. భూ సేకరణలో జాప్యాలు, రాజకీయ మార్పులు తదితర కారణాలతో చివరి వరకు సాగడం లేదు. లాభాల వెంట ప్రయివేట్ భాగస్వాముల పరుగు, ప్రజాహిత కోణంలో ప్రభుత్వాల నిర్ణయాలు తదితర కారణాలతో ఒప్పంద కాలం వరకు అవి కొనసాగడం లేదు. పిపిపి పద్ధతిలో నిర్మించిన హైద్రాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్ట్ నుంచి నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీ కంపెనీ అర్ధంతరంగా వైదొలగడంతో, అసలు ఈ మోడల్ ఎంత వరకు ప్రజోపయోగం అనే చర్చ ప్రారంభమైంది. ఈ విధానంపై రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచనలో పడింది! నూతన విధానంకోసం కసరత్తు ప్రారంభమైనట్టు సమాచారం.

నిర్మాణం, నిర్వహణ, బదలాయింపు ప్రాతిపదికన తెరపైకి వచ్చిన పిపిపి మోడల్ ఇటీవలి కాలంలో అనేక ప్రశ్నలకు కేంద్రంగా మారింది. హైదరాబాద్ మెట్రోరైల్ ప్రాజెక్ట్ విఫలం కావడంతో ఈ విధానంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ప్రభుత్వం ఈ విధానంపై పున్ణస్సమీక్ష చేయాల్సిన అవసరం ఏర్పడింది. పిపిపి మోడల్‌లో పెట్టుబడులను ప్రోత్సహిస్తే, నిర్మాణ సంస్థలు మధ్యలో చేతులెత్తేస్తే పరిస్థితి ఏంటనే దానిపై అధ్యయనం చేయాలి. ప్రాజెక్టుల ఒప్పంద సమయంలోనే ఆయా కంపెనీలపై కఠిన నిబంధనలు విధించాల్సిన అవసరం కనిపిస్తోంది. రాష్ట్రప్రభుత్వం వివిధ శాఖల అభివృద్ధి పథకాలను పిపిపి విధానంలోనే ఒప్పందాలు చేసుకుంది. వచ్చే మూడేండ్లలో పర్యాటకరంగంలో రూ.15 వేల కోట్ల పెట్టుబడులు, 50 వేల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పిపిపి విధానం ద్వారా పెట్టుబడులను ఆహ్వానించింది. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్‌లోని శిల్పారామం వేదికగా ఇటీవల నిర్వహించిన తెలంగాణ టూరిజం కాంక్లేవ్-2025లో వీటిని రాష్ట్ర ప్రభుత్వం ఆవిష్కరించింది. పలువురు పెట్టుబడిదారులు రాష్ట్రంలో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో కూడిన హోటళ్లు, వెల్‌నెస్ సెంటర్లు, హాస్పిటాలిటీ ప్రాజెక్టుల ఏర్పాటుకు సుముఖత వ్యక్తం చేశారు. అలాగే మూసీ పునరుజ్జీవనం పేరిట నదికిరువైపులా పిపిపి మాడల్‌లో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల దుబాయి పర్యటనలో ప్రపంచ స్థాయి సిటీ ప్లానర్లు, డిజైనర్లు, మెగా మాస్టర్ ప్లాన్ డెవలపర్లు, ఆర్కిటెక్టులతో భేటీ అయ్యారు. మూసీ పొడవునా చేపట్టనున్న గ్రీన్ అర్బన్ పార్కులు, వాణిజ్య సముదాయాలు, నడక దారులు మొదలగు అభివృద్ధి పనుల్లో పలు సంస్థలు, పారిశ్రామిక వేత్తల నుంచి పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు. అయితే స్థానికంగా ప్రజల నుంచి వ్యతిరేకత రావడంతో ఈ ప్రాజెక్ట్ ఇంకా పట్టాలెక్కలేదు. ఇవే కాకుండా రహదారులు, మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల్లో ప్రభుత్వం పిపిపి మోడల్‌లోనే పెట్టుబడులను ఆహ్వానిస్తోంది.




### హైదరాబాద్ మెట్రో...

2003లో కేంద్రం హైదరాబాద్ మెట్రోరైల్ ప్రాజెక్టుకు ఆమోదం తెలిపింది. దాదాపు తొమ్మిదేండ్ల వరకు ఈ ప్రాజెక్ట్ పట్టాలెక్కలేదు. మొదట కాంట్రాక్ట్ దక్కించుకున్న మైటాస్ సంస్థ వైదొలగడంతో ఎల్అండ్‌టీ తెరపైకి వచ్చింది. 90 శాతం, ఎల్అండ్‌టీ, 10 శాతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యతో ఒప్పందం కుదిరింది. 76 కిలోమీటర్ల నిడివిగల తొలిదశ ప్రాజెక్ట్ నిర్మాణం, నిర్వహణ, 35 ఏండ్ల కాలపరిమితి తర్వాత బదిలీ ప్రాతిపదికన ఎల్అండ్‌టీ సంస్థ హైదరాబాద్ మెట్రోను చేపట్టింది. ప్రారంభంలో వయబిలిటీ గ్యాప్ ఫండ్ కింద కేంద్రం రూ.1,639 కోట్లు ఇచ్చింది. 2017 నుంచి 2019 వరకు దశల వారీగా మూడు కారిడార్లు అందుబాటులోకి వచ్చాయి. 5 శాతం ప్రకటనలు, 45 శాతం వ్యాపార సముదాయాలు, 50 శాతం టికెట్ల ద్వారా ఆదాయం పొందాలని ప్రతిపాదించారు. ప్రకటనలు, టికెట్ల విధానం సక్సెస్ అయినా వ్యాపార సముదాయాల ద్వారా ఆదాయం సమపార్జనలో ఎల్అండ్‌టీ ఫెయిల్ అయింది. మెట్రో రైల్ ఇరువైపులా రాష్ట్ర ప్రభుత్వం 18 లక్షల చదరపు అడుగుల స్థలాన్ని కేటాయించింది. దాన్ని ఆదాయ మార్గంగా మార్చడంలో విఫలం కావడంతో సంస్థ నష్టాలను చవిచూసింది. ఈ క్రమంలో 2023లో చివర్లో రాష్ట్రంలో అధికార మార్పిడి రేవంత్‌రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ సర్కార్ అధికార పగ్గాలు చేపట్టింది. కొత్త ప్రభుత్వం ప్రతిపాదించిన ఫేజ్ 2 నిర్మాణంపై మెట్రో యాజమాన్యానికి సర్కార్‌కు మధ్య వివాదం పొడసూపింది. తాము ఇప్పటికే నష్టాల్లో ఉన్నామని ఫేజ్ 2 చేపట్టలేమని ఎల్అండ్‌టీ చేతులెత్తేసింది. ఒక వైపు కేంద్రం ఒత్తిడి, మరో వైపు ఎల్అండ్‌టీ మొండికేయడంతో రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్ మెట్రో ఫేజ్ 2ను టేకోవర్ చేసుకోవడానికి సిద్ధపడింది. ఇటీవల జరిగిన చర్చల్లో కంపెనీ అప్పులను బదలాయించుకోవడంతో పాటు సంస్థ పెట్టిన రూ.5,900 కోట్లకు గాను వన్‌టైం సెటిల్‌మెంట్ కింద రూ.2 వేల కోట్లు చెల్లించేందుకు ఒప్పందం కుదిరింది. అన్ని సవ్యంగా జరిగితే ఏడాదిలోపు హైదరాబాద్ మెట్రో రాష్ట్ర ప్రభుత్వ సంస్థగా మారనుంది. మెట్రో ఉదంతం అనేక ప్రశ్నలకు కేంద్ర బిందువుగా మారింది. పిపిపి మాడల్ కింద వచ్చే పెట్టుబడులు చివరి వరకు నిలబడతాయా? అనే సందేహాలకు తావిస్తున్నాయి. లాభాలు ఉంటేనే తాము నిర్వహిస్తాం.. లేదంటే తప్పుకుంటామంటే భవిష్యత్‌లో ఈ తరహా పెట్టుబడులు సర్కార్‌కు భారంగా మారుతాయనే అభిప్రాయం వ్యక్తంమవుతోంది. పీపీపీ మాడల్ పెట్టబడులపై సర్కార్ పునరాలోచించాల్సిన అవసరం ఉంది.

### దేశంలో మిశ్రమ స్పందన...

భారతదేశంలో పిపిపి మోడల్ సక్సెస్ రేటు మిశ్రమంగా ఉంది, అనేక ప్రాజెక్టులు వివిధ కారణాలతో విఫలమవుతున్నాయి. 2024 నివేదిక ప్రకారం దేశంలో 449 మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు సంక్షోభాలను ఎదుర్కొన్నాయి. సకాలంలో వివాదాలను పరిష్కరించే యంత్రాంగాలు లేకపోవడం కూడా ఇందుకు కారణంగా భావిస్తున్నారు. వివిధ రాష్ట్రాల్లో స్పష్టమైన, స్థిరమైన నిబంధనలు లేకపోవడం ప్రాజెక్టుల నిర్మాణం నిర్దేశిత గడువు కన్నా ఎక్కువ కాలం సాగుతోంది. ఈ క్రమంలో ప్రాజెక్ట్‌కు తీసుకొచ్చిన అప్పులు, వాటి వడ్డీలు తడిసి మోపెడవుతున్నాయి. డీటేయిల్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్)లో నిర్దేశించిన అంచనా రాబడి, వ్యయం మధ్య తీవ్రమైన వ్యత్యాసం ఏర్పడుతోంది. మెరుగైన ప్రాజెక్ట్ నిర్వహణ, రిస్క్ ప్రయివేట్ కంపెనీలకు భారంగా మారుతోంది. పలితంగా నష్టాలను చవిచూస్తున్న పలు సంస్థలు ఒప్పందం నుంచి వైదొలిగే ప్రయత్నం చేస్తున్నాయి. ఫలితంగా ప్రభుత్వాలకు అవి ఆర్థికంగా భారంగా మారుతున్నాయి.




## తన్వి సిల్వర్ షో

- పసిడి పోరులో యువ షట్లర్ ఓటమి
- ప్రపంచ జూనియర్ చాంపియన్‌షిప్స్

**గౌహతి :** భారత యువ షట్లర్ తన్వి శర్మ (16) ప్రపంచ జూనియర్ చాంపియన్‌షిప్స్‌లో రజత పతకం సాధించింది. టాప్ సీడ్ తన్వి శర్మ ఆదివారం గువహటిలోని నేషనల్ సెంటర్ ఫర్ ఎక్సలెన్స్‌లో జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో రెండో సీడ్, థాయ్‌లాండ్ షట్లర్ అన్యపత్ చేతిలో తన్వి శర్మ పరాజయం పాలైంది. 28 నిమిషాల్లోనే ముగిసిన పసిడి పోరులో 15-7, 15-12తో అన్యపత్ వరుస గేముల్లో గెలుపొందింది. రచనోక్ (2009, 2011), పిచ్‌మాన్ (2023) తర్వాత ప్రపంచ జూనియర్ చాంపియన్‌గా నిలిచిన మూడో థాయ్‌లాండ్ షట్లర్‌గా అన్యపత్ నిలిచింది. తొలి గేమ్‌లో తడబడిన తన్వి శర్మ.. రెండో గేమ్‌లో పుంజుకుంది. కానీ మ్యాచ్‌ను మూడో గేమ్‌కు తీసుకెళ్లటంలో విఫలమైంది. 17 ఏండ్ల తర్వాత ప్రపంచ జూనియర్ చాంపియన్‌షిప్స్‌లో భారత్‌కు పతకం సాధించిన తన్వి శర్మ.. అపర్ణ పోపట్ (1996), సైనా నెహ్వాల్ (2006), సిరిల్ వర్మ (2015), శంకర్ ముతుసామి (2022) తర్వాత సిల్వర్ మెడల్ నెగ్గిన ఐదో భారత షట్లర్‌గా రికార్డు నెలకొల్పింది.

## మర్రి లక్ష్మణ్ రెడ్డికి పసిడి

- తెలంగాణ రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీలు

**హైదరాబాద్ :** తెలంగాణ స్విమ్మింగ్ అసోసియేషన్ నిర్వహించిన 10వ రాష్ట్రస్థాయి మాస్టర్స్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో వెటరన్ స్విమ్మర్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి బంగారు పతకం సాధించాడు. పురుషుల అండర్-84 విభాగంలో హైదరాబాద్ జిల్లా తరఫున కొలనులోకి దిగిన మర్రి లక్ష్మణ్‌రెడ్డి అంబర్‌పేట్ స్విమ్మింగ్‌పూల్‌లో జరిగిన 50 మీటర్ల బ్రెస్ట్‌స్ట్రోక్ ఈవెంట్‌ను 01.45.88 సెకండ్లలో ముగించి ప్రథమ స్థానంలో నిలిచారు. గోల్డ్‌మెడల్ సాధించిన మర్రి లక్ష్మణ్‌రెడ్డిని ఆయన తనయుడు మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అభినందించారు.

## 25, 26న ఫెన్సింగ్ సెలక్షన్స్

**హైదరాబాద్ :** ఈ నెల 25, 26న అండర్-14 విభాగంలో రాష్ట్ర జట్లను ఎంపిక చేసేందుకు సెలక్షన్ ట్రయల్స్ నిర్వహిస్తున్నట్టు తెలంగాణ ఫెన్సింగ్ సంఘం (టిఎఫ్ఎ) ప్రెసిడెంట్ గుత్తా జ్వాల, కార్యదర్శి శ్రీనివాసరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మాదాపూర్‌లోని డెక్కన్ ఫెన్సింగ్ క్లబ్‌లో సెలక్షన్ ట్రయల్స్ జరుగుతాయి. ట్రయల్స్‌లో ఎంపికైన ఫెన్సర్లు జాతీయ స్థాయి సబ్ జూనియర్ అండర్-14 చాంపియన్‌షిప్‌లో తెలంగాణ తరఫున ప్రాతినిథ్యం వహించనున్నారు.



## కొచ్చి రెండో విజయం

- 1-3తో కాలికట్ హీరోస్ ఓటమి
- ప్రైమ్ వాలీబాల్ లీగ్ సీజన్ 4

**హైదరాబాద్ :** ప్రైమ్ వాలీబాల్ లీగ్ (పీవీఎల్) నాల్గో సీజన్‌ను డిఫెండింగ్ చాంపియన్ కాలికట్ హీరోస్ ఓటమితో ముగించింది. ఆదివారం గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగిన గ్రూప్ దశ మ్యాచ్‌లో కొచ్చి బ్లూ స్పైకర్స్ 15-13, 9-15, 15-8, 15-13తో కాలికట్ హీరోస్‌పై ఘన విజయం సాధించింది. ఈ సీజన్లో ఆరో ఓటమితో పీవీఎల్ 4 గ్రూప్ దశ నుంచే కాలికట్ హీరోస్ నిష్క్రమించింది. మౌషిన్ పా 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు.

## ఢిల్లీపై గోవా విజయం

- ప్రైమ్ వాలీబాల్ లీగ్ సీజన్ 4

**హైదరాబాద్ :** ప్రైమ్ వాలీబాల్ లీగ్ (పీవీఎల్) నాల్గో సీజన్లో గోవా గార్డియన్స్ సెమీఫైనల్ ఆశలు సజీవంగా నిలుపుకుంది. ఆదివారం గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగిన గ్రూప్ దశ మ్యాచ్‌లో ఢిల్లీ తుఫాన్స్‌పై 14-16, 11-15, 15-11, 16-14, 15-11తో గోవా గార్డియన్స్ మెరుపు విజయం సాధించింది. గ్రూప్ దశలో ఆఖరు మ్యాచ్ ఆడేసిన గోవా గార్డియన్స్ సీజన్లో మూడో విజయం ఖాతాలో వేసుకుంది. ఢిల్లీ తుఫాన్స్ గ్రూప్ దశలో ఆరు మ్యాచుల్లో నాల్గో పరాజయం చవిచూసింది. ప్రిన్స్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. 3 విజయాలతో 10 పాయింట్లు సాధించిన గోవా గార్డియన్స్ పాయింట్ల పట్టికలో నాల్గో స్థానంలో నిలిచింది.



# అధికారంలో లేకున్నా చెడుపై పోరాడతాం

## పున్నమి ఘాట్‌లో నిర్వహించిన దీపావళి వేడుకల్లో సిఎం దంపతులు



నృత్య రూపాలను ప్రదర్శిస్తున్న కళాకారులు

**ప్రజాశక్తి - విజయవాడ సిటీ :** విజయవాడ పున్నమి ఘాట్‌లో నిర్వహించిన దీపావళి వేడుక సంబరాలు అంబరాన్నంటాయి. ఈ వేడుకలలో ముఖ్యమంత్రి చంద్రబాబు దంపతులు పాల్గొన్నారు. అనాథ పిల్లలతో సిఎం చంద్రబాబు, ఆయన సతీమణి భువనేశ్వరి కాసేపు గడిపారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగిం చారు. గత ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు గొప్ప విజయం అందించారన్నారు. అధికారంలో ఉన్నా, లేకున్నా చెడుపై పోరాడుతూనే ఉంటామన్నారు. 2019-24 మధ్య మన రాష్ట్రాన్ని ఒక రాక్షసుడు పట్టి పీడించాడని రాష్ట్ర ప్రజలు చైతన్యవంతులై ఓటు అనే ఆయుధంతో ఆ రాక్షసుడిని ఎన్నికలలో ఓడించారని గుర్తు చేశారు. మళ్లీ రాష్ట్రంలో వైకుంఠపాళి జరిగితే నాశనమవు తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్ర మాలు, ఫైర్ క్రాకర్స్ ఆకట్టుకున్నాయి. కార్యక్ర మంలో మంత్రి కొల్లు రవీంద్ర, విజయవాడ పార్లమెంటు సభ్యులు శివనాథ్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

# అధికారులపై 'టేకులోడు'..!

- చిలమత్తూరు రెవెన్యూలో గందరగోళం
- ఒక్కొక్కరుగా మారుతున్న అధికారులు
- టేకులోడు భూసేకరణతో అదిరిపోతున్న అధికారులు
- అధికార పార్టీ నేతల ఒత్తిళ్లే కారణమా..?




**ప్రజాశక్తి-చిలమత్తూరు**

హిందూపురం నియోజకవర్గం చిలమత్తూరు రెవెన్యూ కార్యాలయంలో ఇటీవల జరుగుతున్న పరిణామాలు చర్చనీయాంశంగా మారుతున్నాయి. ప్రస్తుతం మండల పరిధిలోని టేకులోడు రెవెన్యూ పొలంలో భూ సేకరణ ప్రక్రియ జరుగుతోంది. ఇది జరుగుతున్న సమయంలో అధికారులు ఒకరి తర్వాత ఒకరు సెలవుపై వెళ్తుండడం, ఆర్ఐ, ఇద్దరు వీఆర్వోలను వేరే మండలానికి డిప్యూటేషన్ చేసే పరిణామాలు చర్చకు దారితీస్తున్నాయి. మండలంలో అధికార పార్టీ నాయకుల ఒత్తిడి తట్టుకోలేక గత తహశీల్దార్ నటరాజ్ ఆరోగ్య సమస్య పేరుతో దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. ఆ స్థానంలో హిందూపురం తహశీల్దార్ వెంకటేష్‌కు అదనపు బాధ్యతలు ఇచ్చారు. తాజాగా రెవెన్యూ ఇన్స్పెక్టర్, టేకులోడు వీఆర్వో, మరో విఆర్వోని డిప్యూటేషన్ చేశారు. అధికార పార్టీ నాయకులు చెప్పిన పని చేయని కారణంగానే వారిని డిప్యుటేషన్ చేసినట్లు సమాచారం. ఇలా చిలమత్తూరు రెవెన్యూలో జరుగుతున్న అధికారుల స్థాన చలనంపై పెద్ద చర్చ నడుస్తోంది.

భూ సేకరణ జరుగుతున్న రెవెన్యూ పొలంలో అప్పటికే పని చేస్తున్న అధికారులను తొలగించరు. కొత్తవారొస్తే భూ సేకరణ మరింత ఆలస్యం అవుతుందన్న కారణంతో పాతవారితోనే ఈ పనినికానిస్తారు. అలాంటిది భూసేకరణ జరుగుతున్న టేకులోడు గ్రామ విఆర్వోను మార్చడం వెనుక ఆంతర్యం ఏమిటన్నది అంతుపట్టని విషయం. ఈ ఉద్యోగి మార్పు వెనుక అధికార పార్టీ నేతల ఒత్తిడి ఉందన్న విమర్శలు విన్పిస్తున్నాయి. కొత్త వీఆర్వోని నియమిస్తే కొత్తగా వచ్చిన ఆ అధికారి సేకరణ పనులను వేగవంతం చేస్తారా.? అన్నది మాత్రం ప్రశ్నార్థకంగానే ఉంది. ఒకవేళ పాత విఆర్వోపై ఏవైనా అవినీతి విమర్శలుంటే ఆయనపై చర్యలు తీసుకుంటారు. అలాకాకుండా డిప్యుటేషన్ వేయడం ఏమిటన్న ప్రశ్న ఉద్యోగుల్లో వ్యక్తం అవుతోంది.

చిలమత్తూరులో డీటీగా విధులు నిర్వహిస్తున్న జగన్నాథ్ సీనియర్ ఉద్యోగి. ఈయనకు రెవెన్యూ విభాగంపై పూర్తిగా అవగాహన ఉంది.

తహశీల్దార్ లేని కారణంగా ఈయనకు తహశీల్దార్‌గా అదనపు బాధ్యతలు ఇవ్వొచ్చు. అలా చేయకుండా అధికార పార్టీ నాయకులు పట్టుబట్టి ఇన్‌ఛార్జిగా హిందూపురం తహశీల్దార్‌ను తెచ్చుకున్నారు. ఆయనకు ఇన్‌ఛార్జి ఇస్తే తమ పనులు చక్కబెట్టుకోవచ్చని అధికార పార్టీ నాయకులు భావిస్తున్నారు. త్వరలో ఈయనే చిలమత్తూరు తహశీల్దార్‌గా పూర్తి బాధ్యతలు స్వీకరిస్తారని కూడా అధికార పార్టీ నేతలు చెబుతున్నారు.

ఇదే సమయంలో చిలమత్తూరు డిప్యూటీ తహశీల్దార్ జనార్ధన్‌ను డిప్యూటేషన్ చేసేందుకు చాపకింద ప్రయత్నం జరుగుతున్నట్లు సమాచారం.

వరుస డిప్యూటేషన్ల నేపథ్యంలో రెవెన్యూ అధికారులకు అధికార పార్టీ నేతలు ఏ పని చెప్పారు.? అధికారులు ఆ పని చేయడానికి ఎందుకు బయపడుతున్నారు.? అన్నది చర్చగా మారింది. టేకులోడు భూముల విషయంలో అధికార పార్టీ నాయకులకు అధికారులు సహకరించలేదన్నది ప్రాథమికంగా జరుగుతున్న చర్చ. మరి ఆ రెవెన్యూ పొలంలో సెజ్‌కు సంబంధించిన భూముల్లో అధికార పార్టీ నేతల భూములు ఉన్నాయా... లేక ఇతరుల భూములను కాజేసేందుకా..? అన్న చర్చ మండలంలో జోరుగా జరుగుతోంది.

చిలమత్తూరులో ఇన్‌ఛార్జి తహశీల్దార్ కొనసాగుతున్నారు. ఆయన అప్పుడప్పుడే కార్యాలయానికి వస్తారు. డిటి, ఆర్ఐ, వీఆర్వోలని ఒక్కొక్కరిగా డిప్యుటేషన్ చేస్తున్నారు. అధికారుల మార్పుతో మండల ప్రజలు, ముఖ్యంగా భూసేకరణ

జరుగుతున్న టేకులోడు రైతులు ఆందోళన చెందుతున్నారు. భూ సేకరణ జాబితాలో భూమి ఉండి, వివిధ కారణాలతో ఇంకా నష్ట పరిహారం అందని రైతులు పాసు పుస్తకాలు పట్టుకుని తహశీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. మరికొందరు పాసు పుస్తకాలు లేక డీ పట్టాలను వీఆర్వోకు ఇచ్చారు. రైతులకు సమాచారం ఇచ్చే అధికారి లేక వారు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఈ సమయంలో సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి మండలంలో అధికారుల మార్పు వ్యవహారంలో జరుగుతున్న పరిణామాలను బహిర్గతం చేసి రైతుల్లో నెలకొన్న ఆందోళనలను తొలగించాలని పలువురు కోరుతున్నారు.


## కాళహస్తిలో ప్రముఖులు

**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి :** తెలంగాణ మాజీ సిఎం కెసిఆర్ కుమార్తె, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆదివారం కుటుంబ సమే తంగా శ్రీకాళహస్తీశ్వరాలయానికి విచ్చేశారు. వీరికి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి, దేవస్థానం మాజీ చైర్మన్ అంజూర తారక శ్రీనివాసులు, ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉన్నం వాసుదేవ నాయుడు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వయ్యాల కృష్ణారెడ్డి తదితరులు దక్షిణ గోపురం వద్ద స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ప్రత్యేక రాహు- కేతు పూజ చేసుకున్నారు. స్వామి అమ్మవార్ల దర్శనం అనంతరం వేద పండితులు ఆశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పగడాల రాజు, కంటా ఉదయ్ కుమార్, గున్నేరి కిషోర్ రెడ్డి, మున్నా రాయల్, మల్లెంబాకం మునికష్ణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా తెలంగాణా ఎంపీ ఈటెల రాజేంద్ర కూడా కుటుంబ సమేతంగా ముక్కంటిని దర్శించుకున్న వారిలో ఉన్నారు.

## హత్య కేసులో నిందితులు అరెస్టు

**ప్రజాశక్తి - కదిరి టౌన్**

ఆస్తి కోసం కన్న కొడుకే తల్లిని హత్య చేసిన ఘటనలో నిందితులను అరెస్ట్ చేసినట్లు పట్టణ సిఐ నారాయణరెడ్డి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈనెల 12న కదిరి టౌన్ నిజాంవలి కాలనీ, జెండామాను వీధిలో నివాసం ఉంటున్న షేక్ కాసింబీ అలియాస్ షాదాబీ (65 ) ను ఆమె కొడుకు అల్లా బకాష్ ఆలియాస్ బాబా ఫక్రుద్దీన్ తన రెండవ భార్య షేక్ రసూల్ బితో కలిసి కట్టె, కత్తితో ఆమెను హత్య చేశారని ఆమె వద్ద ఉన్న డబ్బులు, బంగారు ఆభరణాలు, ఇంటి పత్రాలను తీసుకొని పారిపోయారని మతురాలు కూతురు షేక్ అమ్మాజాన్ ఫిర్యాదు చేసిందని సిఐ చెప్పారు. ఆమె ఫిర్యాదు మేరకు 13న కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టామన్నారు. ఈ నేపథ్యంలో కదిరి కుటాగుల రైల్వే గేట్ వద్ద మతురాలి కొడుకు షేక్ అల్లాబకాస్ అలియాస్ బాబా ఫక్రుద్దీన్, అతని రెండవ భార్య షేక్ రసూల్ ఉండగా అరెస్టు చేసినట్లు చెప్పారు. డబ్బులు, నగలు ఆస్తి కోసమే హత్య చేసినట్లు తమ దర్యాప్తులో వెల్లడైందని సిఐ చెప్పారు. నిందితులను ధర్మవరం కోర్టు ముందు హాజరుపరచగా కోర్టు 14 రోజులు రిమాండ్ విధించడంతో అనంతపురం జైలుకు తరలించామని సిఐ వివరించారు.



## వృద్ధాప్యంతో తెల్ల పెద్దపులి మృతి


**ప్రజాశక్తి - తిరుపతి (మంగళం):** శ్రీ వెంకటేశ్వర జూలాజికల్ పార్కులో తెల్ల పెద్దపులి ' సమీర్ ' వృద్ధాప్యంతో వచ్చే అనారోగ్య కారణాలతో మరణించినట్లు క్యూరేటర్ సెల్వం తెలిపారు. 2011లో ఐదు సంవత్సరాల వయసులో హైదరాబాదులోని నెహ్రూ జూలాజికల్ పార్క్ నుండి తిరుపతి జూలాజికల్ పార్కుకు తరలించారని, గడిచిన 14 ఏళ్లుగా జూ పార్కులో సందర్శకులను ఆకట్టుకుందన్నారు. ఏడాదిగా వృద్ధాప్యం, అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్న సమీర్‌ను సందర్శనకు ఉంచకుండా చర్యలు తీసుకున్నామని, కొద్ది రోజులుగా ద్రవ ఆహారం తీసుకుంటోందని, గత వారం రోజులగా అది కూడా తీసుకోలేక ఆదివారం తెల్లవారుజామున మృతి చెందిందన్నారు. శ్రీ వేంకటేశ్వర వెటర్నరీ విశ్వవిద్యాలయం, పాథాలజీ విభాగం వైద్యుల బృందం నిర్వహించిన పోస్ట్‌మార్టమ్ పరీక్షలో మూత్రపిండాల్లో నీటి నిల్వ (హైడ్రో నెఫ్రోసిస్) అనారోగ్య సమస్య ఉన్నట్లు తేలిందన్నారు.

## తిరుమల ఘాట్ రోడ్డులో విరిగిపడ్డ కొండరాళ్లు

**ప్రజాశక్తి - తిరుమల:** తిరుమలలో ఎడతెరిపి లేని వర్షాలు కురుస్తున్నాయి. వర్షాల కారణంగా తిరుమల రెండో ఘాట్ రోడ్డులో కొండ చరియలు విరిగి పడ్డాయి. బండ రాళ్లు రోడ్డుపై పడటంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. టీటీడీ ఇంజనీరింగ్ అధికారులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. తిరుమలలో గత నాలుగు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. వర్షాల కారణంగా రెండో ఘాట్ రోడ్డులో తొమ్మిదో కిలోమీటర్ వద్ద కొండచరియలు విరిగిపడ్డాయి. భారీ బండరాళ్లు రోడ్డు మీద పడిపోవడంతో వాహనాలు వెళ్లడానికి తీవ్ర ఇబ్బంది కలిగింది. దీంతో, ఘటనా స్థలానికి చేరుకున్న టిటిడి ఇంజనీరింగ్ అధికారులు విరిగిపడిన కొండ చరియలను తొలగించారు. ఘాట్ రోడ్‌లో ట్రాఫిక్‌కి అంతరాయం లేకుండా జెసిబితో బండరాలను తొలగించారు

# రూ.500 కోట్ల స్కామ్‌లో కేరళ బిజెపి చీఫ్

- ఢిల్లీ న్యాయవాది ఫిర్యాదుతో వెలుగులోకి



**బెంగళూరు :** రూ.500 కోట్ల స్కామ్‌లో కేరళ బిజెపి చీఫ్ రాజీవ్ చంద్రశేఖర్ పేరు బయటకు రావడం దేశవ్యాప్తంగా రాజకీయంగా సంచలనంగా మారింది. కర్ణాటకలో ఈ భూకుంభకోణం వెలుగుచూసింది. బిపిఎల్ ఇండియా లిమిటెడ్‌కు పారిశ్రామిక అవసరాల కోసం కర్ణాటక ఇండస్ట్రియల్ ఏరియాస్ డెవలప్‌మెంట్ బోర్డ్ (కెఐఎడిడి) కేటాయించిన భూమిలో పరిశ్రమలు స్థాపించకుండా వందల కోట్ల రూపాయలకు అమ్ముకున్నారు. దీనిపై ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణను ప్రారంభించింది. రాజీవ్ చంద్రశేఖర్, అతని భార్య అంజు చంద్రశేఖర్, అజిత్ గోపాల్ నంబియార్, బిజెపి నాయకుడు, మాజీ మంత్రి కట్టా సుబ్రహ్మణ్య నాయుడు పాల్పడిన భూదందాపై కర్ణాటక ప్రభుత్వం విచారణ చేయాలంటూ ఢిల్లీకి చెందిన న్యాయవాది కేఎన్ జగదీశ్ కుమార్ పిటిషన్ దాఖలు చేశారు. ఆయన బిపిఎల్ ఇండియాను కూడా తన పిటిషన్‌లో లక్ష్యంగా చేసుకున్నారు. కాగా, అంజు చంద్రశేఖర్ బిపిఎల్ గ్రూప్ వ్యవస్థాపకుడు టీపీజీ నంబియార్ కుమార్తె.

**ఈ కుంభకోణం ఎలా జరిగిందంటే..**

నేలమంగళ, దొబ్బాస్పేట్‌లో టీవీ, కలర్ ట్యూబ్‌లు, బ్యాటరీలు తయారు చేసే యూనిట్‌ను ఏర్పాటు చేసేందుకు 175 ఎకరాల వ్యవసాయ భూమిని బిపిఎల్‌కు 1995లో కెఐఎడిడి కేటాయించింది. ఆ భూమిలో 2004 వరకు ఎలాంటి పారిశ్రామిక యూనిట్‌లు ఏర్పాటు చేయలేదు. అయితే 1995లోనే కెఐఎడిడి149 ఎకరాలకు సంబంధించిన స్వాధీన డాక్యుమెంట్లను బిపిఎల్‌కు ఇచ్చేసింది. 1996 ఏప్రిల్‌లో అజిత్ గోపాల్ నంబియార్, అంజు రాజీవ్ చంద్రశేఖర్‌లు ఆ భూమిని తనఖా పెట్టి రుణాలు పొందారు. తర్వాత అప్పటి కర్ణాటక బిజెపి మంత్రి కట్టా సుబ్రహ్మణ్య నాయుడు సహకారంతో ఆ భూమిని అమ్మే హక్కును కూడా పొందారు. అనంతరం దానిని ముక్కలు ముక్కలుగా చేసి పలు సంస్థలకు అమ్మేశారు. 2011 లోనే 87 ఎకరాలను 275 కోట్ల రూపాయలకు అమ్మేశారు. ఈ భారీ భూ కుంభకోణంపై కర్ణాటక ప్రభుత్వం వెంటనే విచారణ జరపాలని న్యాయవాది కెఎన్ జగదీశ్ కుమార్ కోరారు.

# శ్రీకూర్మ క్షేత్రానికి మహర్దశ

- కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

**గార:** ప్రసిద్ధి చెందిన శ్రీకూర్మం ఆలయాన్ని దర్శించుకోవడం ఆనందంగా ఉందని కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, విజయనగరం ఎమ్మెల్యే అతిథి గజపతిరాజు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలిసి ఆదివారం ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాలను పరిశీలించారు. పురాణ ప్రాశస్త్యత గురించి తెలుసుకున్నారు. పుష్కరిణి పరిసర ప్రాంతాలను ఎలా వృద్ధి చేయొచ్చో క్షేత్రస్థాయిలో సమీక్షించారు. అవసరమైన సూచనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ శ్రీకూర్మనాథ క్షేత్రాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. 7వ శతాబ్దానికి చెందిన ఏకైక పురాతన కూర్మనాథ ఆలయాన్ని మరింత వృద్ధి చేయాల్సిన అవశ్యకత ఎంతో ఉందని స్పష్టం చేశారు. ఆలయ అభివృద్ధికి బోర్డు మెంబర్లు, స్థానికులు, జిల్లా అధికారులతో కలిసి ప్రణాళికలు సిద్ధం చేసినట్టు స్పష్టం చేశారు. గోడలు, స్తంభాలు, కొన్ని చోట్ల విగ్రహాలను జీర్ణోద్ధారణ చేయాల్సిన పరిస్థితిని వివరించారు. శ్వేత పుష్కరిణీ, పిండ ప్రధాన ప్రాంతంలో భవనం, పార్కింగ్ ప్రాంతాలను అభివృద్ధి చేయాలని ఆలయ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయాధికారులు పాల్గొన్నారు.

## 10 వేల కొత్త ఎంబిబిఎస్ సీట్లకు ఆమోదం

- 2024-25కు ఎన్ఎంసి ప్రకటన

**న్యూఢిల్లీ :** 2024-25 విద్యా సంవత్సరానికి గాను 10,650 కొత్త ఎంబిబిఎస్ సీట్లకు జాతీయ వైద్య కమిషన్(ఎన్ఎంసి) ఆమోదం తెలిపింది. దేశంలో వైద్య విద్యను అందుబాటులోకి తెచ్చే చర్యల్లో భాగంగా ఈ నిర్ణయాన్ని తీసుకున్నట్ల ప్రకటించింది. కొత్తగా 41 వైద్య కళాశాలలకు కూడా ఎన్ఎంసి అనుమతి ఇచ్చింది. దీంతో దేశంలో వైద్య విద్యా సంస్థల సంఖ్య 816కు చేరుకుంది.

అలాగే, తాజా పెంపుతో దేశంలో ఎంబిబిఎస్ సీట్ల సంఖ్య 1,37,600కు చేరుకుంది. పీజీ సీట్ల సంఖ్య మరో 5 వేల వరకు పెరగొచ్చని ఎన్ఎంసి చీఫ్ అభిజిత్ తెలిపారు. కళాశాలల గుర్తింపు, సీట్ల లభ్యత, పరీక్షలకు సంబంధించి బ్లూ ప్రింట్ త్వరలోనే విడుదల చేస్తామన్నారు. 2025-26 సంవత్సరం దరఖాస్తుల కోసం నవంబర్‌లో పోర్టల్ ప్రారంభిస్తామన్నారు. వైద్య విద్యలో నాణ్యతను పెంచడానికి క్లినికల్ రిసెర్చ్‌ను ప్రధాన సిలబస్‌లో భాగం చేస్తామన్నారు. ఇందుకోసం భారత వైద్య పరిశోధన మండలి సహకారం తీసుకొనే ఆలోచన ఉందన్నారు.

## ఇదెక్కడి న్యాయం..?

**ప్రజాశక్తి - పరిగి**



కంచె చేనును మేసినట్లు ఉంది ఫారెస్ట్ అధికారుల పరిస్థితి. అడవులను కాపాడాల్సిన అధికారులే చెట్లు నరికివేతదారులకు మద్దతిస్తూ సొమ్ము చేసుకుంటున్న పరిస్థితి పరిగి మండలంలో చోటు చేసుకుంది. అందుకు సంబందించిన వివరాల్లోకెళితే పరిగి మండలంలోని కాలువపల్లి వద్ద రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం తొమ్మిది ఎకరాల స్థలాన్ని రియల్ ఎస్టేట్ వ్యాపారులు కొన్నారు. అయితే ఈ భూమిలో సుమారు 15 ఏళ్లుగా పెంచిన చింత, వేప చెట్లు 30కి పైగా ఉన్నాయి.అయితే ఈ భూమిలో రియల్ ఎస్టేట్ వ్యాపారానికి ప్లాట్లు వేసేందుకు చెట్లు అడ్డంగా ఉండటంతో వాటి తొలగింపునకు వ్యాపారులు సిద్ధమయ్యారు. అందులో భాగంగా చెట్ల తొలగింపునకు తహాశీల్దార్ అనుమతి కోరారు. భూమిని పరిశీలించిన తహాశీల్దార్ అటవీ శాఖ అధికారులకు సిఫార్సు చేశారు. దీంతో అటవీశాఖ15 ఏళ్ల నాటి చింత, వేప, కానుగ చెట్లు నరికి వేసేందుకు ఒక్కో చెట్టుకు 50 రూపాయలు మాత్రమే రుసుము తీసుకుని ఎస్ ఎన్ సునంద పేరు మీద అనుమతులు ఇచ్చారు. అయితే ఒక చెట్టు నరకాలంటే ఎన్నో కారణాలు చెప్పే అటవీశాఖ అధికారులు 15 ఏళ్ల నుండి ఉన్న చెట్ల నరికివేతకు రూ. 1350 లకే ఎలా అనుమతి ఇస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈ వ్యవహారంలో ఫారెస్ట్ అధికారుల హస్తం ఏమేరకు ఉంది, ఎంత నగదు చేతులు మారింది అన్నది తేలాల్సుందని వారు వ్యాఖ్యానిస్తున్నారు. ఒక చెట్టును నరికితే లక్ష రూపాయలు విధించాలని ఇటీవల సుప్రీంకోర్టు సైతం తీర్పులిస్తున్నా అలాంటివి క్షేత్రస్థాయిలో అమలు కాకపోవడం చూస్తే సుప్రీంకోర్టు ఆదేశాలను సైతం అటవీ శాఖ అధికారులు పాటించడం లేదని తెలుస్తోందని స్థానికులు విమర్శిస్తున్నారు. అంతేకాకుండా ఓ సగటు వ్యక్తి చింత చెట్టు కానీ వేపచెట్టు కానీ నరికితే ఎంతో హడావిడి చేసే ఫారెస్ట్ అధికారులు రియల్ ఎస్టేట్ వ్యాపారులకు వత్తాసు పలకడం విడ్డూరంగా ఉంది. తాము ప్రకృతి సంరక్షకులు అని, చెట్లు నరికి వేస్తే అధికారుల అంతు చూస్తాం అంటున్న కొంతమంది చెట్ల సంరక్షకులు ఒక సామాజిక వర్గానికి చెందిన వారికి వత్తాసు పలకడం ప్రత్యక్షంగా కనిపిస్తోందని స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా మండలంలో వాల్టాచట్టం కూడా అమలులో ఉండటం గమనార్హం. అయితే ఎంతమంది అధికారులు ఈ రియల్ ఎస్టేట్ వ్యాపారుల ద్వారా లబ్ధి పొంది, పర్యావరణ పరిరక్షణ నష్టానికి పూనుకున్నారన్నది ఉన్నతాధికారులు విచారణలో తేలాల్సుంది.

## వ్యవసాయ పంటలపై ఏనుగుల గుంపు దాడి

**ప్రజాశక్తి - రొంపిచర్ల:** చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలంలో ప్రతిరోజు ఏదో ఒక గ్రామంలో ఏనుగులు దాడి పరిపాటిగా మారింది. పులిచెర్ల రిజర్వ్ ఫారెస్ట్‌లో తిష్ట వేసిన ఏనుగుల గుంపు నిత్యం అర్ధరాత్రి దాటాక అటవీ ప్రాంతానికి దగ్గరలో ఉన్న వ్యవసాయ పంటలపై దాడి చేసి రైతులను నష్టపరుస్తున్నాయి. ఈ క్రమంలో ఆదివారం తెల్లవారు జామున పాలెం పంచాయితీలో రైతులు మునిస్వామి, శివకుమార్, మోహన్, జయపాల్, శుభరత్నం రైతులకు చెందిన పశువుల మేతకు నాటుకున్న గడ్డి, కొబ్బరి చెట్లు, మామిడి చెట్లను ఏనుగుల గుంపు విరిచి, తిని తొక్కుకుంటూ విధ్వంసం చేశాయి. అటవీ శాఖ అధికారులు ఎఫ్ఎస్ఓ మహమ్మద్ షఫీ, ఎఫ్‌బిఓ మధు పంటలను పరిశీలించి నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ద్వారా సాయం అందిస్తామని తెలిపారు. ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ మహమ్మద్ షఫీ మాట్లాడుతూ పులిచెర్ల మండలంలో ఏనుగుల గుంపు దాడుల్లో పంటలు కోల్పోయిన దేవళంపేట, పాలెం పంచాయతీల్లో నష్టపోయిన 18 మంది రైతు బాధితులకు రూ.3,18,500లు నష్టపరిహారం చెల్లించినట్లు తెలిపారు.

## పరవళ్లు తొక్కుతున్న గార్గేయనది

**ప్రజాశక్తి-పీలేరు**

పీలేరు పరిసరాల్లో కురుస్తున్న వర్షానికి గార్గేయనది పరవళ్ళు తొక్కుతోంది. చిత్తూరు జిల్లా, సోమల మండలంలోని పెద్ద ఉప్పరపల్లి అటవీ ప్రాంతంలో విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో వర్షం నీరు గార్గేయ నదికి అధికంగా చేరుతోంది.నది ఉధృతంగా ప్రవహిస్తోంది. నదీపరివాహక ప్రాంతాల్లోని చెరువులు, కుంటల్లో నీరు నింపుకునేందుకు ఆయకట్టు రైతులు సామూహికంగా ముందుగనే సప్లై ఛానళ్లను శుభ్రం చేసి ఉంచుకుని, నీటిని కాలువల్లోకి మళ్లించి తద్వారా చెరువులు, కుంటలను నీటితో నింపుకునే పనుల్లో అన్నదాతలు నిమగ్నమయ్యారు. నది నీరు పింఛ ప్రాజెక్టు వైపుకు జోరుగా ప్రవహిస్తోంది. గార్గేయనదికి అడ్డంగా వాహనదారులు రోడ్డు దాటే ప్రయత్నంలో చోటు చేసుకున్న గత ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని తహశీల్దారు శివకుమార్ తమ సిబ్బందిని అప్రమత్తం చేశారు. మండల పరిధిలోని నూనేవాండ్లపల్లి సమీపంలో నదిని ఎవరూ దాటడానికి వీలు లేకుండా, నదికి ఇరువైపులా రోడ్డుకడ్డంగా కంచె వేయడంతోపాటు హెచ్చరిక బోర్డులను కూడా ఏర్పాటు చేశారు. అంతేకాకుండా పశువులను కడగడం కోసం కూడా నదికి ఎవరూ రాకుండా అక్కడ రెవెన్యూ సిబ్బందిని కాపలా ఉంచారు.

## పెరిగిన తాటిపూడి నీటిమట్టం

**ప్రజాశక్తి-గంట్యాడ**

ఎగువున శనివారం రాత్రి కురిసిన వర్షానికి గంట్యాడ మండలంలోని తాటిపూడి జలాశయం నీటిమట్టం 296 అడుగులకు పెరిగింది. ప్రాజెక్టు గరిష్ట నీటిమట్టం 297 అడుగులు. జలాశయంలోకి సుమారు 1012 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. దీంతో ఆదివారం గేటు ఎత్తి గోస్తనీ నదిలోకి 350 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. వర్షం ప్రభావం ఎక్కువగా ఉంటే గోస్తనీ నదిలోకి అధికంగా నీరు విడుదల చేస్తామని ఇరిగేషన్ ఎఇ శంకర్ తెలిపారు.

## జాతీయ స్థాయి ఫెన్సింగ్ క్రీడా పోటీలకు గిరిజన విద్యార్థులు

**ప్రజాశక్తి -గుమ్మలక్ష్మీపురం**

గుమ్మలక్ష్మీపురం మండలంలోని కొత్తగూడ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలకు చెందిన బిడ్డిక హర్షవర్ధన్, జియమ్మవలస మండలం పెదమేరంగి తిరుమల సాయి పాఠశాలకు చెందిన నిమ్మల జితేంద్ర, జాతీయ స్థాయి ఫెన్సింగ్ క్రీడా పోటీలకు ఎంపిక య్యారు. ఈనెల 17న విజయనగరం లోని విజ్జీ స్టేడియంలో జరిగిన సబ్ జూనియర్ బాల బాలికల ఫెన్సింగ్ సెలక్షన్ ట్రయిల్స్‌లో నిమ్మల జితేంద్ర, బిడ్డిక హర్షవర్ధన్ ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 18న కాకినాడ ఇంటర్నేషనల్ స్కూల్‌లో నిర్వహించిన 12వ సబ్ జూనియర్ అంతర జిల్లా బాల, బాలికల ఫెన్సింగ్ ఫోయిల్ వ్యక్తిగత విభాగంలో కాంస్య పతకాలు సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైయ్యారు. కోచ్ బాలరాజు, హెచ్ఎంలు బి.శ్రీనివాసరావు, ఆర్.వెంకటరమణ, పిడి మాధవరావు, తల్లిదండ్రులు అభినందించారు.

# యూట్యూబ్‌లో మోడీ 'చెత్త రికార్డు'

- 3 లక్షలు దాటిన డిస్‌లైక్‌లు..



**న్యూఢిల్లీ :** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మరో చెత్త రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. ఇటీవల మోడీని కీర్తిస్తూ యూట్యూబ్‌లో ఒక పాట విడుదల కాగా.. ఆ పాటకు దాదాపు 3 లక్షలకు పైగా డిస్‌లైక్‌లు (వ్యతిరేకంగా) వచ్చాయి. ప్రధాని మోడీ రాజకీయ రంగంలో కీలక పదవుల్లో చేరి ఇటీవల 25 ఏళ్ల మైలురాయిని అడుగుపెట్టిన విషయం తెలిసిందే. 2000లో గుజరాత్ ముఖ్యమంత్రిగా ప్రారంభమై, ప్రస్తుత ప్రధాని పదవిలో ఉన్నందుకు మోడీ ఘనత సాధించారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు, అభిమానులు సోషల్ మీడియాలో శుభాకాంక్షలు తెలిపారు. అలాగే, మోడీని కీర్తిస్తూ బాలీవుడ్‌కి చెందిన స్టార్ నిర్మాణ సంస్థ టీ సిరీస్ ఒక పాటను విడుదల చేసింది. 'మోడీ హై తో ముంకిన్ హై' అనే పాటను విడుదల చేయగా.. ఈ ప్రచార గీతం నెటిజన్లను ఆగ్రహానికి గురి చేసింది. ఇది 'పొలిటికల్ ప్రాపగాండా' అని ప్రజల పన్ను డబ్బును ప్రధాని గత 11 ఏళ్లుగా వృథా చేస్తున్నాడని నెటిజన్లు తీవ్ర విమర్శలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఈ పాట ఒక చెత్త రికార్డును అందుకుంది. యూట్యూబ్‌లో విడుదలైన ఈ పాటకు వారం రోజుల్లోనే లక్షకు పైగా డిస్‌లైక్‌లు వచ్చాయి. అయితే ఈ రికార్డును మళ్లీ చెరిపివేస్తూ.. తాజాగా 3 లక్షలకు చేరింది. ప్రస్తుతం ఈ పాటను 35 వేల మంది లైక్ చేయగా.. 3 లక్షల 13 వేల మంది డిస్‌లైక్ (వ్యతిరేకంగా)బటన్‌ని లైక్ చేశారు. దీంతో మోడీపై వ్యతిరేకత ఏ రేంజ్‌లో ఉందో అర్థం చేసుకోవచ్చని అంతా చర్చించుకుంటున్నారు.

# లక్షల్లో పెట్టుబడి.. వేలల్లో పరిహారం...

**ప్రజాశక్తి-పత్తికొండ**

ఉల్లి చేసిన మేలు తల్లి కూడా చేయదు అనే సామెత.. పాలకుల విధానాల వలన ఉల్లిసాగు చేసిన రైతు మాత్రం కష్టాల పాలవుతున్నారు. జిల్లాలో మొత్తం 45 వేల ఎకరాలకు పైగా ఉల్లిసాగుచేస్తే పత్తికొండ ఉద్యానవన శాఖ పరిధిలోని పత్తికొండ, తుగ్గలి,మద్దికేర, దేవనకొండ మండలాల్లోని సుమారు 20,000 ఎకరాలలో ఉల్లి సాగు చేశారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది ఉల్లి సాగు విస్తీర్ణం పెరిగినట్లు అధికారులు చెబుతున్నారు. ఏప్రిల్, మే, జూన్ మాసాలలో బోరు బావులు ద్వారా ఉల్లి సాగుచేసిన రైతులు పంట చేతికి వచ్చే సమయానికి గిట్టుబాటు ధర లేకపోవడంతో కొందరు రైతులు పంట పొలాల్లోని వదిలేశారు. ఇప్పటివరకు 5,970 ఎకరాలలోని ఉల్లి పంటను కోతకోసి మార్కెట్ తీసుకుని వెళ్లి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటూ రైతులు అమ్ముకున్నారు. ఖరీఫ్ సీజన్‌లో వర్షాధారంపై ఆధారపడి జూన్, జూలై మాసాలలో ఉల్లి సాగు చేశారు. ఒక ఎకరా ఉల్లి పంట పంట చేతికొచ్చే సమయానికి ఎరువులు, పిచికారి మందులతో పాటు కూలీ ఖర్చులు కలుపుకొని రూ. ఒకలక్ష రూపాయల పెట్టుబడి వస్తుందని రైతులు చెబుతున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో ఏం చేయాలో తెలియక రైతులు అయోమయంలో ఉన్నారు. కనీసం పంటకు గిట్టుబాటు ధర లభిస్తుందే భరోసా ఇవ్వని రోజులొచ్చాయని కన్నీరు మున్నీరవులున్నారు. రెవిన్యూ ,



వ్యవసాయ అధికారులు పట్టీపట్లనట్లుగా వ్యవహరిస్తున్నా రని రైతులు మండిపడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటామని చెబుతున్న మాటలు మాటలకే పరిమితమయ్యాయి. ఉల్లి పంట ఎకరా పంట సాగు చేయడానికి లక్ష రూపాయలు ఖర్చవుతుంటే రూ. 25,000 నష్టపరిహారం ప్రకటించడం పట్ల రైతు సంఘం నాయకులు మండి పడుతున్నారు. ప్రభుత్వాలు రైతులు పట్టించుకోకపోతే రాబోయే రోజుల్లో పుట్టగథలు ఉండవని మేధావులు హెచ్చరిస్తున్నారు.

### పంట నమోదు తప్పనిసరి

రాష్ట్ర ప్రభుత్వం అందించే నష్టపరిహారం కావాలంటే ప్రతి రైతు ఈ పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలి. ఉల్లి పంట 110-120 రోజుల తర్వాత కోత కోసి గ్రేడింగ్ బాగా చేసుకుంటే మంచి ధర లభిస్తుంది.

**- పత్తికొండ హార్టికల్చర్ ఇంచార్జ్ అధికారి రఘువరన్.**


### నష్టపరిహారం కోసం ఎదురుచూస్తున్నాం

నాలుగు ఎకరాల్లో ఉల్లి సాగు చేశాను. ఎకరాకు రూ.50వేల వరకు ఎరువులు పిచికారి మందులకు ఖర్చు పెట్టాను. ఎకరా మొత్తం సాగుకు రూ.లక్షకు పైగా ఖర్చుచేశాను. పంట చేతికొచ్చే సమయానికి ధర లేకపోవడం తో ఏం చేయాలో దిక్కు తోచడం లేదు. ప్రభుత్వం ఇచ్చే నష్ట పరిహారం వస్తే ఉల్లి పంటను తొలగించి మరో పంట వేసుకోవడానికి ఉపయోగపడుతుందని ఎదురుచూస్తున్న. చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక ఇబ్బందులు పడుతున్నా..

**- రైతు వన్నూరు సాహెబ్, హోసూరు, పత్తికొండ**

## ఢిల్లీలో క్షీణిస్తున్న వాయునాణ్యత

**ఢిల్లీ :** దీపావళికి ముందు దేశ రాజధాని ఢిల్లీలో ఎయిర్ క్వాలిటీ పడిపోతుంది. ఐదు రోజులుగా గాలి నాణ్యత క్షీణిస్తోంది. వికాస్‌పురి ప్రాంతంలో ఎయిర్ క్వాలిటీ 238గా నమోదైంది. దీంతో వికాస్‌పురి ప్రజలు ఇళ్ల వదిలి బయటకు రాని పరిస్థితి ఏర్పడింది. అక్షరధామ్ ప్రాంతంలో వాయు నాణ్యత 426గా నమోదైంది. ఈ సీజన్‌లో నగరంలో ఇదే అత్యధిక కాలుష్య స్థాయి అని సిపిసిబి వెల్లడించింది. ఆనంద్ విహార్ ప్రాంతం 418 ఎక్యూఐతో తర్వాతి స్థానంలో ఉంది. పెరుగుతున్న కాలుష్య స్థాయిలను అరికట్టడానికి ఇండియా గేట్ వద్ద వాటర్ స్ప్రింక్లర్లను మోహరించినట్లు కాలుష్య నియంత్రణ బోర్డు అధికారులు పేర్కొన్నారు. ఆదివారం ఉదయం ఈ ప్రాంతంలో వాయు నాణ్యత 269గా నమోదైనట్లు తెలిపారు. రాజధానిలోని 38 వాయు పర్యవేక్షణ కేంద్రాలలో తొమ్మిది ఇప్పటికే అత్యంత పేలవమైన కేటగిరిలోకి వచ్చినట్లు తెలిపారు. ఆనంద్ విహార్‌లో (389), వజీర్‌పూర్ (351), జహంగీర్‌పురి (310), ద్వారక (310) ఎక్యూఐలతో అత్యంత ప్రభావిత ప్రాంతాలుగా ఉన్నాయి. చలిమంటలు, బాణసంచా పేలుళ్లతో రానున్న రోజుల్లో వాయు కాలుష్యం మరింత పెరుగుతుందని అధికారులు అంచనా వేశారు.




## చంద్రునిపై సూర్యుని ప్రభావాలను పరిశీలించిన చంద్రయాన్-2

**బెంగళూరు :** చంద్రయాన్ -2 తొలిసారిగా చంద్రునిపై సూర్యుని కోరోనల్ మాస్ ఎజెక్షన్ (సౌర విస్ఫోటనం- సిఎంఇ) ప్రభావాలను పరిశీలించినట్లు ఇస్రో ప్రకటించింది. చంద్రాస్ అట్మాస్ఫియరిక్ కంపోజిషన్ ఎక్స్‌ప్లోరర్-2 (సిహెచ్ఎసిఇ-2) పేలోడ్ ఈ పరిశీలన చేసినట్లు తెలిపింది. సిఎంఇ చంద్రునిపై ప్రభావం చూపినప్పుడు సిహెచ్ఎసిఇ-2 నుండి వచ్చిన పరిశీలనలు పగటిపూట చంద్రునిపై వాతావరణంలోని పీడనంలో పెరుగుదల ఉన్నట్లు ఇస్రో ప్రకటించింది. ఈ పరిశీలన నుండి పొందిన మొత్తం సంఖ్య సాంద్రత (యూనిట్ వాల్యూమ్‌కు వాతావరణంలో ఉన్న తటస్థ అణువులు లేదా అణువుల సంఖ్య) పరిమాణ క్రమంలో పెరుగుదలను చూపినట్లు పేర్కొంది. ఈ పెరుగుదల గతంలోని సైద్ధాంతిక నమూనాలకు అనుగుణంగా ఉంది. ఇది అటువంటి ప్రభావాన్ని అంచనా వేసింది. కానీ చంద్రయాన్-2లో ఉన్న సిహెచ్ఎసిఇ-2 మొదటిసారి అటువంటి ప్రభావాన్ని గమనించిందని ఇస్రో వెల్లడించింది. 2024 మే 10న, సూర్యుని నుండి వరుసగా వచ్చిన సిఎంఇలను చంద్రునిపై వాతావరణ ప్రభావాన్ని ప్రత్యక్షంగా పరిశీలించే అవకాశం లభించిందని ఇస్రో తెలిపింది. 2019 జులై 22న శ్రీహరికోట నుండి జిఎస్ఎల్‌వి-ఎంకె3-ఎం1 రాకెట్ ద్వారా ప్రయోగించబడిన చంద్రయాన్ -2 ఎనిమిది ప్రయోగాత్మక పేలోడ్‌లను మోసుకువెళ్లింది. అదే ఏడాది ఆగస్టు 20న చంద్రుని కక్ష్యలోకి విజయవంతంగా చేరింది. విక్రమ్ ల్యాండర్, చంద్రుని ఉపరితలంపై మృదువుగా ల్యాండ్ చేసేందుకు ప్రయత్నించగా... ల్యాండర్, గ్రౌండ్ స్టేషన్ నుండి కమ్యూనికేషన్ కోల్పోయింది.

## బహిరంగ ప్రదేశాలలో బురఖా, నఖాబ్‌పై నిషేధం

- పోర్చుగల్ పార్లమెంట్ ఆమోదం...

**లిస్బన్ :** బహిరంగ ప్రదేశాలలో బురఖా, నఖాబ్ (ముస్లిం మహిళలు కప్పుకునే ముసుగు) ధరించడాన్ని పోర్చుగల్ ప్రభుత్వం నిషేధించింది. దీనికి సంబంధించిన బిల్లును పోర్చుగల్ పార్లమెంట్ ఆమోదించింది. సంప్రదాయ విలువలను పాటించే చెగా పార్టీ ఈ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టింది. బహిరంగ ప్రదేశాలలో బురఖా, నఖాబ్ ధరిస్తే రూ.20,000 నుంచి నాలుగు లక్షల రూపాయల వరకు జరిమానా విధిస్తారు. బురఖా ధరించాల్సిందిగా ఒత్తిడి చేస్తే మూడు సంవత్సరాల జైలు శిక్ష పడుతుంది. విమానాలు, మత ప్రదేశాలు, రాయబార కార్యాలయాలలో బురఖా ధరించడాన్ని అనుమతిస్తారు. ఫ్రాన్స్, ఆస్ట్రియా, బెల్జియం, నెదర్లాండ్స్ వంటి యూరోపియన్ యూనియన్ దేశాలలో ఇప్పటికే ఈ నిషేధం పూర్తిగా లేదా పాక్షికంగా అమలులో ఉంది. బిల్లుపై దేశాధ్యక్షుడు మార్సెలో రెబెలో డి సౌసా ఇంకా సంతకం చేయలేదు. ఆయన ఈ బిల్లును తిరస్కరించవచ్చు లేదా పరిశీలన కోసం న్యాయస్థానానికి నివేదించవచ్చు. బిల్లు పై పార్లమెంటులో చర్చ జరిగిన సందర్భంగా వామపక్ష మహిళా సభ్యులు దానిని తీవ్రంగా వ్యతిరేకించారు. చెగా పార్టీ నేత ఆండ్రే వెంటురాకు, వారికి మధ్య వాగ్వివాదం జరిగింది. ఇతర పార్టీల మద్దతుతో బిల్లు ఆమోదం పొందింది.

# జెఎన్‌యు విద్యార్థులపై ఎబివిపి గూండాల దాడి

- నిరసిస్తూ మార్చ్ చేపట్టిన నేతలపై పోలీసుల లాఠీఛార్జ్
- విద్యార్థిసంఘం ఆఫీస్ బేరర్ల సహా ఆరుగురిపై కేసు
- దాడిచేసిన వారిపై కేసు నమోదు చేయాలి : ఎస్ఎఫ్ఐ


ఢిల్లీలోని వసంత్ కుంజ్ పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులు

**ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో**

జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జెఎన్‌యు) విద్యార్థులపై ఎబివిపి గూండాలు దాడి చేశారు. దీనిని నిరసిస్తూ మార్చ్ చేపట్టిన జెఎన్‌యు విద్యార్థి సంఘం ఆఫీస్ బేరర్లు సహా ఆరుగురు విద్యార్థులపై ఢిల్లీ పోలీసులు కేసు నమోదు చేశారు. విద్యార్థి సంఘం ఎన్నికలను అడ్డుకునే లక్ష్యంతో క్యాంపస్‌లో దాడి చేసిన ఎబివిపి గూండాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసులు లాఠీఛార్జ్ చేశారు. అనంతరం విద్యార్థులను అరెస్టు చేసి వారిపై కేసు నమోదు చేశారు. జెఎన్‌యుఎస్‌యు అధ్యక్షులు నిదీష్ కుమార్, ప్రధాన కార్యదర్శి ముంటేహా ఫాతిమా, ఉపాధ్యక్షులు మనీషాపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. విద్యార్థులపై దాడి చేసిన ఎబివిపి గూండాలపై కేసు నమోదు చేయలేదు. దీనిపై ఢిల్లీ పోలీసులను ఎస్ఎఫ్ఐ సహా జెఎన్‌యులోని విద్యార్థి సంఘాలన్నీ నిలదీస్తున్నాయి.

యూనివర్సిటీలో ఎబివిపి రాష్ట్ర జాయింట్ సెక్రటరీ వికాస్ పటేల్, ఇతరులు హింసకు ప్రేరేపించారు. దీన్ని ప్రశ్నించిన విద్యార్థులపై దాడికి దిగారు. జెఎన్‌యుఎస్‌యు అధ్యక్షులు నిదీష్ కుమార్‌ను కొట్టిన, ఇతర ఆఫీసు బేరర్లపై కులతత్వ, ఇస్లామోఫోబిక్, స్త్రీ ద్వేషపూరిత వ్యాఖ్యలు చేసిన ఎబివిపి గూండాలపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐతో సహా వామపక్ష విద్యార్థి సంఘాలు శనివారం రాత్రి వసంత్ కుంజ్ పోలీస్ స్టేషన్‌కు శాంతియుతంగా మార్చ్ నిర్వహించాయి. యూనివర్సిటీ వెస్ట్ గేటు వద్ద విద్యార్థుల మార్చ్‌ను పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై పోలీసులు దాడి చేశారు. ఎస్ఎఫ్ఐ నేత సూరజ్ ముఖంపై, కడుపుపై తీవ్రంగా కొట్టారు. విద్యార్థినుల దుస్తులను పోలీసులు చింపేశారు. సివిల్ డ్రెస్‌లో వచ్చిన పోలీసులు నిర్దాక్షిణ్యంగా కొట్టారు. ఎస్ఎఫ్ఐ నేతలు అభిషేక్ కుమార్, ఉత్సాతో పాటు 28 మంది విద్యార్థులను అదుపులోకి తీసుకున్నారు. జెఎన్‌యు విద్యార్థులపై పోలీసుల దౌర్జన్యానికి వ్యతిరేకంగా ఆగ్రహం వ్యక్తం చేస్తూ విద్యార్థులు పోలీస్ స్టేషన్‌కు సామాజిక న్యాయ మార్చ్ నిర్వహించారు. వారి ఆందోళనకు దిగొచ్చిన పోలీసులు అర్ధరాత్రి సమయంలో అదుపులోకి తీసుకున్న విద్యార్థులను విడుదల చేశారు. వారిలో ఆరుగురిపై కేసు నమోదు చేశారు. మరోవైపు ఈ దాడిలో ఎస్ఎఫ్ఐ నేతలు అభిషేక్ కుమార్, ఉత్సాతో పాటు మరి కొంతమంది విద్యార్థులకు గాయాలయ్యాయి. వారిని సఫ్దర్ జంగ్ ఆస్పత్రికి తరలించారు. విద్యార్థులను కొట్టిన పోలీసులపై చర్య తీసుకోవాలని ఎస్ఎఫ్ఐతో సహా విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. విద్యార్థినులపై మగ పోలీసులు దాడి చేశారని, చాలా మంది పోలీసులు యూనిఫాం ధరించకుండా ఉన్నారని ఎస్ఎఫ్ఐ నేత గోపిక విమర్శించారు. ఎస్ఎఫ్ఐ నేత అభిషేక్ కుమార్ తీవ్ర గాయాలతో ఆస్పత్రి పాలయ్యారని, ఆయన ప్రైవేట్ పార్ట్స్‌తో సహా ఇతర భాగాల్లో గాయాలయ్యాయని తెలిపారు. జనరల్ బాడీ మీటింగ్‌లను అడ్డుకుంటూ జెఎన్‌యుఎస్‌యు కౌన్సిలర్లు, ఆఫీస్ బేరర్లపై దాడి చేస్తున్న ఎబివిపి గూండాలపై 48 గంటలు గడిచినా ఎటువంటి ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడం దారుణమన్నారు. విద్యార్థులను వేధించినప్పుడు మౌనంగా ఉన్న పోలీసులు శాంతియుత నిరసనలో పాల్గొన్న విద్యార్థులపై దాడి చేశారని విమర్శించారు.

**పోలీసుల క్రూరత్వాన్ని ఖండించిన జెఎన్‌యుటియు**

విద్యార్థులపై పోలీసుల క్రూరత్వాన్ని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ టీచర్స్ యూనియన్ (జెఎన్‌యుటియు) ఖండించింది. ఈ మేరకు ఆదివారం జెఎన్‌యుటియు అధ్యక్ష, కార్యదర్శులు సూజిత్ మజుందార్, మీనాక్షి సుంద్రియల్ ప్రకటన విడుదల చేశారు. విద్యార్థులపై ఢిల్లీ పోలీసుల హింసను తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. శనివారం ముగ్గురు జెఎన్‌యుఎస్‌యు ఆఫీస్ బేరర్లు సహా 28 మంది విద్యార్థులను పోలీసులు అదుపులోకి తీసుకోవడం దారుణమన్నారు. విద్యార్థులపై పోలీసులు క్రూరమైన బలప్రయోగాన్ని ప్రదర్శించారని, దీనివల్ల అనేకమంది విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారని పేర్కొన్నారు. దాడికి గురైన వారిలో విద్యార్థినులు కూడా ఉన్నారని, రాత్రి ఏడు గంటల తరువాత విద్యార్థులను అదుపులోకి తీసుకోవడం చాలా తీవ్రమైన ఆందోళన కలిగిస్తోందని పేర్కొన్నారు. పోలీసుల చర్య శాంతిభద్రతల పరిరక్షణ కాకుండా ఇతర లక్ష్యాలతో ప్రేరేపించినట్లు కనిపిస్తోందని విమర్శించారు. రెండు రోజుల క్రితం ఢిల్లీ యూనివర్సిటీ కాలేజీలో ఒక ఉపాధ్యాయుడు సమక్షంలోనే దాడి జరిగినప్పుడు ఢిల్లీ పోలీసుల వైఫల్యం కనిపించిందని, జెఎన్‌యులో 2020 జనవరి 5న ముసుగు దుండగులు చేసిన హింసాత్మక దాడులను పోలీసులు ఆపలేకపోయారని అన్నారు. ఆరేళ్లు గడిచినా వారిలో ఒక్కరినీ కూడా గుర్తించలేదని పేర్కొన్నారు. శాంతియుతంగా ప్రదర్శన నిర్వహించిన విద్యార్థులపై లాఠీఛార్జ్ చేసి, అదుపులోకి తీసుకోవడం దారుణమన్నారు. విద్యార్థులపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని విద్యార్థులు మార్చ్ నిర్వహిస్తే, మార్చ్ నిర్వహించిన వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడం సిగ్గుచేటన్నారు. వైస్ ఛాన్సలర్ చాలా ప్రమాదకరంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. అటువంటి ధోరణలను మొగ్గలోనే అరికట్టడంలో అడ్మినిస్ట్రేషన్ విఫలమైతే, యూనివర్సిటీలో తీవ్ర పరిణామాలు చోటు చేసుకుంటాయని హెచ్చరించారు. ఈ పరిస్థితుల్లో అప్రమత్తంగా ఉండి హింస, బలప్రయోగాన్ని అడ్డుకునేందుకు, ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు శాంతియుత ఆందోళన చేపట్టాలని పిలుపునిచ్చారు.

**గొంతునొక్కే ప్రయత్నాలు మానండి**
**జెఎన్‌యు విద్యార్థులపై దాడిని ఖండించిన సిపిఎం**

జెఎన్‌యు విద్యార్థులపై పోలీసుల హింసాత్మక దాడిని సిపిఎం తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది. తమపై దాడి చేసిన ఎబివిపి అరాచక శక్తులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ జెఎన్‌యు విద్యార్థి సంఘం ఆధ్వర్యాన జరిగిన ర్యాలీపై ఢిల్లీ పోలీసుల హింసాత్మక దాడిని సిపిఎం తీవ్రంగా ఖండించింది. నిరసన తెలుపుతున్న విద్యార్థుల డిమాండ్లను అంగీకరించడానికి బదులుగా వారిపైనే పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారని విమర్శించింది. సంఘ్ పరివార్‌కు వ్యతిరేకంగా మాట్లాడే వారి గొంతునొక్కే మరో ప్రయత్నమని పేర్కొంది.

# ఎందుకీ మౌనం?
## కీలక అంశాలపై పెదవి విప్పని ప్రధాని

**న్యూఢిల్లీ :** గాజా శాంతి ఒప్పందంపై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటన చేసినప్పుడు ప్రధాని నరేంద్ర మోడీ ఉత్సాహంగా స్పందించారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేయబోమని తనకు మోడీ హామీ ఇచ్చారంటూ ట్రంప్ చేసిన ప్రకటనపై ఆయన పెదవివిప్పలేదు. భారత్-పాక్ మధ్య యుద్ధాన్ని నివారించింది తానేనని ట్రంప్ పలు సందర్భాలలో చెప్పినప్పుడు కూడా ఆయన మౌనాన్నే ఆశ్రయించారు. అమెరికా అధికారులు మన దేశానికి చెందిన వలసదారులకు సంకెళ్లు వేసి, సైనిక విమానాలలో కుక్కి పంపించినప్పుడు కూడా ఆయన మౌనంగానే ఉండిపోయారు. దేశ ప్రయోజనాలకు సంబంధించిన విషయాలలో మోడీ ఎందుకు సరిగా స్పందించలేకపోతున్నారన్నదే ఇక్కడ ప్రశ్న. 'ఇండియా ఫస్ట్' అనే మోడీ నినాదం ఏమైపోయింది?



**పుండు మీద కారం**

ట్రంప్ తన స్నేహితుడని మోడీ ఆప్యాయంగా ప్రశంసించారు. ఆ స్నేహితుడు ఏం చేశాడు? మతపరమైన శతృత్వంపై ద్వేషపూరిత అభిప్రాయాలు వ్యక్తం చేసి ప్రపంచాన్ని ఆందోళనకు గురిచేసిన పాకిస్తాన్ ఫీల్డ్ మార్షల్ అశి మునీర్‌పై అసాధారణ అభిమానం ప్రదర్శించి పుండు మీద కారం చల్లారు. ఈ విషయాన్ని కూడా మోడీ విస్మరించారు. ఈ లక్షణాలు దృఢమైన నాయకత్వానికి చిహ్నాలు కావని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడ్డారు.

**బలమైన ప్రధాని అంటే...**

బలమైన ప్రధాని రాజకీయ లేదా వ్యక్తిగత పరిస్థితులు, పరిణామాలతో నిమిత్తం లేకుండా జాతి ప్రయోజనాల గురించి మాట్లాడతారు. తనపై తీవ్రమైన ఆరోపణలు వస్తే దర్యాప్తులను అడ్డుకోవడానికి న్యాయస్థానాలను ఆశ్రయించకుండా తన నిజాయితీపై వచ్చిన సందేహాలను నివృత్తి చేసేందుకు ప్రయత్నిస్తారు. అవసరమైతే ధైర్యంగా విచారణను కూడా ఎదుర్కొంటారు. బలమైన ప్రధాని వివిధ దేశాలలో పత్రికా సమావేశాలు నిర్వహిస్తారు. ప్రశ్నలు సంధించే విలేకరులను ఏమార్చకుండా నిజాయితీగా సమాధానాలు ఇస్తారు. అన్నింటినీ మించి అంతర్జాతీయ సంఘర్షణల విషయంలో దేశం యొక్క విశిష్టమైన నైతిక వైఖరిని గట్టిగా వినిపిస్తారు.

**ఏం చేయాలంటే...**

గాజా మారణహోమాన్ని నిరసిస్తూ ఐరాసలో అనేక పర్యాయాలు ఓటింగ్ జరిగినప్పుడు భారత్ ఊగిసలాట వైఖరిని ప్రదర్శించింది. తాజాగా ట్రంప్ ప్రతిపాదించిన శాంతి ప్రణాళికపై స్పష్టంగా అభిప్రాయాన్ని తెలియజేయాల్సిన అవసరం ఉంది. ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహూ సాగించిన జాతి విధ్వంసకాండను మన జ్ఞాపకాల నుంచి తొలగించలేమని గట్టిగా చెప్పాల్సి ఉంటుంది. గాజా పునర్నిర్మాణం, పాలస్తీనా భవిష్యత్తు, ఇజ్రాయిల్ దురాక్రమణపై మన వైఖరిని స్పష్టం చేయాలి. నెతన్యాహూపై ప్రేమ కురిపించే ఏ నాయకుడి శాంతి ప్రయత్నాలను గుడ్డిగా నమ్మకూడదు. భారత ప్రస్తుత నాయకత్వం గాంధీ, నెహ్రూ చూపిన మార్గాన్ని అనుసరించి ఉంటే శాంతి స్థాపనలో మనం కీలక పాత్ర పోషించి ఉండే వారం.

## బీహార్‌లో ఏం జరుగుతోంది?

దేశంలోని అతి పెద్ద రాష్ట్రాలలో బీహార్ ఒకటి. అక్కడ శాసనసభ ఎన్నికలు జరగబోతున్నాయి. 'గుంతలు నిండిపోయాయి' అని హోం మంత్రి అమిత్ షా ఇటీవల గర్వంగా ప్రకటించారు. అందుకు పదిహేను సంవత్సరాలు పట్టిందని కూడా ఆయన చెప్పారు. ఇక రాబోయే అయిదు సంవత్సరాలలో నిజమైన అభివృద్ధి ప్రక్రియ ప్రారంభమవుతుందని అన్నారు. ఇప్పటికే బీహార్ గ్రామాలకు మరుగుదొడ్లు, విద్యుత్, రహదారులు వంటి మౌలిక సదుపాయాలు కల్పించామని, రాబోయే కాలంలో వేగవంతమైన పారిశ్రామికీకరణ జరుగుతుందని అమిత్‌షా తెలిపారు. అక్కడ ఆశించిన స్థాయిలో పనులు జరగడం లేదు. దర్భాంగాలో ఎయిమ్స్‌ను నిర్మిస్తామని 2015 బడ్జెట్‌లో ప్రకటించారు. పది సంవత్సరాలు గడిచినా పెద్దగా పురోగతి లేదు. దర్భాంగాలో ఎయిమ్స్ సిద్ధంగా ఉన్నదని మోడీ, అమిత్ పచ్చి అబద్ధాలు చెబుతున్నారు. అటు ముఖ్యమంత్రి నితీష్ కుమార్ కూడా ఆర్‌జెడి అధినేత లాలూ ప్రసాద్ యాదవ్‌పై ఆరోపణలు గుప్పిస్తున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మహిళల ఖాతాల్లో రూ.10 వేలు చొప్పున సొమ్ము వేసిన సంగతి తెలిసిందే. నిరక్షరాస్యత, నిరుద్యోగం తదితర సమస్యలు పేరుకుపోయిన రాష్ట్రంలో మహిళలకు ఎన్నికల తాయిళంగా రూ.10 వేలు ఇవ్వడం కాకుండా, వారు అభివృద్ధి చెందేలా చేయూతనివ్వాలని కొందరు అభిప్రాయ పడుతున్నారు. మహారాష్ట్ర ఎన్నికల తరువాత నిలిపివేసిన ట్లు నిలిపివేస్తారని పలువురు విమర్శిస్తున్నారు. రాష్ట్రంలో అసలు ఉనికిలోనే లేని అంశాన్ని 'చొరబాటు' పేరుతో మోడీ, షా లేవనెత్తుతున్నారు. రాహుల్‌గాంధీకి అసలు అజెండా అంటూ ఏదీ లేదని, ఆయన చొరబాటుదారులతో ర్యాలీ నిర్వహించారని షా ఆరోపించారు. రాహుల్ యాత్ర 'ఓట్ చోరీ'ని ప్రముఖంగా ప్రస్తావించి ప్రత్యర్థుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తోంది. బీహార్‌లో పరిస్థితులు అధ్వానంగా ఉన్నాయి. అనేక సూచీలలో రాష్ట్రం బాగా వెనుకబడి ఉంది. ఉదాహరణకు శిశు మరణాల రేటును తీసుకుంటే 2023లో కేరళలో ప్రతి వెయ్యి జననాలకు ఐదుగురు చిన్నారులు మరణించారు. అదే బీహార్‌లో 38 మంది ప్రాణాలు విడిచారు. బీహార్‌లో తలసరి ఆదాయం రూ.43,000 అయితే కేరళలో రూ.2.6 లక్షలు.

**25 మంది అభ్యర్థులతో ఎఐఎంఐఎం జాబితా**

బీహార్ అసెంబ్లీ ఎన్నిక కోసం అసదుద్దీన్ ఒవైసీ నేతృత్వంలోని ఎఐఎంఐఎం 25 మంది అభ్యర్థులతో ఆదివారం జాబితాను విడుదల చేసింది. ఎఐఎంఐఎం రాష్ట్ర అధ్యక్షులు, ప్రస్తుత బీహార్ అసెంబ్లీలో పార్టీకి ఉన్న ఏకైక ఎమ్మెల్యే అఖ్తరుల్ ఇమాన్‌కు అమౌర్ స్థానం నుంచి మళ్లీ అవకాశం ఇచ్చింది. ఎఐఎంఐఎం ప్రకటించిన స్థానాల్లో ఎక్కువ భాగం ముస్లిములు అధికంగా ఉన్న సీమాంచల్ ప్రాంతంలోనే ఉన్నాయి.

**టిక్కెట్ల కోసం ఆర్‌జెడిపై తీవ్ర ఒత్తిడి**

బీహార్ ఎన్నికల్లో ఆర్‌జెడి టిక్కెట్ల కోసం తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటోంది. పరిహార్ స్థానం నుంచి తనకు టిక్కెట్ కేటాయించకపోతే స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని ఆర్‌జెడి మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు రీతు జైస్వాల్ ఆదివారం ప్రకటించారు. నిజానికి ఈ స్థానానికి ఆర్‌జెడి ఇంకా అభ్యర్థిని ఇంకా ప్రకటించలేదు. ఈ స్థానం నుంచి పార్టీ సీనియర్ నాయకులు రామ్ చంద్ర పూర్వే కోడలు స్మితకు టిక్కెట్ కేటాయిస్తారని జోరుగా ప్రచారం జరుగుతోంది. ఆర్‌జెడిపై అభ్యర్థుల నుంచి తీవ్ర స్థాయిలో ఒత్తిడి వస్తోందని, అందుకే ఇండియా బ్లాక్ నుంచి ఎక్కువ సీట్లు కోరుతున్నామని పార్టీ సీనియర్ నాయకులు మృత్యుంజయ్ తివారీ ఆదివారం విలేకరులతో తెలిపారు.

## సత్ప్రవర్తనలోనూ కేరళ ముందంజ

- బిజెపి పాలిత గుజరాత్, ఉత్తరప్రదేశ్ వెనుకబాటు
- ఇండియా టుడే సర్వేలో వెల్లడి


కేరళ జైలులో ప్రభుత్వ ప్రోత్సాహంతో నైపుణ్యం సంపాదించి... హెయిర్ కటింగ్, గ్రూమింగ్ ద్వారా ఆదాయం పొందుతున్న సత్ప్రవర్తన గల ఖైదీలు

**తిరువనంతపురం :** దేశవ్యాప్తంగా పౌరుల వైఖరులు, ప్రవర్తన (బిహేవియర్)ను అంచనా వేయడానికి ఇండియా టుడే నిర్వహించిన మొట్టమొదటి జాతీయ ప్రవర్తనా సూచికలో కేరళ అగ్రస్థానంలో నిలిచింది. ఈ రకమైన మొట్టమొదటి సామాజిక బేరోమీటర్ అయిన ఈ సర్వే నిర్వహించారు. నాలుగు అంశాల ఆధారంగా రాష్ట్రాలను అంచనా వేసింది. పౌర ప్రవర్తన, ప్రజా భద్రత, లింగ వైఖరులు, వైవిధ్యం, వివక్షత, భారతదేశం అభివృద్ధి చెందుతున్న సామాజిక నిర్మాణంపై వివరణాత్మక సర్వే నిర్వహించింది. కేరళ మొత్తం మీద అగ్రస్థానంలో నిలిచింది, రెండు, మూడు స్థానాల్లో తమిళనాడు, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర నాల్గవ స్థానంలో ఉన్నాయి. మరోవైపు, ఉత్తరప్రదేశ్, పంజాబ్, మధ్యప్రదేశ్ అత్యల్ప ర్యాంక్ పొందిన రాష్ట్రాలుగా నిలిచాయి. పౌర అవగాహన, సామాజిక బాధ్యతకు శ్రద్ధ అవసరమయ్యే ప్రాంతాలకు ప్రాధాన్యతనిచ్చింది.

నియమాలకు కట్టుబడి ఉండటం, సమాజ భాగస్వామ్యం, సామాజిక బాధ్యతను కొలిచే పౌర ప్రవర్తన విభాగంలో, తమిళనాడు దేశానికి నాయకత్వం వహించింది. ప్రజా భద్రతలో కేరళ సూచికలో అగ్రస్థానంలో ఉంది. చట్ట అమలు, వ్యక్తిగత భద్రతా భావంపై బలమైన ప్రజా విశ్వాసాన్ని ప్రదర్శిస్తుంది, ఆ తరువాత స్థానాల్లో హిమాచల్ ప్రదేశ్, ఒడిశా ఉన్నాయి. ఉత్తరప్రదేశ్, పంజాబ్ అత్యల్ప స్థానాలను ఆక్రమించాయి. లింగ సమానత్వం, మహిళా సాధికారతపై ప్రగతిశీల అభిప్రాయాలను ప్రదర్శిస్తూ కేరళ కూడా లింగ వైఖరిలో ముందుంది. ఉత్తరాఖండ్, తమిళనాడు దగ్గరగా ఉన్నాయి, ఉత్తరప్రదేశ్, గుజరాత్ అట్టడుగు స్థానంలో ఉన్నాయి. వైవిధ్యం, వివక్ష నిర్మూలన విభాగంలో కేరళ మళ్లీ మొదటి స్థానంలో నిలిచింది. సామాజిక సమ్మిళితత్వం, కుల, మత, సాంస్కృతిక వైవిధ్యాన్ని అంగీకరించడంలో ఉన్నత స్థాయిని ప్రదర్శించింది. తమిళనాడు, పశ్చిమ బెంగాల్ తర్వాతి స్థానాల్లో ఉండగా, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ అత్యల్ప స్థానంలో ఉన్నాయి.

**సర్వే వివరాలు**

స్థూల దేశీయ ప్రవర్తన సర్వే 22 రాష్ట్రాలను కవర్ చేసింది. ముఖాముఖి ఇంటర్వ్యూల ద్వారా 9,188 మంది పాల్గొన్నారు. వారి నుంచి ప్రతిస్పందనలను సేకరించింది. నమూనాలో దాదాపు సమానమైన లింగ పంపిణీ ఉంది. 50.8 శాతం మంది పురుషులు, 49.2 శాతం మంది మహిళలు, సమతుల్య ప్రాతినిధ్యాన్ని నిర్ధారించారు. సర్వే గ్రామీణ-పట్టణ జనాభా నిష్పత్తిని కూడా ప్రతిబింబిస్తుంది, పట్టణ ప్రాంతాల నుంచి 54.4 శాతం, గ్రామీణ ప్రాంతాల నుంచి 45.6 శాతం మంది సర్వేలో పాల్గొన్నారు.

## తక్షణమే కాల్పుల విరమణ

- దోహా చర్చల్లో ఆఫ్ఘన్, పాక్ అంగీకారం

**దోహా :** ఖతార్ రాజధాని దోహాలో పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్ మధ్య జరిగిన శాంతి చర్చలు ఫలించాయి. తక్షణమే కాల్పుల విరమణ పాటించేందుకు ఇరు పక్షాలు అంగీకరించాయి. ఖతార్ విదేశాంగ శాఖ ఆదివారం ఉదయం ఈ విషయాన్ని ప్రకటించింది. పాక్, ఆఫ్ఘన్ సరిహద్దులో వారం రోజుల పాటు జరిగిన ఘర్షణల్లో అనేక మంది చనిపోగా వందలాది మంది గాయపడ్డారు. ఘర్షణలకు ముగింపు పలికేందుకు టర్కీ మధ్యవర్తిత్వంతో దోహాలో శాంతి చర్చలు జరిగాయి. కాల్పుల విరమణ అమలును పరిశీలించేందుకు రాబోయే రోజుల్లో సమావేశాలు నిర్వహించాలని రెండు దేశాలు నిర్ణయించాయి. రెండు దేశాల మధ్య దీర్ఘకాల శాంతి, సుస్థిరత సాధించేందుకు ఓ యంత్రాంగాన్ని ఏర్పాటు చేసేందుకు కూడా అంగీకరించాయి. దోహా చర్చల్లో ఆఫ్ఘనిస్తాన్ బృందానికి రక్షణ మంత్రి ముల్లా మహమ్మద్ యాకూబ్ నేతృత్వం వహించగా, పాకిస్తాన్ ప్రతినిధి బృందానికి ఆ దేశ రక్షణ మంత్రి ఖవాజా మహమ్మద్ అసిఫ్ నాయకత్వం వహించారు. 2021లో కాబూల్‌లో తాలిబాన్లు తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్ మధ్య తీవ్రమైన ఘర్షణ వాతావరణం నెలకొంది. కాబూల్ వైపు నుంచి ఉగ్రవాదులు తమ దేశంలో దాడులు చేస్తున్నారని, వారిని ఆఫ్ఘనిస్తాన్ అణచివేయాలని పాకిస్తాన్ డిమాండ్ చేయడంతో ఘర్షణలు మొదలయ్యాయి. ఉగ్రవాదులను తాను ఆశ్రయం కల్పించడం లేదని ఆఫ్ఘనిస్తాన్ స్పష్టం చేసింది. పాకిస్తాన్ తప్పుడు ప్రచారం చేస్తోందని, తనను అస్థిరపరచడానికి కొన్ని గ్రూపులకు మద్దతు ఇస్తోందని ప్రత్యారోపణ చేసింది. కాల్పుల విరమణ అమలులో ఉన్నప్పటికీ పౌరులను లక్ష్యంగా చేసుకొని పాకిస్తాన్ దాడులు జరిపిందని మండిపడింది.

## భారతీయులందరినీ బహిష్కరించాలి

- చాండ్లర్ లాంగేవిన్ విద్వేషపూరిత పోస్టు
- అమెరికాలో ఇండియన్స్ తీవ్ర ఆగ్రహం

**న్యూయార్క్ :** అమెరికాకు చెందిన రాజకీయ నేత చాండ్లర్ లాంగేవిన్ భారతీయులకు వ్యతిరేకంగా విద్వేషపూరిత వ్యాఖ్యలు చేశారు. అమెరికాలో ఉన్న ప్రతి భారతీయుడిని వెంటనే బహిష్కరించాలంటూ ఆయన పెట్టిన పోస్టులపై అక్కడ నివసిస్తున్న భారతీయులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫ్లోరిడాలోని పామ్ బే సిటీ కౌన్సిల్‌కు కన్జర్వేటివ్ నాయకుడైన లాంగేవిన్, గత కొన్ని రోజులుగా భారతీయులకు వ్యతిరేకంగా పోస్టులు పెడుతున్నారు. ఇటీవల ఓ ట్రక్ డ్రైవర్ కారణంగా ఓ మహిళ ప్రాణాలు కోల్పోయిందనే వార్తను సోషల్ మీడియాలో పంచుకున్న లాంగేవిన్, ఆ పోస్టు కింద అమెరికాలోని భారతీయులందరినీ వెంటనే బహిష్కరించాలంటూ రాసుకొచ్చారు. అమెరికా గురించి పట్టించుకునేందుకు ఒక్క భారతీయుడు కూడా లేరని, వారు మనల్ని ఆర్థికంగా దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. ఆ దేశ ప్రజలను ప్రోత్సహించేందుకే ఇక్కడ ఉన్నారని, యూఎస్‌లో అమెరికన్లు మాత్రమే ఉండాలంటూ మరో పోస్టు పెట్టారు. చాండ్లర్ లాంగేవిన్ పోస్టుపై అక్కడి భారతీయులతోపాటు పామ్ బే మేయర్ మదీనా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇతరులను కించపరిచేలా, విలువలు తగ్గించేలా మన మాటలు ఉండకూడదని, అలాంటి వారికి ఇక్కడ చోటులేదని ఘాటుగా బదులిచ్చారు. "ఈ రోజు నా పుట్టినరోజు. ప్రతి భారతీయుడి వీసాను రద్దు చేసి వెంటనే వారిని ఇక్కడి నుంచి బహిష్కరించాలి. ఇదే నా కోరిక" అంటూ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌ను ట్యాగ్ చేసి పోస్టు పెట్టారు. నెలరోజులుగా ఆయన పెడుతున్న విద్వేషపూరిత పోస్టులపై అక్కడి భారతీయ అమెరికన్ గ్రూపులతో పాటు కాంగ్రెస్ సభ్యుల నుంచి తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది.

**చర్యలు తీసుకున్న పామ్ బే నగర కౌన్సిల్**

ఆయన వ్యాఖ్యల నేపథ్యంలో నగర కౌన్సిల్‌కు ఫిర్యాదులు అందడంతో కౌన్సిల్ లాంగేవిన్‌పై చర్యలు తీసుకుంది. ఇక నుంచి ఆయన ఏదైనా ఎజెండాను ప్రవేశపెట్టాలనుకుంటే ముందే ఏకాభిప్రాయం పొందాల్సి ఉంటుంది. పామ్ బే నగర కౌన్సిల్ లాంగేవిన్‌ను కమిటీ నుంచి తొలగిస్తూ నిర్ణయం తీసుకుంది. కమిటీ నుంచి ఆయన్ను తొలగించడంతో పాటు ఆయన ఎలాంటి వ్యాఖ్యలు చేయకుండా చేసింది. ఈ చర్యలను లాంగేవిన్ తీవ్రంగా ఖండించారు. అంతకుముందు అమెరికా సెనెటర్ జిమ్ బ్యాంక్స్ కూడా భారత్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. భారత్, చైనా వంటి దేశాల నుంచి దిగుమతి చేసుకొనే ఔషధాలు నాసిరకంగా ఉన్నాయని వ్యాఖ్యలు చేశారు.

## మాల్దీవుల్లోని భారతీయులపై ఆంక్షలు ఉపసంహరించండి

- ఎస్‌బిఐకి సిపిఎం ఎంపి లేఖ

**న్యూఢిల్లీ :** మాల్దీవుల్లోని ప్రవాస భారతీయులకు చెల్లింపుల పరిమితిని ఉపసంహరించుకోవాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ)ని సిపిఎం రాజ్యసభ సభ్యులు ఎఎ రహీం కోరారు. మాల్దీవుల్లోని బ్యాంక్ శాఖలు ఇటీవల విధించిన ఆంక్షల కారణంగా, అక్కడ నివసిస్తున్న చాలామంది భారతీయులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ఎస్‌బిఐ ఛైర్మన్‌కి రాసిన లేఖలో పేర్కొన్నారు. నెలవారీ ఎంవిఆర్ (మాల్దీవియన్ రూపాయి) - ఐఎన్ఆర్ (భారతీయ రూపాయి) చెల్లింపుల పరిమితి తాత్కాలికంగా ప్రతి ఖాతాదారునికి 150 డాలర్లు (సుమారు ఎంవిఆర్ 2313)కి తగ్గించాయని, ఈ ఏడాది అక్టోబర్ 25 నుండి అమల్లోకి రానుందని తెలిపారు. ఇవి కాకుండా మాల్దీవుల వెలుపల ఎంవిఆర్ కార్డులతో ఎటిఎం విత్‌డ్రాలు, ఇసిఒఎం / పిఒఎస్ లావాదేవీలు నిలిపివేశారని పేర్కొన్నారు. ఈ చర్య భారత్‌లో తమ కుటుంబాలను పోషించేందుకు క్రమం తప్పకుండా చెల్లింపులు చేసే భారతీయ కార్మికులు, నిపుణులకు తీవ్ర ఇబ్బందులను కలిగిస్తుందని తెలిపారు.

ఈ ఆకస్మిక ఆంక్షలు వారి ఆర్థిక స్థిరత్వాన్ని దెబ్బతీయడంతో పాటు మాల్దీవుల ఆర్థిక వ్యవస్థ, భారత్‌కు విదేశీ మారకద్రవ్యాన్ని అందించే పరిస్థితుల్లో అనిశ్చితిని సృష్టించాయని పేర్కొన్నారు. ఈ నిర్ణయాన్ని వెంటనే సమీక్షించి, దాని ప్రభావాన్ని తగ్గించేందుకు, మాల్దీవుల్లోని భారతీయులకు, వారి కుటుంబాలకు ఉపశమనం కలిగించేందుకు చర్యలు తీసుకోవాలని రహీం ఎస్‌బిఐని అభ్యర్థించారు.

## గాజాపై ఆగని ఇజ్రాయిల్ దాడులు

**జెరుసలేం :** కాల్పుల విమరణ ఒప్పందం అమల్లో ఉన్నా గాజాపై ఇజ్రాయిల్ దాష్టీకం కొనసాగుతూనే ఉంది. ఆదివారం గాజాలోని మూడు ప్రాంతాలపై ఇజ్రాయిల్ సైన్యం వైమానిక, ఫిరంగి దాడులకు పాల్పడింది. గాజా స్ట్రిప్‌కు దక్షిణంగా ఉన్న రఫా పట్టణంపైనా, ఖాన్ యూనిస్‌కు సమీపంలోనూ, తూర్పువైపున ఉన్న అబాసన్ పట్టణంపైనా ఇజ్రాయిల్ దాడులకు పాల్పడింది. ఈ దాడుల గురించి ఇజ్రాయిల్ ప్రభుత్వ ప్రతినిధిని మీడియా ప్రశ్నించగా, ఆయన స్పష్టంగా సమాధానం ఇవ్వలేదు. సైన్యాన్ని అడగాలని చెప్పారు. ఈ దాడులు గురించి సైన్యం ఎటువంటి ప్రకటన చేయలేదు. టైమ్స్ ఆఫ్ ఇజ్రాయిల్ మాత్రం రఫాపై సైన్యం వైమానిక దాడులను నిర్వహిస్తోందని తెలిపింది.

మరోవైపు ఇజ్రాయిల్ అధికారులు హమాస్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తున్నట్లు ప్రచారం చేస్తున్నారు. దీన్ని హమాస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. పాలస్తీనా మిలిటెంట్ గ్రూప్ కాల్పుల విరమణకు కట్టుబడి ఉందని హమాస్ సీనియర్ అధికారి ఇజ్జత్ అల్ రిషేక్ ఆదివారం తెలిపారు. ఇజ్రాయిల్ పదేపదే కాల్పుల విరమణను ఉల్లంఘిస్తోందని విమర్శించారు. హమాస్ గ్రూప్ కాల్పుల విరమణను ఉల్లంఘిస్తుందని అమెరికా చేసిన ప్రకటనను ఖండించారు. కాల్పుల విమరణ ఒప్పందం తరువాత ఇజ్రాయిల్ 47 సార్లు ఉల్లంఘనలకు పాల్పడిందని గాజాలోని ప్రభుత్వ మీడియా కార్యాలయం తెలిపింది. ఈ దాడుల్లో 47 మంది మరణించగా, మరో 38 మంది తీవ్రంగా గాయపడ్డారని వెల్లడించింది. 'పౌరులపై ప్రత్యక్ష కాల్పులకు పాల్పడటం, ఉద్దేశపూర్వకంగా షెల్లింగ్‌లకు పాల్పడటం, అమాయక ప్రజలను అరెస్టు చేయడం వంటివి ఉన్నాయి' అని మీడియా కార్యాలయం వెల్లడించింది.


శిథిలాల కుప్పగా ఉన్న గాజా

**రఫా క్రాసింగ్ మూసివేత**

హమాస్ కాల్పుల విరమణకు పాల్పడుతోందని ఆరోపిస్తూ.. గాజా, ఈజిప్టు మధ్య ఉన్న రఫా సరిహద్దు క్రాసింగ్‌ను ఇజ్రాయిల్ మూసివేసింది. తదుపరి నోటీసు ఇచ్చే వరకూ క్రాసింగ్ మూసివేసి ఉంటుందని ప్రకటించింది. గత ఏడాది మే నుంచి అనేక పర్యాయాలు ఈ క్రాసింగ్‌ను మూసివేసింది. దీంతో మానవతా సాయం అందించడానికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఐపిసి గ్లోబల్ హంగర్ మానిటర్ ఆగస్టులో చేసిన నిర్ధారణ ప్రకారం గాజాలో లక్షలాది మంది ప్రజలు కరువు బారినపడ్డారు. కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన తర్వాత కూడా అమానవీయంగా వ్యవహరిస్తున్న ఇజ్రాయిల్ తీరును పలువురు విమర్శిస్తున్నారు.

దీపావళి ... చుట్టూ చీకట్లు కమ్ముకున్న వేళ ... దీపాలు వరుసగా కొలువు తీరే పర్వదినం. ఆవరించిన కటిక చీకటిని తరిమికొట్టే తరుణం. మతాబులు చేతపట్టి పిల్లలు మురిసిపోయే సంబరం. ఆ పిల్లల ముఖాల్లోని సందడిని తిలకించి, పెద్దలు సంతోషపడే సందర్భం. దీపాలు బయటే కాదు; మనిషి లోలోపలా వెలగాలి. కుత్సితాలూ కుతంత్రాలూ, స్వార్థాలూ యుద్ధాలూ, ద్వేషాలూ విద్వేషాలూ వంటి అన్ని చీకట్లూ పారిపోవాలి. అప్పుడు ఇంటింటికి మాత్రమే కాదు; ఈ ఇల అంతటా మానవతా దీపాలు జగజ్జేయమానంగా వెలుగుతాయి. ప్రపంచం నిండా సుఖసంతోషాలు వెల్లువెత్తుతాయి.

## నవ్వుల దీపావళి



పాపాయి ఏడ్చింది
టపాకాయలు అడిగింది

వద్దమ్మ.. వద్దని
అమ్మమ్మ చెప్పింది

పాపాయి అలిగింది
మంకు పట్టు పట్టింది

గాయాలు అవుతాయని
నానమ్మ చెప్పింది

పాపాయి ఒప్పుకోక
బుంగమూతి పెట్టింది

కాలుష్యమవుతుందని
తాతయ్య చెప్పాడు

పాపాయి ఊరుకోక
మారాము చేసింది

మామయ్య వచ్చాడు
ప్రమిదలు వెలిగించాడు

కాంతులు విరజిమ్మింది
పాపాయి నవ్వింది

– కయ్యూరు బాలసుబ్రమణ్యం,
94417 81239.



## దీపావళి

భలే భలే పండుగ
పసందైన పండుగ

ఆనందాలు నిండుగా
దీపావళి పండుగ

చెడుపై సాధించిన
విజయమే ఈ పండుగ

పరమత సహనంతో
జరుపుకునేదే ఈ పండుగ

తారాజువ్వలా ఆకాశంలో
మెరవాలి
చిచ్చుబుడ్డిలా కాంతులు
విరజిమ్మాలి

సీమటపాకాయ్‌లా
చిటపటలాడాలి
లక్ష్మీ బాంబులా మోత మోగాలి

భూ చక్రం వలె గిర్రునా తిరగాలి
మతాబు వలే మౌనంగా వెలగాలి

పిల్లా పెద్ద అందరూ కలిసి
ఆనందంగా జరుపుకోవాలి

ఆహ్లాదాన్ని పంచుకోవాలి
అదే దీపావళికి వేదిక కావాలి

– ఏడుకొండలు కళ్ళేపల్లి,
మచిలీపట్నం,
94908 32338.

## నేను గీసిన బొమ్మ





కె.అభినయ్
6వ తరగతి,
ఎంపియుపి స్కూల్,
పి.నైనవరం,
ఎన్‌టిఆర్ జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com


# చీకట్లను తరిమే జ్ఞానమే దీపావళి



దీపావళి ఎందుకూ అంటే– నాలుగైదు కథలు వినిపిస్తాయి. చెడు మీద మంచి సాధించిన విజయానికి ప్రజలు చేసుకున్న సంబరం అని ఆ కథల సారాంశాన్ని బోధిస్తాయి. ఒక సందడి ప్రతి ఏటా ఒక పండగలా జరుగుతుందీ అంటే– దానికొక ఆరంభం కచ్చితంగా ఉండి తీరుతుంది. ఆ ఆరంభం ఇంత ఆడంబరంగా ఉందా? ఇన్నిన్ని హంగూ ఆర్భాటాలతో ఉందా? అంటే కచ్చితంగా ఉండి ఉండదనే చెప్పొచ్చు. ఏ పండగైనా, పర్వదినమైనా మొదలైనట్టే చివరి కంటా సాగదు. కాలాన్ని బట్టి చుట్టూ రకరకాల హంగులను చేర్చుకుంటూ సాగుతాయి. కొన్ని సార్లు ఏది కారణమో అది కూడా మూలకు వెళ్లిపోతుంది. ఏ పండగలోనైనా వ్యాపారం ఎంత జొరబడితే అది అంత ఆర్భాట తతంగమైపోతుంది. మత ఛాందసం ఎంత ప్రవేశిస్తే అంత అజ్ఞాన ప్రచారానికి గురవుతుంది. ఇప్పుడు చాలా పండగలకు ఈ రెండు జాడ్యాలూ అంటుకున్నాయి. వీటి ప్రభావానికి గురి కాకుండా ఉండటమే నిజమైన దీపావళి.

**దీపమే తొలి పండగ!**

దీపావళికి ఓ మూడు దశాబ్దాల క్రితం వరకూ ఇప్పుడున్నంత హడావిడి లేదు. హంగామా లేదు. బాంబుల మోతలూ, కాలుష్య కారక కాల్పులూ లేవు. మట్టి ప్రమిదల్లో పత్తి పోగుల వత్తులు పెట్టటం, నూనె లేదా ఆముదం పోసి, దీపాలు వెలిగించటం ... అదే ప్రకాశవంతమైన, ప్రశాంతమైన దీపావళి. గోగుకొమ్మలకు గుడ్డ పీలికలు కట్టటం, నూనెతో వెలిగించి ... 'దుబ్బూ దుబ్బూ అమాస ... మళ్లీ వచ్చే నాగుల చవితి' అని నేలన కొట్టటం ... ఇంచుమించుగా ఇంతే సందడితో దీపావళి ముగిసేది. వేలాది రూపాయల ఖర్చు లేదు. రసాయన వాయువుల కాలుష్యం లేదు. చెవులు చిల్లులు పడే క్రాకర్ల మోత లేదు. ఇలాంటి ప్రశాంత దివ్వెల పండగే ఇప్పుడు పర్యావరణానికి హితం చేకూర్చుతుంది. ఈ మాటనే గతంలో కోర్టులు కూడా చెప్పాయి. 'క్రాకర్ల కాల్పుల మీద నియంత్రణలా?' అంటూ కొంతమంది పూనకాలు ప్రదర్శించటం ఛాందసవాదం తప్ప మరొకటి కాదు. ఈ భూమికి, వాతావరణానికి, మనకు హాని కలగని రీతిలో దీపావళి జరుపుకోవటమే విజ్ఞత.



**విద్వేష చీకటి పోవాలి!**

దీపావళి రోజున ఇంటింటా పూసిన వెలుగు పూలు ఒక్కరోజుకే పరిమితమవుతాయి. కానీ, అలాంటి "దివ్వెలు మనుషులలో, మనసులలో వెలిగితే– లోకం మొత్తం ప్రతినిత్యం దీపావళి కాంతులతో కళకళ్లాడుతుంది. ప్రతి మనిషీ ప్రతి ఒక్కరికీ శ్రేయోభిలాషి అవుతాడు. ద్వేషం, విద్వేషం సమసిపోయి, ఎల్లెడలా శాంతి సామరస్యాలు నెలకొంటాయి." అంటాడు విశ్వకవి రవీంద్రనాథ్ టాగూర్. ఎంతో గొప్ప ఆకాంక్షో కదా ఇది! ఇప్పుడు దేశానికి, ప్రపంచానికీ కావాల్సింది ఇలాంటి దివ్వెల వెలుగులే! మనం ఎప్పుడెప్పటివో పాత కథలు గొప్పగా చెప్పుకోవొచ్చు. చెడు మీద మంచి గెలిచిన విజయోత్సవం అని మురిసిపోవొచ్చు.

మరి వర్తమానం సంగతేమిటి?

ఇప్పుడు మనచుట్టూ ఆవరించివున్న చీకట్ల సంగతేమిటి?

మన చుట్టూ ఆక్రమిస్తున్న ద్వేషాలూ విద్వేషాలూ, వ్యత్యాసాలూ యుద్ధాలూ, అబద్ధాలూ ... తదితరాల సంగతేమిటి? గతం కథల ముసుగులో వర్తమానాన్ని విషతుల్యం చేస్తున్న అనాగరిక విష వంచకుల కుయుక్తుల సంగతేమిటి? పట్టించుకోవాలి మనం. పరిశీలించాలి మనం. నిజానిజాలను నిగ్గుతేల్చి, ప్రమాదకారుల నైజాలను బట్టబయలు చేయాలి. జ్ఞానదీపాలను వెలిగించాలి. అజ్ఞాన, ఆధిపత్య అంధకారాలను తరిమివేయాలి.

**వర్తమాన ధూర్తులు**

ఏది అత్యవసరమో దాని గురించి పట్టించుకోకుండా, ఏది అంత అవసరం కాదో దాని గురించి అత్యధికంగా మాట్లాడ్డమే పనిగా పెట్టుకుంటారు కొందరు. ప్రస్తుతం గురించి మనం మాట్లాడుతుంటే– అప్రస్తుతంగా చరిత్రలోకి బుర్ర దూర్చి, అదే పనిగా అబద్ధాలు వల్లిస్తారు మరికొందరు. హడావిడి చేసే వాళ్ల వెనకాల నడవటమే తమ ఉనికికి ఉత్తమ చర్యగా భావిస్తారు ఇంకొందరు. చుట్టూ చీకట్లతో ముంచెత్తి తమ నెత్తిన మాత్రమే దీపాన్ని పెట్టుకొని ఊరేగుతారు మరి మరి కొందరు. ఎక్కడ వెలుగు అవసరమో అక్కడి గురించి మాట్లాడ్డమే – సమాజానికి దీపావళి. వక్రమార్గం పట్టించే చక్రవ్యూహాల అసత్యాల ప్రచారంలో చిక్కుకుపోకుండా – వాస్తవాల ఒడ్డున నిలబడి నిక్కచ్చిగా మాట్లాడ్డమే ప్రస్తుత కాలంలో దీపావళి.

విశాఖపట్నం స్టీల్‌ప్లాంటును కాపాడుకోవటం రాష్ట్రానికి దీపావళి. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు ఇచ్చిన హామీలను నెరవేర్చటం వేలాదిమంది గిరిజనానికి దీపావళి. నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలను కల్పించే ప్రాజెక్టులను తేవటం, ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగావకాశాలు కల్పించటం అనేక కుటుంబాలకు దీపావళి. నిజాలను దాచి మభ్యపెట్టటం దీపావళి కాదు. అసలు కొనుక్కోవటానికే గతి లేదంటే– మిగిలిన జీఎస్టీతో పండగ చేసుకోండని చాటింపులేయటం దీపావళి కాదు. యుద్ధాలను రాజేసే ట్రంపే శాంతి వచనాలు పలకటం కటిక చీకటి మీద కాంతి రేపరు చుట్టటం తప్ప మరొకటి కాదు. విపరీత సుంకాల విధింపుతో విర్రవీగుతున్న దేశాన్ని 'డియర్ ఫ్రెండు' అని కావలించుకోవటం చీకటితో అంటకాగటంతో సమం. గాజా పిల్లలు గజగజ వణికిపోతుంటే, ప్రతినిత్యం బాంబుల శబ్దాలతో భీతిల్లిపోయేలా చేస్తుంటే– అది అమానవీయ అంధకారమే అవుతుంది. నాగరిక సమాజానికి మాయనిమచ్చవుతుంది. అలాంటి ఇజ్రాయిల్‌ని నిలువరించటం ప్రపంచంలోని అందరి బాధ్యత అవుతుంది.

**జ్ఞానదీపాలు వెలిగిద్దాం**

పాత కథలు పదే పదే వల్లించుకోవటం వల్ల ప్రయోజనం లేదు. మనచుట్టూ ఇప్పుడూ బోలెడు రాక్షస చర్యలు రాజ్యమేలుతున్నాయి. ఆడపిల్లలపై దారుణ అకృత్యాలతో భయపెడుతున్నాయి. ఆధిపత్య ధోరణులతో కులోన్మాదం, మతోన్మాదం పెచ్చరిల్లుతున్నాయి. వాటికి కోరలు తొడిగే కటిక చీకటి శక్తులు బోరవిరుచుకొని తిరుగుతున్నాయి.

అలాంటి శక్తులను నిలేయటం, నియంత్రించటం, నిర్మూలించటం ప్రస్తుత కాలపు కర్తవ్యం. వర్తమాన మనుషుల బాధ్యత. రండి .. తొలుత జ్ఞానదీపాలు వెలిగిద్దాం. ఆ వెలుగులో చీకటి శక్తులను గుర్తిద్దాం. తరిమేద్దాం. అందరిలో, అన్ని వైపులా మానవీయ దీప్తులు ప్రసరించటమే – ఇప్పుడు ఆవశ్యక దీపావళి. విద్వేషాన్ని, యుద్ధకావరాన్ని తొలగించి, శాంతిని సామరస్యాన్ని వెలిగించటమే దీపావళి.

**ఈరోజే వెలిగించండి**
**మీ ఇంట్లో, మీ ఒంట్లో**
**శాంతిదీపాన్ని .. సామరస్య దీపాన్ని ...**
**సౌభ్రాతృత్వ దీపాన్ని!**

**– సుజయ సాహితి**



# శ్రావ్య సంగీత సరస్వతి..



'ధరణికి గిరి భారమా? గిరికి తరువు భారమా? తరువుకి కాయ భారమా? కనిపెంచే తల్లికి పిల్ల భారమా?', 'అందాల ఆనందం ఇందేనయ.. అందం చూడవయా..', తానే మారెనా.. గుణంబే మారెనా.. దారి తెన్ను లేనే లేక ఈ తీరాయేనా..?, 'కన్నెమావి తోటలోనా.. చిన్నారి ఇల్లు కట్టి ఎన్నెన్నో కలలు కన్నానే..!' అంటూ ఎన్నో వందల పాటలతో వీనులవిందైన సంగీతంతో సినీ ప్రేక్షకులని అలరించిన శ్రావ్య కోయిల స్వరం ఆ తరువాత ఎన్నో నిర్బంధాలు ఎదుర్కొంది. సంకెళ్ల వంటి జీవితాన్ని అనుభవించింది. ఆ పరిస్థితుల నుండి బయటపడినా మారిన కాలంతో గొంతు కలిపే ఇష్టం లేక 'పోయి రావే అమ్మ పోయి రావమ్మ.. అత్తవారింటికి అపరంజి బొమ్మ.. అపరంజి బొమ్మ..' అన్న గీతంతో తన సినీ పాటలకి స్వస్తి పలికింది.

'ఆడపిల్ల.. బాల్యంలో తండ్రి, వివాహం తరువాత భర్త, వృద్ధాప్యంలో కొడుకుల సంరక్షణలో జీవించాలి. అంతకుమించి తనకు సొంత ఆలోచనలు, నిర్ణయాలు వంటివి ఉండవు..' అని ఎంతోమంది అనుభవాలు చెబుతున్నాయి. అలనాటి నేపథ్యగాయని రావు బాల సరస్వతి జీవితానికి కూడా ఈ మాటలు సరిగ్గా సరిపోతాయి. 97 ఏళ్ల ఆమె జీవితం మన కళ్లముందు అటువంటి ఎన్నో దృశ్యాలని చూపిస్తుంది.

నాలుగేళ్లకే స్టేజిపై వీనులవిందైన సంగీతాన్ని ఆలపించిన సరస్వతి 15 ఏళ్లు వచ్చేవరకు అప్రతిహతంగా ఎన్నో పాటలు పాడారు. లలితసంగీత తొలి నేపథ్య గాయనిగా, సినీ జగత్తులో పాడడం, నటించడం అలవోకగా చేసిన అద్భుత వ్యక్తిగా ఆమె పేరు చిరస్మరణీయం. హెచ్‌ఎంవి వంటి ప్రముఖ కంపెనీలో తన స్వరాన్ని వినిపించిన ప్రథమ మహిళ ఆమె. ఆకాశవాణి కేంద్రంలో తొలి లలిత సంగీతం ఆలపించిన గాయని తను. ఒక్కమాటలో చెప్పాలంటే సంగీతలోకంలో రెండు దశాబ్దాల పాటు స్వేచ్ఛగా విహరించిన కోయిల ఆమె.

1940ల్లో విడుదలైన ఎన్నో చిత్రాల్లో వివిధ పాత్రలు పోషించిన సరస్వతికి ఎదురైన కొన్ని అనుభవాలు నటిగా కంటే గాయనిగానే ఆమెని స్థిరపడేలా చేశాయి. మధురమైన గొంతుతో శ్రావ్యంగా ఆమె పాడే పాటలు వింటూ ప్రేక్షకులు మంత్రముగ్ధులయ్యేవారు. దిగ్గజ గాయనీమణులు ఉన్నా ఏరికోరి ఆమెతో పాటలు పాడించుకున్న సందర్భాలెన్నో ఉన్నాయి. ఇంతటి ప్రతిభ ఉన్న సరస్వతి, సంగీతమే ప్రపంచంగా బతికింది. అదే తన సర్వస్వం అనుకుంది. సినిమా పాటలు, స్టేజి షోలు, నాటకాలు ఎక్కడ చూసినా ఆమె గొంతే వినిపించేది.

లతా మంగేష్కర్ వంటి దిగ్గజ గాయనీమణులు సైతం ఈర్ష్యపడేంత శ్రావ్యమైన స్వరం సరస్వతిది.

ఒక సినిమాలో తనకెదురైన అనుభవాన్ని ఆమె ఓ ఇంటర్వ్యూలో ఇలా చెప్పారు. 'తమిళం, హిందీలో తెరకెక్కే ఓ సినిమాకి లత, నేను పాట పాడాలి. ముందుగా నేను పాడాను. ఆ తరువాత లత గొంతు సవరించుకోవాలి. కానీ నా పాట విన్న సంగీత దర్శకులు ఎంతో ఆనందపడిపోతూ.. 'అబ్బ.. ఎంత శ్రావ్యమైన స్వరం మీది.. మా తరువాతి సినిమాలకి కూడా మీరే పాడాలి. ముంబయికి వచ్చేయండి. ఇక్కడ మీకు అన్ని సౌకర్యాలు కల్పిస్తాం'. అన్నారు. ఈ మాటలు అక్కడే ఉన్న లత విన్నది. వెంటనే పక్క గదికి వెళ్లి కూర్చొంది. ఆ తరువాత 'ఆమెతో మీరు పాటలు పాడించుకుంటే.. నేను ఎప్పటికీ మీ సినిమాల్లో పాడను' అని తెగేసి చెప్పిందంట. ఆ నిర్మాతలు నాతో ఆ విషయం చెప్పి క్షమించమని కోరారు. ఆ విషయం నేను చాలా తేలిగ్గా తీసుకున్నాను. ఎందుకంటే అలాంటి అనుభవాలు నాకు ప్రతి చోటా ఎదురయ్యాయి' అని సరస్వతి చెప్పిన మాటలని బట్టి 'ప్రతిభ ఉన్న కళాకారులు కూడా తమ తోటి కళాకారిణి ప్రావీణ్యాన్ని గౌరవించలేరు' అని అర్థమౌతోంది.

ఇలాంటి సందర్భమే ఎం.డి.సిద్ధరామన్ సంగీత దర్శకత్వంలో కూడా ఆమెకి ఎదురైంది. అప్పుడు ఆ నిర్మాతలు ఆమె పాడిన పాటకి పారితోషికం ఇస్తూ.. 'ఇది మీ ప్రతిభకి ఇస్తున్న గౌరవం. కానీ మీరు పాడిన పాట సినిమాలో ఉంచం. నిర్మాత గారి బంధువు ఒకామె ఆ పాట తానే పాడతానని చెప్పారు' అని చెప్పారంట. అప్పుడు 'నేను పాడని పాటకి పారితోషికం అక్కర్లేదు' అని ఆ చెక్‌ని రెండు ముక్కలు చేసి చింపేసిన ధైర్యం ఆమెది.


ఇంతటి ధైర్యవంతురాలు, ప్రతిభావంతురాలిని 35 ఏళ్ల కోలంకి రాజావారు ఏరికోరి వివాహం చేసుకున్నారు. పెళ్లప్పుడు 'నాకు సంగీతమే ప్రపంచం. అది లేకుండా నేను బతకలేను. ఈ పెళ్లి నా ప్రతిభని అణగదొక్కకూడదు' అని రాజావారితో నిక్కచ్చిగా చెప్పిన ధీమంతురాలైన సరస్వతి, ఆ తరువాత భర్త నుండి ఎన్నో నిర్బంధాలను చవిచూడాల్సి వచ్చింది. 'పెళ్లిపై మీ అభిప్రాయం ఏంట'ని అడిగినప్పుడు.. 'అసలు నేను పెళ్లి చేసుకోకుండా ఉండల్సింది. అప్పుడు నేను ఈ సంగీత ప్రపంచంలో స్వేచ్ఛగా ఎగిరేదాన్ని. ఎన్నో కొత్త కొత్త విషయాలు నేర్చుకునేదాన్ని. నా జ్ఞానాన్ని మరింత మెరుగుపరుచుకునేదాన్ని. కానీ ఆ అవకాశాలేవీ నాకు రాలేదు. పంజరంలో చిక్కుకున్న పక్షిలా, వివాహం నా రెక్కలు తెంపేసింది' అని ఎన్నో ఏళ్ల తరువాత కూడా ఆమె ఆవేదనగా మాట్లాడారు.

ఆమె జీవితంలో ఏర్పడిన ఒకే ఒక్క లోటు పాటకి దూరమవ్వడం.. 'రాజావారు నిర్బంధం పెట్టకపోతే లలిత సంగీతంలో అజరామరంగా వెలుగొందేదాన్ని. ఎం.ఎస్ సుబ్బులక్ష్మి, నేను సమకాలీలం. ఆమెకి భర్త సహకారం ఎంతో ఉంది. అందుకే తను అంతలా ఎదిగింది. ఎక్కడ కొత్తదనం ఉంటే అక్కడికి తనని పంపించేవారు. నేర్పించేవారు. నాకు ఆ ఆదరణే దొరకలేదు. స్టేజిపై ప్రదర్శనలు ఇవ్వొద్దని, రికార్డింగ్స్‌కి వెళ్లొద్దని, ఆడ, మగ కలిసి కూర్చొని ఒకే మైక్ దగ్గర పాటపాడడం తనకి తలవొంపులని ఎన్నో కారణాలతో నన్ను ఇంటికే పరిమితం చేశారు. నన్ను కలవాలని వచ్చిన సంగీత దర్శకులని కూడా వెళ్లిపొమ్మని చెప్పేవారు. కొందరినైతే బెదిరించారు కూడా. ఈ పరిస్థితుల్లో నా పాటని విడిచిపెట్టాను. అది నాకు ఎంతోకష్టం.. అయినా తప్పలేదు. ఇప్పుడు అది తలచుకున్నా చాలా బాధగా ఉంటుంది' అని ఆమె అనేక ఇంటర్వ్యూల్లో చెప్పారు.

దాదాపు శతాబ్ద కాలంనాటి మనిషి సరస్వతి. కానీ ఆమెతో మాట్లాడుతున్నప్పుడు అలా అనిపించరు. ముక్కుసూటిగా మాట్లాడడం, నచ్చని విషయాలని నిర్మోహమాటంగా చెప్పడం, నిండైన ఆత్మగౌరవం తొణికిసలాడడం ఆమె ప్రతి మాటలో ధ్వనిస్తుంది. వేల పాటలు పాడిన ఆమె స్వరం మూగబోయినా, లలితసంగీతం ఉన్నంతవరకూ వినిపిస్తూనే ఉంటుంది. సంగీత ప్రియులను అలరిస్తూనే ఉంటుంది.

# భారత్‌పై ఆస్ట్రేలియా విజయం

- నిరాశపరిచిన కోహ్లి, రోహిత్
- తొలి వన్డేలో టీమిండియా పరాజయం
- భారత్ 136/9, ఆస్ట్రేలియా 131/3



**పెర్త్ :** డ్రాప్ ఇన్ పిచ్‌పై బౌలర్లు సమిష్టిగా రాణించటంతో భారత్‌తో తొలి వన్డేలో ఆస్ట్రేలియా 7 వికెట్ల తేడాతో గెలుపొందింది. జోశ్ హాజిల్‌వుడ్ (2/20), మిచెల్ ఓవెన్ (2/20), మాథ్యూ కున్హేమాన్ (2/26) రాణించటంతో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 26 ఓవర్లలో 9 వికెట్లకు 136 పరుగులు చేసింది. కెఎల్ రాహుల్ (38, 31 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), అక్షర్ పటేల్ (31, 38 బంతుల్లో 3 ఫోర్లు), నితీశ్ కుమార్ రెడ్డి (19 నాటౌట్, 11 బంతుల్లో 2 సిక్స్‌లు) ఫర్వాలేదనిపించే ఇన్నింగ్స్‌లు ఆడారు. సీనియర్ బ్యాటర్లు విరాట్ కోహ్లి (0), రోహిత్ శర్మ (8) సహా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (10), వైస్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (11) నిరాశ పరిచారు. స్వల్ప లక్ష్యాన్ని ఆస్ట్రేలియా 3 వికెట్లు కోల్పోయి 21.1 ఓవర్లలో ఛేదించింది. ఓపెనర్ మిచెల్ మార్ష్ (46 నాటౌట్, 52 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) అజేయ ఇన్నింగ్స్‌తో మెరువగా.. జోశ్ ఫిలిప్ (37, 29 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), మాట్ రెన్షా (21 నాటౌట్, 24 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్) రాణించారు. మరో 29 బంతులు మిగిలి ఉండగానే ఆస్ట్రేలియా 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది. మూడు మ్యాచుల వన్డే సిరీస్‌లో 1-0 ఆధిక్యం దక్కించుకుంది. ఛేదనలో అజేయ ఇన్నింగ్స్‌తో కదం తొక్కిన ఆసీస్ కెప్టెన్ మిచెల్ మార్ష్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు.

**వర్షం అంతరాయం :** భారత్, ఆస్ట్రేలియా మ్యాచ్‌కు వర్షం అంతరాయం కలిగింది. వర్షం సూచనలతో టాస్ నెగ్గిన ఆస్ట్రేలియా తొలుత బౌలింగ్ ఎంచుకుంది. భారత్ ఇన్నింగ్స్‌లో 8.5 ఓవర్లకు వర్షం అడ్డు తగిలింది. వర్షం, ఆ తర్వాత తడి అవుట్‌ఫీల్డ్‌తో మ్యాచ్ ముందుకు సాగలేదు. భారత ఇన్నింగ్స్‌కు ఏకంగా ఆరు సార్లు వరుణుడు అంతరాయం కలిగించాడు. డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం పలుమార్లు ఓవర్లను సవరించారు. ఆస్ట్రేలియా ఇన్నింగ్స్‌కు వర్షం అంతరాయం లేదు. డక్‌వర్త్ లూయిస్ ప్రకారం ఇరు ఇన్నింగ్స్‌లకు 26 ఓవర్లను నిర్దేశించగా.. ఆసీస్ లక్ష్యాన్ని 26 ఓవర్లలో 131 పరుగులకు సవరించారు. వర్షం కురిసినా.. పెర్త్ స్టేడియం 42423 మంది అభిమానులతో కిక్కిరిసింది.

**స్కోరు వివరాలు :**

**భారత్ ఇన్నింగ్స్ :** రోహిత్ శర్మ (సి) రెన్షా (బి) హాజిల్‌వుడ్ 8, శుభ్‌మన్ గిల్ (సి) ఫిలిప్ (బి) ఎలిస్ 10, విరాట్ కోహ్లి (సి) కానొల్లీ (బి) స్టార్క్ 0, శ్రేయస్ అయ్యర్ (సి) ఫిలిప్ (బి) హాజిల్‌వుడ్ 11, అక్షర్ పటేల్ (సి) రెన్షా (బి) కున్హేమాన్ 31, కెఎల్ రాహుల్ (సి) రెన్షా (బి) ఓవెన్ 38, వాషింగ్టన్ సుందర్ (బి) కున్హేమాన్ 10, నితీశ్ కుమార్ రెడ్డి నాటౌట్ 19, హర్షిత్ రానా (సి) ఫిలిప్ (బి) ఓవెన్ 1, అర్ష్‌దీప్ సింగ్ రనౌట్ 0, మహ్మద్ సిరాజ్ నాటౌట్ 0, ఎక్స్‌ట్రాలు : 8, మొత్తం : (26 ఓవర్లలో 9 వికెట్లకు) 136.

**వికెట్ల పతనం :** 1-13, 2-21, 3-25, 4-45, 5-84, 6-115, 7-121, 8-123, 9-124.

**బౌలింగ్ :** మిచెల్ స్టార్క్ 6-1-22-1, హాజిల్‌వుడ్ 7-2-20-2, నాథ్ ఎలిస్ 5-1-29-1, మిచెల్ ఓవెన్ 3-0-20-2, మాథ్యూ కున్హేమాన్ 4-0-26-2, మాథ్యూ షార్ట్ 1-0-17-0.

**ఆస్ట్రేలియా ఇన్నింగ్స్ :** మిచెల్ మార్ష్ నాటౌట్ 46, ట్రావిశ్ హెడ్ (సి) హర్షిత్ రానా (బి) అర్ష్‌దీప్ సింగ్ 8, మాథ్యూ షార్ట్ (సి) రోహిత్ (బి) అక్షర్ 8, జోశ్ ఫిలిప్ (సి) అర్ష్‌దీప్ (బి) వాషింగ్టన్ 37, మాట్ రెన్షా నాటౌట్ 21, ఎక్స్‌ట్రాలు : 11, మొత్తం : (21.1 ఓవర్లలో 3 వికెట్లకు) 131.

**వికెట్ల పతనం :** 1-10, 2-44, 3-99.

బౌలింగ్ : మహ్మద్ సిరాజ్ 4-1-21-0, అర్ష్‌దీప్ సింగ్ 5-0-31-1, హర్షిత్ రానా 4-0-27-0, అక్షర్ పటేల్ 4-0-19-1, నితీశ్ కుమార్ 2.1-0-16-0, వాషింగ్టన్ సుందర్ 2-0-14-1.

### తొలి ఎపి క్రికెటర్‌గా నితీష్ కుమార్ రెడ్డి రికార్డు

ఆస్ట్రేలియతో ఆదివారం మ్యాచ్‌లో విశాఖపట్నానికి చెందిన కె నితీష్‌కుమార్ రెడ్డి ఒక కొత్త రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. పెర్త్‌లో జరిగిన మ్యాచ్‌తో భారత్ తరపున నితీష్‌కుమార్ తన తొలి మ్యాచ్‌లో ఆడాడు. భారత కెప్టెన్ రోహిత్ శర్మ నుంచి వన్డే క్యాప్‌ను అందుకున్నాడు. దీంతో భారత్ తరపున మూడు ఫార్మెట్లల్లోనూ పాల్గొన్న తొలి ఆంధ్రప్రదేశ్ క్రికెటర్‌గా నితీస్‌కుమార్ ఘనత దక్కించుకున్నాడు. ఇప్పటి వరకూ రాష్ట్రం నుంచి భారతవన్డే జట్టులో అంబటి రాయుడు, వేణుగోపాల్ రావు మాత్రమే ప్రాతినిధ్యం వహించారు. గత ఏడాది అక్టోబర్‌లో బంగ్లాదేశ్‌తో మ్యాచ్‌లో టీ20ల్లోనూ, నవంబర్‌లో బోర్డర్–గవాస్కర్ ట్రోఫీతో టెస్టులోనూ భారత్ తరపున నితీష్‌కుమార్ ఎంట్రీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ ఘనత సాధించిన సందర్భంగా నితీష్‌కుమార్‌కు ఆంధ్రాక్రికెట్ అసోసియేషన్ అభినందనలు తెలిపింది.

## భారత్‌కు వరుసగా మూడో ఓటమి

- 4 పరుగుల తేడాతో గెలిచిన ఇంగ్లాండ్
- మహిళల వన్డే ప్రపంచ కప్

**ఇండోర్:** మహిళల వన్డే ప్రపంచ కప్ 2025లో భారత్‌కు వరుసగా మూడో ఓటమి ఎదురైంది. ఆదివారం ఇంగ్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో టీమిండియా పోరాడి ఓడింది. హర్మన్‌ప్రీత్ సేనపై ఇంగ్లాండ్ నాలుగు పరుగుల తేడాతో విజయం సాధించింది. హీథర్ నైట్ (109బీ 91 బంతుల్లో 15 ఫోర్లు, 1 సిక్స్) శతకం బాదడంతో తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్ 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 288 పరుగులు చేసింది. ఈ లక్ష్యఛేదనలో భారత్ 6 వికెట్లు కోల్పోయి 284 రన్స్ చేసింది. ఓపెనర్ స్మృతి మంధాన (88; 94 బంతుల్లో 8 ఫోర్లు), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (70; 70 బంతుల్లో 10 ఫోర్లు), దీప్తి శర్మ (50; 57 బంతుల్లో 5 ఫోర్లు) రాణించినా భారత్‌కు ఓటమి తప్పలేదు. హర్లీన్ డియోల్ (24) పరుగులు చేసింది. అమన్‌జ్యోత్ (18*; 15 బంతుల్లో 2 ఫోర్లు), స్నేహ్ రాణా (10*; 9 బంతుల్లో 1 ఫోర్) చివర్లో దూకుడుగా ఆడలేకపోయారు. 47 ఓవర్‌లో దీప్తి శర్మ ఔట్ కాగా.. చివరి మూడు ఓవర్లలో భారత్ విజయానికి 27 పరుగులు అవసరమయ్యాయి. 48 ఓవర్‌లో నాలుగే రన్స్ రావడంతో ఉత్కంఠ పెరిగింది. 49 ఓవర్‌లో 9 పరుగులు రాగా.. చివరి ఓవర్‌లో గెలుపు సమీకరణం 14గా మారింది. మొదటి ఐదు బంతుల్లో ఐదు పరుగులు మాత్రమే చేయడంతో భారత్ ఓటమి ఖరారైంది. ఇంగ్లాండ్ బౌలర్లలో నాట్ సీవర్ బ్రంట్ 2, లారెన్ బెల్, లిన్సే స్మిత్, షార్లెట్ డీన్, సోఫీ ఎకిల్‌స్టోన్ ఒక్కో వికెట్ పడగొట్టారు.



ఇంగ్లాండ్ బ్యాటర్లలో హీథర్ నైట్ శతకం చేయగా ఓపెనర్ అమీ జోన్స్ (56 : 68 బంతుల్లో 8 ఫోర్లు), నాట్ సీవర్ బ్రంట్ (38) రాణించారు. టామీ బ్యూమాంట్ (22), షార్లెట్ డీన్ (19*), సోఫియా డంక్లీ (15) పరుగులు చేశారు. భారత బౌలర్లలో దీప్తి శర్మ నాలుగు, శ్రీ చరణి 2 వికెట్లు దక్కించుకున్నారు.


Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68